www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



నైతిక విలువలుంటేనే
అమెరికా పౌరసత్వం

వలసదారుల దరఖాస్తులపై యూఎస్‌సీఐఎస్ ఆదేశం

ఎటువంటి నేరచరిత్ర లేకపోవడమే మంచి ప్రవర్తనగా నిర్వచనం 2

వాణిజ్య ఒప్పందంపై
ప్రతిష్టంభన!

భారత్-అమెరికా మధ్య చర్చల నిలిపివేత దిశగా పరిణామాలు


ఈ నెల 25న భారత్‌కు రావాల్సిన అమెరికా బృందం పర్యటన రద్దు! 2

సోమవారం | 18-8-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 163 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం, తిథి: దశమి సా.5:23 తదుపరి ఏకాదశి, నక్షత్రం: మృగశిర రా.2:06 తదుపరి ఆర్ద్ర, వర్జ్యం: ఉ.8:37-10:08, దుర్ముహూర్తం: మ.12:44-1:34, మ.3:14-4:04, అమృతఘడియలు: సా.5:44-7:15, రాహుకాలం: ఉ. 7:30-9:00, సూర్యోదయం: 6:02, సూర్యాస్తమయం: 6:35 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి

రాధాకృష్ణన్



మహారాష్ట్ర గవర్నర్ పేరును ఖరారు చేసిన బీజేపీ

- రాధాకృష్ణన్ తమిళనాడుకు చెందిన మాజీ ఎంపీ
- తెలంగాణ గవర్నర్‌గానూ కొన్నాళ్లు అదనపు బాధ్యతలు
- ఆరెస్సెస్‌తో సుదీర్ఘకాలంగా అనుబంధం
- వచ్చే ఏడాది తమిళనాడు శాసనసభ ఎన్నికలు
- వ్యూహాత్మకంగా ఎంపిక చేసిన కమలం పార్టీ
- ప్రతిపక్ష పార్టీలు కూడా మద్దతిస్తాయని అంచనా
- ఇండీ కూటమిలోని డీఎంకే వ్యతిరేకించదనే యోచన
- తమ అభ్యర్థిపై నేడు నిర్ణయం తీసుకోనున్న విపక్షాలు!

న్యూఢిల్లీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎవరన్న దానిపై ఉత్కంఠ వీడింది. మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పేరును బీజేపీ ఖరారు చేసింది. ఆదివారం ఢిల్లీలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశమై ఈ నిర్ణయం తీసుకుంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షాతోపాటు తెలంగాణకు చెందిన కె.లక్ష్మణ్ ఈ సమావేశానికి హాజరయ్యారు. సుదీర్ఘంగా చర్చించిన తర్వాత సీపీ రాధాకృష్ణన్ పేరుకు పార్లమెంటరీ బోర్డు ఆమోదం తెలిపింది. అనంతరం జేపీ నడ్డా మీడియా సమావేశంలో రాధాకృష్ణన్ పేరును ప్రకటించారు. తమిళనాడుకు చెందిన చంద్రాపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ 1957 మే 4న జన్మించారు. 1993 నుంచి 1998 వరకు ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత సంఘ్‌చాలక్‌గా పనిచేశారు. కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి రెండుసార్లు బీజేపీ తరఫున ఎంపీగా ఎన్నికయ్యారు. తమిళనాడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగానూ

మిగతా 3వ పేజీలో...

విజయం లాంఛనమే..!

పార్లమెంట్ ఉభయ సభల్లో ఉన్న వివిధ ఖాళీలతో కలిపి ప్రస్తుత సభ్యుల సంఖ్య 786. ఇందులో ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మెజారిటీకి 394 మంది సభ్యుల మద్దతు అవసరం. ప్రస్తుతం లోక్‌సభలో ఎన్డీఏకు 293 మంది, రాజ్యసభలో 129 మంది సభ్యుల మద్దతు ఉంది. ఉభయ సభల్లో కలిపి ఎన్డీఏ బలం 422. ప్రతిపక్ష ఇండియా కూటమికి లోక్‌సభలో 234 మంది, రాజ్యసభలో 79 మంది సభ్యులు.. మొత్తంగా 313 మంది అనుకూలంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో సీపీ రాధాకృష్ణన్ విజయం లాంఛనమే కానుంది. మెజారిటీ లేకపోయినా.. తమ వాణి వినిపించాలని ఇండియా కూటమి భావిస్తోంది. ఎన్డీఏ తమ అభ్యర్థిని ప్రకటించిన నేపథ్యంలో ఇండియా కూటమి తరఫున అభ్యర్థి అంశంపై చర్చించేందుకు కూటమి నేతలు సోమవారం ఉదయం సమావేశమవుతారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అయితే ఉప రాష్ట్రపతి ఎన్నిక ఏకగ్రీవమయ్యేందుకు ప్రతిపక్ష పార్టీలతో చర్చలు జరుపుతామని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రకటించారు.

వారంలో అఫిడవిట్ ఇవ్వాలి.. లేదా

క్షమాపణ చెప్పాలి

అధికార, విపక్షాలపై ఈసీ వివక్ష చూపదు

ఎన్నికల కమిషన్‌కు ఏ పార్టీ అయినా ఒకటే!

ఎన్నికల్లో కోటి మందికిపైగా సిబ్బంది పాల్గొంటారు

వారందరి ముందూ ఓట్ల దొంగతనం సాధ్యమా?

రాజకీయ ప్రయోజనాల కోసం

ఈసీ భుజాలపై తుపాకీ పెట్టి కాలుస్తున్నారు

రాహుల్ ఆరోపణలపై సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ధ్వజం

బిహార్‌లో తొలగించిన 65 లక్షల మంది పేర్లతో కూడిన జాబితాను వెబ్‌సైట్లలో పెట్టినట్టు వెల్లడి

ఈసీ వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయి: కాంగ్రెస్



విలేకరుల సమావేశంలో సీఈసీ జ్ఞానేశ్‌కుమార్

న్యూఢిల్లీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీని గెలిపించేందుకు ఎన్నికల కమిషన్ ఓట్ల చోరీకి పాల్పడుతోందంటూ కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్‌గాంధీ సహా విపక్షాలు చేస్తున్న ఆరోపణలపై ఈసీ ఘాటుగా స్పందించింది. ఈ ఆరోపణలను నిరూపించే సాక్ష్యాలతో వారంరోజుల్లోగా ప్రమాణపత్రాన్ని దాఖలు చేయాలని.. లేదా దేశానికి క్షమాపణ చెప్పాలని.. ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ రెండూ తప్ప మూడో ప్రత్యామ్నాయమే లేదని ఆయన స్పష్టం చేశారు. వారంరోజుల్లోగా ప్రమాణపత్రం తమకు అందకుంటే.. ఓటర్లజాబితాపై వస్తున్న ఆరోపణలన్నీ ఆధారరహితమైనవిగా పరిగణించాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. అధికార పార్టీకి, ప్రతిపక్షానికి మధ్య ఈసీ ఎలాంటి తేడా చూపదని, తమకు

మిగతా 2వ పేజీలో...

ఓట్లచోరీపై ఈసీకి 18 వేల అఫిడవిట్లిచ్చాం

ఒక్కదానిపైనా చర్యల్లేవ్.. ఈసీపై ఒత్తిళ్లున్నాయని తెలుసు 2

ఆ సంస్థలో ప్రక్షాళన జరగాల్సి ఉంది: అఖిలేశ్ యాదవ్



బిహార్‌లో ఓటర్ అధికార్ యాత్రలో రాహుల్, తేజస్వీయాదవ్

ఎన్నికల్ని ఈసీ తస్కరిస్తోంది!

ఓటర్ల తొలగింపు పథకాన్ని సాకారం కానివ్వం

బిహార్‌ను కాజేయడానికే 'సర్' కుట్ర: రాహుల్‌గాంధీ

ససారం నుంచి 'ఓటర్ అధికార్ యాత్ర'కు శ్రీకారం

20 జిల్లాల గుండా 1300 కిలోమీటర్ల యాత్ర



విశాఖ నగరంలోని జ్ఞానాపురం అండర్ బ్రిడ్జి వద్ద వరదనీటిలో బస్సు

5 జిల్లాలకు రెడ్ అలర్ట్

విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, పశ్చిమలో కుంభవృష్టి కురిసే అవకాశం

అల్పపీడనం.. వాయుగుండమయ్యే చాన్స్

ఓడరేవుల్లో మూడో నంబరు హెచ్చరిక

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచన

విపత్తుల సంస్థ టోల్‌ఫ్రీ నంబర్లు 112, 1070, 18004250101 విడుదల

విశాఖపట్నం, అమరావతి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాకు ఆనుకుని పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో ఆదివారం అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి సోమవారం నాటికి వాయుగుండంగా బలపడనుంది. ఆ తర్వాత 24 గంటల్లో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటి ఒడిశా, ఛత్తీస్‌గఢ్ దిశగా

మిగతా 12వ పేజీలో...

దంచికొట్టిన వాన

విశాఖ, శ్రీకాకుళం సహా పలు ప్రాంతాల్లో భారీ వర్షం

పొంగిన గెడ్డలు, వాగులు.. లోతట్టు ప్రాంతాలు జలమయం

భూములిక లీజుకే!

కేటాయింపులపై సంపూర్ణ నియంత్రణ!

లీజు గడువు కూడా గరిష్ఠంగా 33 ఏళ్లే

ప్రతి 2-3 ఏళ్లకోసారి ఫీజు పెంచాలి

రెవెన్యూ శాఖ తాజా ప్రతిపాదనలు

కేటాయించిన భూములను ఇతరత్రా వాడుకుంటున్న కొన్ని కంపెనీలు

ప్రభుత్వానికి తెలియకుండా తనఖా

రుణాలు తెచ్చుకుని ఆనక ఎగవేత

దీంతో ఆ భూములు వేలం వేసి అప్పు తీర్చాలని బ్యాంకులు గగ్గోలు 11

వీటి అడ్డుకట్టకే తాజా సూచనలు

సొంత భవనాలున్నా, భూములున్నా.. పార్టీలకు ప్రభుత్వ స్థలాలు ఇవ్వొద్దు

షెడ్యూల్డ్ ప్రాంతాల్లోనూ కేటాయించొద్దు

తెరపైకి మరిన్ని ప్రతిపాదనలు

ఇప్పటికే ఉపసంఘానికి నివేదిక

మార్కెట్ రేటుకో, సగానికో విక్రయించొద్దు
నామమాత్రంగా, ఉచితంగానూ ఇవ్వొద్దు



భూకేటాయింపుల నియంత్రణ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇకపై పరిశ్రమలు, కంపెనీలు, సంస్థలు, విద్యాసంస్థలు, వ్యవస్థలకు భూములను అమ్మకం ప్రాతిపదికన కేటాయించరాదని రెవెన్యూ శాఖ ప్రతిపాదించింది. అంటే మార్కెట్ ధరకు.. లేదా సగం ధరకే అమ్మడం.. కారుచౌకగానో, ఉచితంగానో ధారాదత్తం చేసే విధానాలకు స్వస్తిపలకాలని సూచించింది. పరిశ్రమలు, కంపెనీలు, వ్యవస్థలు, సంస్థల ఏర్పాటుకు ఎవరికైనా సరే నిర్దిష్ట కాలపరిమితితో లీజు ప్రాతిపదికన మాత్రమే భూములు కేటాయించాలని పేర్కొంది. ఈ ప్రతిపాదన త్వరలో మంత్రివర్గ ఉపసంఘం ముందుకు రానుంది.



వరద దుష్ప్రచారంపై

కేసులు

12

వైసీపీ అనుకూల మీడియాపై ప్రభుత్వం కొరడా

కొండవీటి వాగు వరదను గుంటూరు చానల్‌కు మళ్లించారని జగన్ చానల్‌లో కథనం.. పొన్నూరును ముంచేశారని తప్పుడు ప్రచారం

ప్రకాశం బ్యారేజీ గేటు విరిగింది.. బెజవాడకు వరద ముప్పుందంటూ సుమన్ టీవీ ప్రసారం.. తప్పుడు కథనాలపై ఇంజనీర్ల కేసులు

ఒకేరోజు 34 విభాగాల

ప్రైవేటీకరణ!



విశాఖ ఉక్కుయాజమాన్యం తాజా నోటిఫికేషన్ జారీ

కీలక విభాగాలు అప్పగించే యోచన.. కార్మికుల ఆగ్రహం

ప్లాంట్‌లో ఏం జరుగుతోంది?: సంఘాల మండిపాటు 11

సినీ ఫక్కీలో గంజాయి స్మగ్లర్ అరెస్ట్

పోలీసులను కారుతో ఢీకొట్టి పరార్.. పోలీసుల చేజింగ్

కాల్పులు జరిపి పట్టుకున్న సీఐ.. నిందితుడు పాత నేరస్థుడు..

2015 నుంచి గంజాయి సరఫరా 12

ఉక్రెయిన్‌కు నాటో తరహా రక్షణ

ఇందుకు పుతిన్ అంగీకరించారు

ట్రంప్ రాయబారి స్టీవ్ విట్కాఫ్ వెల్లడి

ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వం లేనట్టే!

నేడు వాషింగ్టన్‌లో ట్రంప్, జెలెన్‌స్కీ భేటీ

పాల్గొననున్న యూరప్ దేశాల నేతలు

ఈ నెల 22న జెలెన్‌స్కీ, పుతిన్‌తో కలిసి త్రైపాక్షిక భేటీ నిర్వహిస్తానన్న ట్రంప్ 2

ఢిల్లీలో లోకేశ్

నేడు పలువురు కేంద్ర మంత్రులతో భేటీ

పెండింగ్ ప్రాజెక్టులపై చర్చ

వివిధ ప్రతిపాదనల సమర్పణ

21న వెళ్లనున్న సీఎం చంద్రబాబు 11

ఎవరా వైసీపీ మంత్రి కొడుకు?

శ్రీకాంత్ రెమిషన్ కోసం 11 లక్షలు లంచం
బాంబు పేల్చిన నెల్లూరు మహిళ అరుణ

నెల్లూరు సెంట్రల్ జైలులో యావజ్జీవ ఖైదీగా శిక్ష అనుభవిస్తున్న అవిలేలి శ్రీకాంత్ పెరోల్ ఎపిసోడ్‌లో సంచలన విషయాలు బయటకొస్తున్నాయి. శ్రీకాంత్ తన భర్తేనని, ఆయన పెరోల్ కోసం పడరాని పాట్లు పడ్డానని, రెమిషన్ కోసం వైసీపీకి చెందిన అప్పటి మంత్రి కుమారుడికి పదకొండు లక్షల రూపాయలు ఇచ్చానని, ఈ ప్రయత్నాల్లో కొందరు అధికారులు తనను చిత్రహింసలకు గురిచేశారని నెల్లూరుకు చెందిన నిడిగుంట అరుణ బాంబు పేల్చింది. 11 లక్షలు డబ్బులు ఇచ్చానని అరుణ చెబుతున్న ఆ మంత్రి కొడుకు ఎవరు? ఆమెను చిత్రహింసలకు గురి చేసిన అధికారులెవరు? ఆమెను అందరూ వేధిస్తే శ్రీకాంత్‌కు పెరోల్ ఎలా వచ్చింది? చివరికి పెరోల్ రావడానికి సహకరించిన అధికారులెవరు? సమగ్రంగా విచారిస్తే ఈ ప్రశ్నలకు సమాధానాలతో పాటు మరెన్నో విషయాలు బయటికొస్తాయి.

గత ప్రభుత్వంలో బేరసారాలు

పెరోల్ కోసం కొందరు అధికారులు చిత్రహింసలు పెట్టారని వెల్లడి

కలకలం సృష్టిస్తున్న పెరోల్ ఎపిసోడ్

వైద్యం పేరిట శ్రీకాంత్ తరచూ నెల్లూరు జైలు నుంచి తిరుపతికి

ఇద్దరూ కలిసి రయాలో సెటిల్మెంట్లు

అరుణ సన్నిహితంగా ఉన్న వీడియో వైరల్

ప్రమాదంలో చేతికి గాయం 'కట్టు'కథే?


ప్రత్యర్థితో ఘర్షణలోనే శ్రీకాంత్‌కు గాయం

బయటికొస్తున్న బాధితులు, ఆధారాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జీవిత ఖైదీ శ్రీకాంత్ పెరోల్ వివాదంపై 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చిన అంశాలకు ప్రతిస్పందనగా నెల్లూరుకు చెందిన నిడిగుంట అరుణ వెల్లడించిన విషయాలు కలకలం సృష్టిస్తున్నాయి. శ్రీకాంత్ పెరోల్ ఎపిసోడ్, అరుణకున్న పరిచయాలు, సెటిల్మెంట్ల వ్యవహారాలపై ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్, పోలీసు వర్గాలు కూపీ లాగుతున్నాయి. వరుసగా బయటికి వస్తున్న బాధితులు తమ గోడు చెబుతున్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన అత్యంత సాధారణ మహిళ అయిన అరుణ ఎమ్మెల్యేగా పోటీ చేసే స్థాయికి చేరడం వెనుక ఎన్నో అరాచకాలకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. గత ఎన్నికల్లో సూళ్లూరుపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయింది. గత వైసీపీ ప్రభుత్వంలో 'దిశ' యాప్ ప్రచారకర్తగా అరుణ తనకు తాను ప్రకటించుకుంది. 2022లో ఒక ఎన్‌జీవోగా జైలులో ఖైదీలతో ముచ్చటించేందుకు వెళ్లిన అరుణ మొదటి చూపులోనే శ్రీకాంత్ ప్రేమలో పడినట్లు చెబుతోంది. గత ప్రభుత్వంలో అరాచకశక్తులకు రాష్ట్రంలో పూర్తిగా మద్దతు ఉండేది. అదే అవకాశంగా తీసుకున్న అరుణ జీవిత ఖైదు అనుభవిస్తున్న శ్రీకాంత్‌ను ప్రేమించడం వెనుక కూడా భారీ ఎత్తుగడే ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. నెల్లూరు జిల్లాలో కొందరు ఎమ్మెల్యేలు, రాజకీయ నాయకుల మద్దతున్న శ్రీకాంత్ వందల మంది యువకులతో గ్యాంగ్‌లు ఏర్పాటు చేసుకున్నాడు. దందాల నుంచి హత్యల

మిగతా 12వ పేజీలో...



11

బాధ్యత ఉండొద్దా?

మీరు చేసే పనులకు పార్టీ నష్టపోవాలా?

కొందరు ఎమ్మెల్యేల తీరుపై సీఎం సీరియస్

ఇలాంటి విషయాల్లో కఠినంగా ఉంటాం

పదవుల్లో ఉన్నారు.. అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస, గుంటూరు తూర్పు, అనంత ఎమ్మెల్యేలపై నివేదిక ఇవ్వండి

రాష్ట్ర నాయకత్వానికి ముఖ్యమంత్రి ఆదేశం

ఫ్రీ బస్సులపై వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

పథకాలపై ప్రజలతో మమేకం కావాలి

అప్పుడే ప్రభుత్వానికి మంచిపేరు: సీఎం

టీడీపీ నేతలతో టెలికాన్ఫరెన్స్

వారంలో అఫిడవిట్ ఇవ్వాలి.. లేదా
క్షమాపణ చెప్పాలి



జ్ఞానేశ్‌కుమార్

(మొదటి పేజీ తరువాయి)

ఏ రాజకీయ పార్టీ అయినా ఒక్కటేనని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం ఢిల్లీలోని నేషనల్ మీడియా సెంటర్‌లో ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బిహార్‌లో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) చేపట్టిన ఉద్దేశమే.. ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులను సవరించడమని, కానీ దీనిపై పలు పార్టీలు తప్పుడు సమాచారాన్ని వ్యాపింపజేస్తూ వాస్తవికతను మరిచిపోతున్నాయని.. తమ ప్రయోజనాల కోసం ఎన్నికల కమిషన్ భుజాలపై తుపాకీ పెట్టి ఓటర్లను లక్ష్యంగా చేసుకుంటున్నాయని ఆయన మండిపడ్డారు. ఓట్ల చోరీ, డబుల్ ఓటింగ్ వంటి ఆరోపణలకు ఎలాంటి ఆధారాలూ లేవని ఆయన కొట్టిపారేశారు. 'ఓట్ల చోరీ' వంటి పదాలు ఉపయోగించడం రాజ్యాంగాన్ని అవమానపరచడమేనని జ్ఞానేశ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బిహార్‌లో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని హడావుడిగా జరిపేస్తున్నారన్న వాదన పస లేనిదని.. ప్రతి ఎన్నికకు ముందూ ఓటరు జాబితాను సరిదిద్దడం ఎన్నికల కమిషన్ చట్టబద్ధమైన విధి అని స్పష్టం చేశారు. ఓటర్ల డేటా బేస్‌లో తప్పులు సవరించాలని అన్ని రాజకీయ పార్టీలు డిమాండ్ చేయడం వల్లే ఈ ప్రక్రియ చేపట్టినట్టు వెల్లడించారు. బిహార్‌లో ముసాయిదా ఓటరు జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే తెలపడానికి, ఫిర్యాదులుంటే చేయడానికి అన్ని రాజకీయ పార్టీలకూ ఇంకా 15 రోజుల గడువు ఉందని గుర్తుచేశారు. "ఈసీ తలుపులు అందరికీ తెరిచేఉంటాయి. బూత్ స్థాయి అధికారులు, ఏజెంట్లు పారదర్శకంగా పనిచేస్తున్నారు" అని ఆయన పేర్కొన్నారు. బిహార్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల ఏజెంట్లు, పూర్తి స్థాయిలో పారదర్శకంగా పనిచేస్తున్నారని తెలిపారు.

సాధ్యమేనా?

కోటి మంది అధికారులు, పది లక్షల మంది బూత్ స్థాయి అధికారులు, ఇరవై లక్షల మంది పోలింగ్ ఏజెంట్లు ఒక లోక్‌సభ నియోజకవర్గంలో ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటారని.. ఇంతమంది ముందు ఓట్లను దొంగతనం చేయడం సాధ్యమవుతుందా? అని సీఈసీ ప్రశ్నించారు. రెండుసార్లు ఓటింగ్ జరిగినట్లు ఆరోపణలు చేసిన వారిని రుజువులు అడిగితే.. ఇప్పటివరకూ తమకు సమర్పించలేదని తెలిపారు. ఇలాంటి ఆరోపణల వల్ల ఎన్నికల కమిషన్ కానీ, ఓటర్ కానీ భయపడరని అన్నారు. ఓటర్లను అవమానపరిస్తే ఎన్నికల కమిషన్ మౌనంగా ఉండదని హెచ్చరించారు. వలసల వల్లో, ఇతరత్రా కారణాలవల్లనో, అధికార యంత్రాంగం పనితీరులో లోపాలవల్లనో ఒక ఓటరు ఒకటికి మించి ఓటరు గుర్తింపు కార్డులు కలిగి ఉంటున్న సందర్భాలు కనిపిస్తున్నాయని.. అలాంటి తప్పులను పరిష్కరించేందుకే ఈసీ ప్రత్యేక సమగ్ర సవరణ చేపడుతోందని జ్ఞానేశ్‌కుమార్ పేర్కొన్నారు. అలాగే.. విపక్షాలు లేవనెత్తిన 'హౌస్ నంబర్ జీరో' సమస్యపైనా ఆయన స్పందించారు. "చాలామంది ఓటర్లకు ఇళ్లు ఉండవు. కానీ, వారి పేరు జాబితాలో ఉంటుంది. జాబితాలో ఇచ్చిన చిరునామాకు వారు కేవలం రాత్రిపూట నిద్రించడానికి వస్తారు. కొందరైతే రోడ్లపక్కన, వంతెనల కింద పడుకుంటారు. అలాంటివారిని ఫేక్ ఓటర్లంటే.. ఆ పేద ఓటర్లను హేళన చేసినట్టే" అని ఆవేదన వెలిబుచ్చారు. పంచాయతీలు, మునిసిపాలిటీలు ఇళ్లకు నంబర్ కేటాయించకపోవడం వల్ల.. కోట్లాది మంది ఓటర్ల ఇంటి నంబర్ 'జీరో'గా ఉంటోందని పేర్కొన్నారు. ఉదాహరణకు.. నగరాల్లో అనుమతులులేని కాలనీలు చాలా ఉంటాయని, ఆ కాలనీల్లో ఉండేవారికి ఇంటినంబర్లు ఉండవని(అధికారులు కేటాయించరని).. అలాంటివారు ఓటరు ఐడీ కోసం దరఖాస్తు చేసుకునేటప్పుడు చిరునామా అనే చోట ఏం రాస్తారని నిలదీశారు. అలాంటి సందర్భాల్లో వారి ఇంటినంబర్ స్థానంలో ఊహాత్మక సంఖ్య ఇవ్వడం ద్వారా అలాంటి ఓటర్ల పక్షాన ఈసీ నిలబడుతుందన్నారు.


సుఖ్బీర్ సింగ్, వివేక్ జోషి

అలా ఇవ్వం..

సుప్రీంకోర్టు ఆదేశించినట్టుగా.. బిహార్‌లో ముసాయిదా ఓటరు జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది పేర్లను, వారి వివరాలను జిల్లాలవారీగా ఈసీ వెబ్‌సైట్లలో ప్రచురించినట్టు సీఈసీ తెలిపారు. అయితే.. యంత్రాల సాయంతో చదవదగ్గ రీతిలో (మెషీన్ రీడబుల్) ఓటర్ల జాబితాను విడుదల చేస్తే ఓటర్ల ప్రైవసీకి భంగం కలుగుతుందని 2019లో సుప్రీంకోర్టు చెప్పిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. మెషీన్ రీడబుల్ ఫార్మాట్‌ని ఎవరైనా ఎడిట్ చేసే (మార్చే) ప్రమాదం ఉంటుంది కాబట్టే దాన్ని నిషేధించారని తెలిపారు. కనుక ఆ నమూనాలో ఓటరు జాబితాను రాజకీయ పార్టీలతో పంచుకునే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. ఎన్నికల నిబంధనావళిలోని క్లాజ్ నంబరు 11.2.2.2లో సైతం ఓటరు జాబితా 'టెక్స్ మోడ్'లో ఉండాలని మాత్రమే పేర్కొన్నారని.. ముసాయిదా ఓటర్ల జాబితాను 'సెర్చబుల్ (ఓటరు గుర్తింపు కార్డు నంబర్‌తో వెతకగలిగే) పీడీఎఫ్' రూపంలో ఈసీ వెబ్‌సైట్‌లో పెట్టాలని చెప్పలేదని గుర్తుచేశారు. కాబట్టి అలా పెట్టాలని అడిగే హక్కు పిటిషనర్‌కు లేదని జ్ఞానేశ్‌కుమార్ పేర్కొన్నారు.

అందుకే రాహుల్‌ను అఫిడవిట్ అడిగారు

ఒక నియోజకవర్గంలో ఓటర్ కానివారు ఓటరుజాబితాపై ఫిర్యాదు చేయాలంటే.. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ముందు ప్రమాణం చేయాల్సి ఉంటుందని సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ తెలిపారు. ఎవరిపై ఆరోపణలు చేస్తారో వారి ముందే ప్రమాణం చేయాల్సి ఉంటుందని.. అందుకే కర్ణాటక సీఈవో రాహుల్ గాంధీని ప్రమాణ పూర్వకంగా డిక్లరేషన్ సమర్పించాలని కోరారని ఆయన వివరణ ఇచ్చారు. ఫిర్యాదుదారు ప్రమాణపూర్వక డిక్లరేషన్ ఇవ్వకుండా ఈసీ 1.5 లక్షల మంది ఓటర్లకు నోటీసు జారీ చేయాలా? అని ప్రశ్నించారు.

ఈసీ తీరు బహిర్గతమైంది..

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్‌నేత జైరామ్‌రమేశ్ స్పందించారు. "సాసారాం నుంచి రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార యాత్ర' ప్రారంభించిన కొద్దిసేపటికే సీఈసీ, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు మీడియాతో మాట్లాడుతూ.. తమకు అధికార, ప్రతిపక్షాల మధ్య తేడా లేదన్నారు. కొండంత సాక్ష్యాలు ఎదురుగా ఉన్నా వారు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదం. రాహుల్‌గాంధీ లేవనెత్తిన ఏ ఒక్క నిశితమైన ప్రశ్నకు కూడా సమాధానం ఇవ్వలేదు" అని తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. బిహార్‌లో తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల పేర్లను, వారిని తొలగించడానికి గల కారణాలతో సహా వెల్లడించాలంటూ ఆగస్టు 14వ తేదీన సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఈసీ తూచాతప్పకుండా పాటిస్తుందా? అని ఆయన ప్రశ్నించారు. ఈసీ ఇచ్చిన డేటాలోని వాస్తవాలనే రాహుల్ చెప్పారని గుర్తుచేశారు. అసమర్థతవల్లే కాక.. బహిరంగ పక్షపాతవైఖరి వల్ల కూడా ఈసీ తీరు పూర్తిగా బహిర్గతమైందన్నారు.

బీజేపీతో ఈసీ కుమ్మక్కు

బిహార్‌ను కాజేయడానికే 'సర్' కుట్ర.. ఓటర్ల తొలగింపు పథకాన్ని సాకారం కానివ్వం: రాహుల్

- ససారం నుంచి 'ఓటర్ అధికార యాత్ర'కు శ్రీకారం



ఓటర్ అధికార యాత్రలో రాహుల్ వాహనాన్ని నడుపుతున్న తేజస్వీ

ససారం, ఆగస్టు 17: బిహార్ ఎన్నికలను దొంగిలించేందుకే ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్)ను చేపట్టారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ మరోసారి విమర్శించారు. ఎన్నికల కమిషన్ (ఈసీ) బీజేపీతో కుమ్మక్కైందని యావద్దేశానికి తెలిసిపోయిందన్నారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను అది దొంగిలిస్తోందని ఆరోపించారు. ఎస్ఐఆర్ ద్వారా ఓట్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు చేపట్టి బిహార్ ఎన్నికలను కూడా తస్కరించాలని చూస్తున్నారని.. ఈ కుట్రను ఇండీ కూటమి అనుమతించదని స్పష్టంచేశారు. రెండు మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న బిహార్లో 'ఓటర్ అధికార యాత్ర'కు ఆయన ఆదివారం ససారం నుంచి శ్రీకారం చుట్టారు. ఆ రాష్ట్రంలోని 20 జిల్లాల గుండా 16 రోజులపాటు 1,300 కిలోమీటర్లు పాదయాత్ర చేయనున్నారు. సెప్టెంబరు 1న ముగిస్తారు. ససారం సభలో ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీలో ప్రెస్‌కాన్ఫరెన్స్ పెట్టి ఓట్ల చోరీని బహిర్గతం చేసినందుకే తనను ఈసీ అఫిడవిట్ అడుగుతోందన్నారు. 'ఈసీ ఏం చేస్తోందో... ఏ విధంగా ఓట్ల చోరీకి పాల్పడుతోందో ఇప్పుడు దేశం మొత్తానికీ తెలిసిపోయింది" అని వ్యాఖ్యానించారు. "బిహార్, మహారాష్ట్ర, అసోం, బెంగాల్ సహా ఇక ఎక్కడ ఓట్ల చోరీ జరిగినా మేం పట్టేస్తాం' అన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని.. రిజర్వేషన్లపై ఉన్న 50% పరిమితిని తొలగించాలని పార్లమెంటులో ప్రధాని ముందే చెప్పానని అన్నారు. ఒత్తిడితోనే మోదీ ప్రభుత్వం కులగణన ప్రకటన చేసిందన్నారు. వాస్తవానికి కులాల జనాభా లెక్కింపు చేపట్టరని.. అలాగే రిజర్వేషన్లపై పరిమితిని కూడా తొలగించరని స్పష్టంచేశారు. కాంగ్రెస్, ఇండీ కూటమి ఈ రెండు పనులూ చేస్తుందని హామీ ఇచ్చారు. తన యాత్రపై రాహుల్ 'ఎక్స్'లో కూడా స్పందించారు. 'ఓటరు అధికార యాత్ర'తో ప్రజల్లోకి వస్తున్నాం. ఒక వ్యక్తికి ఒకే ఓటు అన్న మౌలిక ప్రాథమిక హక్కును కాపాడేందుకే మా పోరాటం. రాజ్యాంగాన్ని రక్షించేందుకు బిహార్లో మాతో కలిసి నడవండి' అని పిలుపిచ్చారు. కాగా.. భారత్ జోడో యాత్ర-2లాగే ఈ యాత్ర కూడా హైబ్రిడ్ విధానంలో జరుగుతుందని.. నడవడంతో పాటు వాహనంలోనూ ఆయన యాత్ర సాగిస్తారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో తెలిపారు. బీజేపీ అధికారంలో ఉన్నంతవరకు రాజ్యాంగానికి ప్రమాదమేనని.. ప్రజల హక్కులకు రక్షణ ఉండదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ సభలో అన్నారు. ఐక్య ఇండీ కూటమి.. నితీశ్‌కుమార్ సర్కారును కూల్చేస్తుందని ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ అన్నారు. ఎస్ఐఆర్ ద్వారా ప్రజల ఓటు హక్కును లాక్కునేందుకు బీజేపీ ఎన్నికల కమిషన్‌ను వాడుకుంటోందని ఆయన కుమారుడు, బిహార్ ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్ ఆరోపించారు.

ఖర్గే, లాలూకు నీరందించిన రాహుల్

ఆదివారం మధ్యాహ్నం బాగా ఎండ, ఉక్కపోత ఉండడంతో వృద్ధులైన ఖర్గే, లాలూకు రాహుల్ తాగునీరు అందించారు. గ్లాసులో స్వయంగా నీరు పోసి ఇచ్చారు. తర్వాత తాను తాగారు. పెద్దవారి పట్ల ఆయన గౌరవ మర్యాదలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రస్తుతం ఈ వీడియో వైరల్‌గా మారింది.

ఈసీపై చర్యలేకుండా చట్టం తెచ్చారు

ఎన్నికల కమిషన్‌పై ఎవరూ చర్య తీసుకోకుండా మోదీ ప్రభుత్వం 2023లో చట్టం తెచ్చిందని రాహుల్ ఆరోపించారు. బీజేపీకి సహకరిస్తున్నందుకు, ఓట్లు చోరీ చేస్తున్నందుకు మోదీ, అమిత్‌షా దీనిని తెచ్చారని అన్నారు. పాదయాత్ర ఔరంగాబాద్ చేరినప్పుడు ఆయన మాట్లాడారు. 'ఎన్నికల కమిషనర్లపై కేసు పెట్టడానికి వీల్లేకుండా చట్టం తెచ్చారు. సీసీటీవీ ఫుటేజ్‌పై ప్రభుత్వం ఎందుకు చట్టం తెచ్చిందో ఎన్నికల కమిషనర్లు చెప్పాలి' అని డిమాండ్ చేశారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండాలన్న సూత్రాన్ని, అంబేడ్కర్ రాజ్యాంగాన్ని కాపాడేందుకు పోరాడుతున్నామని తెలిపారు.

ఈసీకి 18 వేల అఫిడవిట్లు ఇచ్చాం

- ఒక్కదాని మీద కూడా చర్యల్లేవు: అఖిలేశ్

కాన్పూర్, ఆగస్టు 17: ఓట్ల చోరీకి సంబంధించి ఎన్నికల సంఘానికి (ఈసీకి) పార్టీ పరంగా తాము ఇప్పటి వరకూ 18,000 అఫిడవిట్లను సమర్పించామని, ఒక్కదానిమీద కూడా ఈసీ చర్యలు తీసుకోలేదని యూపీ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ తెలిపారు. 'ఈసీపై పలు రకాల ఒత్తిళ్లు ఉంటున్నాయని మాకు తెలుసు. సత్యం అనే మార్గంలో పయనించినప్పుడు ప్రజలు కూడా తోడుగా నిలుస్తారు. ఈసీ సరైన మార్గంలో పయనిస్తే కోట్లాదిమంది భారతీయులు ఆ సంస్థకు రక్షణ కవచంలా ఉంటారు' అని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దొంగ ఓట్లపై కాంగ్రెస్ వీడియో ఏఐ సృష్టే!

- ఫ్యాక్ట్ చెక్ ద్వారా స్పష్టం చేసిన ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ, ఆగస్టు 17: దొంగ ఓట్లపై కాంగ్రెస్ పార్టీ పోస్టు చేసిన వీడియో నిజం కాదని, అది ఏఐ ద్వారా సృష్టించినదని ఎన్నికల సంఘం(ఈసీ) వెల్లడించింది. ఏఐ వీడియో ద్వారా దేశాన్ని తప్పుదారి పట్టించే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోందని ఈసీ ఆరోపించింది. 'ఓట్ అధికార్ యాత్ర' సందర్భంగా దొంగ ఓట్లపై పౌరుల అభిప్రాయాలతో రూపొందించిన ఒక వీడియోను కాంగ్రెస్ పార్టీ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. దీనిని ఫ్యాక్ట్ చెక్ ద్వారా పరిశీలించిన ఈసీ... ఈ వీడియో ఏఐ ద్వారా సృష్టించిందేనని ఆదివారం ప్రకటించింది. బీహార్ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే కాంగ్రెస్ ఇలాంటి ప్రయత్నాలు చేస్తోందని ఈసీ పేర్కొంది. కాగా, దొంగ ఓట్ల వ్యవహారంపై కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘంపై పోరాడుతున్న సంగతి తెలిసిందే. ఎన్నికలను ప్రభావితం చేసేలా కేంద్రంలోని అధికార పార్టీతో ఈసీ పని చేస్తోందని విపక్ష పార్టీలు విమర్శలు గుప్పిస్తున్న విషయమూ విదితమే.

ఉక్రెయిన్‌కు నాటో తరహా రక్షణ

- అమెరికా, యూరప్ భద్రతా హామీ ఇచ్చేందుకు పుతిన్ అంగీకరించారు
- ట్రంప్ ప్రత్యేక రాయబారి విట్కాఫ్




వాషింగ్టన్, ఆగస్టు 17: రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఈ అంశంలో మరో ముందడుగు పడిందని తన సోషల్ మీడియా ట్రుత్‌లో పోస్టు పెట్టారు. అదేమిటనేది వెల్లడించలేదు. తర్వాత దీనికి సంబంధించి అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ కీలక వివరాలు వెల్లడించారు. నాటో తరహాలో అమెరికా, యూరప్ దేశాలు ఉక్రెయిన్‌కు భద్రతా హామీ (సెక్యూరిటీ గ్యారంటీ) ఇచ్చేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్ అంగీకరించారని వెల్లడించారు. "నాటో ఆర్టికల్-5 ప్రకారం కూటమి సభ్య దేశాలపై బయటి దేశమేదైనా దాడి చేస్తే.. కూటమి దేశాలన్నీ అండగా నిలిచి, యుద్ధంలోకి దిగుతాయి. ఈ రక్షణ కోసమే ఉక్రెయిన్ నాటోలో చేరాలనుకుంది. కానీ నాటోలో ఉక్రెయిన్‌ను చేర్చుకునే అంశాన్ని పుతిన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అయితే నాటో ఆర్టికల్-5 తరహాలో ఉక్రెయిన్‌కు అమెరికా, యూరప్ దేశాలు భద్రతా హామీ ఇచ్చేందుకు అలాస్కా చర్చల్లో పుతిన్ అంగీకరించారు. పుతిన్ ఇలా అంగీకరించడం ఇదే మొదటిసారి" అని విట్కాఫ్ పేర్కొన్నారు. యుద్ధ విరమణ కోసం ఇదొక రాజీ ప్రయత్నమని, ఏదేమైనా ఉక్రెయిన్ అంగీకరించడంపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. మరోవైపు, సోమవారం వాషింగ్టన్‌లో ట్రంప్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సమావేశం కానున్నారు. ట్రంప్ ఆహ్వానం, జెలెన్‌స్కీ విజ్ఞప్తి మేరకు పలు యూరప్, నాటో దేశాల నేతలు ఈ భేటీలో పాల్గొననున్నారు. ఇదిలా ఉండగా, ఆగస్టు 22న తనతోపాటు పుతిన్, జెలెన్‌స్కీ పాల్గొనేలా త్రైపాక్షిక సమావేశం నిర్వహిస్తానని యూరప్ దేశాల నేతలకు ట్రంప్ సమాచారం ఇచ్చారని అమెరికా మీడియా పేర్కొంది.

4 కిలోమీటర్ల దూరంలో ఉన్న సైనికుల కాల్చివేత

- ఉక్రెయిన్ స్నైపర్ యూనిట్ 'ఘోస్ట్' ప్రపంచ రికార్డు

కీవ్, ఆగస్టు 17: 13వేల అడుగుల దూరంలో ఉన్న రష్యా సైనికులను కాల్చి చంపి ఉక్రెయిన్ స్నైపర్ యూనిట్ 'ఘోస్ట్' ప్రపంచ రికార్డు సృష్టించింది. గురువారం(ఆగస్టు 14) పోక్రోవ్‌స్క్ ప్రాంతంలో ఇద్దరు రష్యా సైనికులను ఘోస్ట్ స్నైపర్ యూనిట్ ఉక్రెయిన్‌లోనే తయారు చేసిన ఎలిగేటర్ 14.5ఎంఎం రైఫిల్‌తో దాదాపు 4కిలోమీటర్ల దూరం నుంచే మట్టుబెట్టింది. ఇందుకోసం కృత్రిమ మేధ, డ్రోన్ సాయం తీసుకుంది. ఈ విషయాన్ని మిలిటరీ జర్నలిస్టు యూరీ బుటుసోవ్ కీవ్ పోస్ట్ పత్రిక ద్వారా వెల్లడించారు. ఇప్పటిదాకా ఈ రికార్డు సెక్యూరిటీ సర్వీస్ ఆఫ్ ఉక్రెయిన్‌కు చెందిన 58ఏళ్ల స్నైపర్ పేరు మీద ఉంది. అతడు లార్డ్ ఆఫ్ ఒరైజాన్ రైఫిల్‌తో 3,800మీటర్ల దూరంలోని వ్యక్తిని కాల్చివేశాడు.

పాక్ రక్షకుడిగా దేవుడు నన్ను సృష్టించాడు: మునీర్



న్యూఢిల్లీ, ఆగస్టు 17: పాకిస్థాన్‌కు రక్షకుడిగా దేవుడు తనను సృష్టించాడని ఆ దేశ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ వ్యాఖ్యానించారు. దేశాధ్యక్షుడిగా, లేదా రాజకీయ నేతగా మారాలనే ఆలోచనలేమీ తనకు లేవన్నారు. అమెరికా పర్యటన నుంచి తిరిగి వస్తూ బెల్జియంలో దిగిన మునీర్ పాక్ జర్నలిస్టు సుహైల్ వార్రాయిచ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో రాజకీయ మార్పులకు సమయం ఆసన్నమైందన్న వార్తలను ఊహాగానాలుగా ఆయన తోసిపుచ్చారు. 'దేశ రక్షకుడిగా నన్ను దేవుడు సృష్టించాడు. అంతకుమించి మరే హోదా నాకు అవసరం లేదు. నేనొక సైనికుడిని. దేశం కోసం ప్రాణాలర్పించడమే నా అతిపెద్ద ఆకాంక్ష' అన్నారు. తమ దేశాన్ని అస్థిరపరిచేందుకు అఫ్ఘానిస్థాన్‌తో భారత్ చేతులు కలిపితేగనుక భారత్‌పై తాము దాడి చేస్తామని హెచ్చరించారు.

భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై ప్రతిష్టంభన!

- చర్చల నిలిపివేత దిశగా పరిణామాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 17: భారత్‌పై అమెరికా సుంకాలు, ఉక్రెయిన్-రష్యా యుద్ధం విరమణపై అస్పష్టత నేపథ్యంలో.. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై ప్రతిష్టంభన నెలకొంది. భారత్‌పై తొలుత 25శాతం వాణిజ్య సుంకాలు విధించిన ట్రంప్.. తాము వద్దని చెప్పినా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందంటూ మరో 25శాతం సుంకాలు విధించారు. ఈ అంశం తేలేవరకు వాణిజ్య చర్చలు ఉండబోవని కూడా ప్రకటించారు. తొలి 25 శాతం సుంకం ఇప్పటికే అమల్లోకి రాగా.. అదనపు 25శాతం సుంకం ఈ నెల 27 నుంచి అమల్లోకి రానుంది. మరోవైపు వాణిజ్య ఒప్పందంపై చర్చల ప్రక్రియ కొనసాగుతోందని.. ఈ నెల 25 నుంచి 29 వరకు జరగాల్సిన ఆరో దశ చర్చల కోసం అమెరికా బృందం రానుందని భారత అధికార వర్గాలు తొలుత పేర్కొన్నాయి. కానీ అమెరికా బృందం పర్యటన రద్దయిందని తాజాగా కేంద్ర వాణిజ్యశాఖ వర్గాలు తెలిపాయి.

తెలంగాణ సహా 12 రాష్ట్రాల రాజధానుల్లో సమాచార భవన్‌లు

న్యూఢిల్లీ, ఆగస్టు 17: స్థానిక మీడియాతో ప్రభుత్వానికి సమన్వయం పెంచే దిశగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ సహా దేశంలోని 12 రాష్ట్రాల రాజధాని నగరాల్లో సమాచార భవన్‌లను నిర్మించాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఆయా నగరాల్లో ఎక్కడో మారుమూల ప్రదేశాల్లో రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు దూరంగా ఇవి ఉన్నాయి. కొన్నిచోట్ల ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని వసతులు, వివిధ విభాగాలన్నీ ఒకేచోట ఉండేలా కొత్త భవనాలను నిర్మించాలని కేంద్రం ప్రతిపాదించింది. ఢిల్లీలోని నేషనల్ మీడియా సెంటర్ తరహాలో వీటి నిర్మాణం జరపాలని సూచించింది. ఒక్కో భవనానికి రూ.40 కోట్లు ఖర్చు చేయనున్నారు.

వారే రాజ్యాంగాన్ని తొక్కేశారు!

- తలపై పెట్టుకుని నాట్యం చేస్తున్న వారే.. అంబేడ్కర్‌కు ద్రోహం చేశారు
- కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగిన ప్రధాని
- ఢిల్లీలో హైవేలను ప్రారంభించిన మోదీ


ద్వారకా ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణ కూలీలతో మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 17: "రాజ్యాంగ ప్రతిని తలపై పెట్టుకుని నాట్యం చేస్తున్నామని చెప్పుకొనేవారే.. ఆ రాజ్యాంగాన్ని తొక్కేశారు. బాబా సాహెబ్ అంబేడ్కర్ భావాలకు ద్రోహంచేశారు" అంటూ కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ నిప్పులు చెరిగారు. గత ప్రభుత్వాలు.. రాజ్యాంగ స్ఫూర్తిని తక్కువ చేశాయని, సామాన్యులను అణిచివేసేలా శాశ్వత చట్టాలను తీసుకువచ్చాయని దుయ్యబట్టారు. దేశ రాజధాని ఢిల్లీలో రెండు జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రధాని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మోదీ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పై విమర్శల వర్షం కురిపించారు. "ఎవరైతే రాజ్యాంగాన్ని తలపై పెట్టుకుని నాట్యం చేస్తున్నామని చెప్పుకొన్నారో.. వారే దానిని తొక్కేశారు. బీఆర్ అంబేడ్కర్ భావాలు, ఆశయాలకు తీరని ద్రోహం చేశారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ చట్టం-1957లోని ఓ నిబంధనను ఆయన ప్రస్తావించారు. "ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ చట్టంలో అత్యంత ప్రమాదకరమైన నిబంధన చేర్చారు. ఎవరైనా పారిశుధ్య కార్మికులు ముందస్తు సమాచారం ఇవ్వకుండా తమ విధులకు గైర్హాజరైతే నెల రోజులపాటు జైలుకు పంపేలా నిబంధన తెచ్చారు. సఫాయీ కర్మచారుల పట్ల వారి (కాంగ్రెస్) ఆలోచన ఎలా ఉందో ఒక్కసారి ఆలోచించండి. అత్యంత చిన్నతప్పుకే కార్మికులను జైల్లో పెట్టాలా? అలాంటి వారు ఇప్పుడు సామాజిక న్యాయం గురించి ఉపన్యాసాలు దంచికొడుతున్నారు. ఇలాంటి వికృత చట్టాలను తేవడం, అమలు చేయడం వారికే సాధ్యం. అయితే ఇప్పుడున్నది మోదీ. అలాంటి అణిచివేత చట్టాలను గుర్తించి బుట్టదాఖలు చేస్తున్నాం" అన్నారు. హరియాణాలోని గత కాంగ్రెస్ ప్రభుత్వంపైనా ప్రధాని విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ ఉద్యోగాల విషయంలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. "హరియాణాలో కాంగ్రెస్ హయాంలో అవినీతి రాజ్యమేలింది. లంచాలు తీసుకోకుండా ఒక్క ప్రభుత్వ ఉద్యోగాన్నీ ఇవ్వలేదు. డబ్బులు, లేకపోతే సిఫారసులతో ఉద్యోగాలను అమ్ముకున్నారు. కానీ, ఇప్పుడు ఈ పరిస్థితి మీకెక్కడా కనిపించదు. సీఎం నాయబ్ సింగ్ సైనీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా లక్షలాది మంది యువతకు ఉద్యోగాలు ఇస్తోంది" అని ప్రధాని అన్నారు.

ఢిల్లీ ట్రాఫిక్ కష్టాలకు చెక్!

ఢిల్లీలో రెండు జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు. ద్వారకా ఎక్స్‌ప్రెస్ వే, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్(యూఈఆర్)-2లను ఆయన ప్రారంభించి జాతికి అంకితం చేశారు. సుమారు రూ.11వేల కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్టులతో రాజధానివాసుల ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. అలాగే సోనిపట్, రోహ్‌తక్, బహదూర్‌గఢ్, గురుగ్రామ్‌ల నుంచి విమానాశ్రయానికి చేరుకునే సమయం తగ్గిపోనుంది. కాగా ఢిల్లీలో ఉత్పత్తయ్యే వ్యర్థాలను అర్థవంతం చేశామని, యూఈఆర్ రహదారి నిర్మాణంలో వినియోగించామని ప్రధాని చెప్పారు. రహదారుల నిర్మాణంలో పాలుపంచుకున్న కార్మికులు, ఇంజనీర్లతో మోదీ సంభాషించారు. అనంతరం, నూతన రహదారిపై ప్రధాని రోడ్ షో నిర్వహించారు. ఇదిలా ఉండగా జీఎస్టీ సంస్కరణలకు సంబంధించిన ముసాయిదాను రాష్ట్రాలకు పంపామని ప్రధాని మోదీ తెలిపారు. దీపావళికన్నా ముందే అమలు చేయనున్న ఈ సంస్కరణలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఇకపై పీఎంవో @ సెంట్రల్ విస్టా!

- వచ్చే నెలలో సౌత్ బ్లాక్ నుంచి తరలింపు

కేంద్ర సెక్రటేరియట్‌లోని సౌత్ బ్లాక్‌లో 78 ఏళ్లకు పైగా ఉన్న ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) వచ్చే నెలలో సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్తగా నిర్మించిన కార్యనిర్వాహక భవన సముదాయానికి (ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్) తరలివెళ్లనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని అధికార వర్గాలు వెల్లడించాయి. నూతన పీఎంవో కార్యాలయానికి ఒక కొత్త పేరు పెట్టనున్నారు. మూడోసారి అధికారం చేపట్టాక పీఎంవోను ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ.. ప్రజాసేవకు పీఎంవో ఒక ప్రదేశంగా ఉండాలన్న వ్యాఖ్యల స్ఫూర్తిని ప్రతిబింబించేలా ఆ పేరు ఉండనుందని తెలుస్తోంది.

కశ్మీర్‌లో మళ్లీ మేఘ విస్ఫోటం

- కొండ చరియలు పడి ఏడుగురి మృతి
- హిమాచల్‌ప్రదేశ్‌లో ఆకస్మిక వరదలు


జోధ్ ఘాటి గ్రామంలోకి కొట్టుకువచ్చిన బురద, రాళ్లు


జమ్ము/శిమ్లా, ఆగస్టు 17: జమ్ము, కశ్మీర్‌లోని కథువా జిల్లాలో ఆదివారం తెల్లవారు జామున మేఘ విస్ఫోటం, కొండ చరియలు విరిగి పడడం కారణంగా ఏడుగురు మృతి చెందారు. ఐదుగురు గాయపడ్డారు. రాజ్‌బాఘ్, జంగ్‌లోత్ ప్రాంతంలోని జోధ్ ఘాటి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. జోధ్ ఘాటి గ్రామంలో మేఘ విస్ఫోటం కారణంగా ఐదుగురు ప్రాణాలు కోల్పోగా కొన్ని ఇళ్లు దెబ్బతిన్నాయి. జంగ్‌లోత్ ప్రాంతంలో కొండ చరియలు పడి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని అధికారులు తెలిపారు. భారీ వర్షాల కారణంగా ఈ ప్రాంతంలోని నదుల్లో నీటి ప్రవాహ మట్టం బాగా పెరిగిపోయింది. ఉజ్ నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. జమ్ము, కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా మృతి చెందిన వారి కుటుంబాలకు సంతాపం తెలిపారు. మరోవైపు హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం మండి జిల్లాలో భారీ వర్షాల కారణంగా కొండ చరియలు విరిగి పడడంతో పాటు ఆకస్మిక వరదలు సంభవించాయి. దీంతో పనర్సా, టకోలి, నాగ్వెయిన్ ప్రాంతాల్లోని ఇళ్లలోకి బురద చేరింది.

నైతిక విలువలు ఉంటేనే పౌరసత్వం

వలసదారుల దరఖాస్తులపై అమెరికా

న్యూఢిల్లీ, ఆగస్టు 17: వలసదారుల పౌరసత్వ దరఖాస్తులను పరిగణనలోకి తీసుకొనే సమయంలో నైతిక ప్రవర్తనపై ప్రధానంగా దృష్టి సారించాలని అధికారులను అమెరికా పౌరసత్వ, వలస సేవల విభాగం (యూఎస్‌సీఐఎస్) ఆదేశించింది. పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకొనేవారికి ఎలాంటి నేర చరిత్ర లేకపోవడం మంచి నైతిక ప్రవర్తనగా అమెరికా ఇమిగ్రేషన్ చట్టం పేర్కొంటోంది. ఇప్పుడు దీని పరిధిని మరింత విస్తరించనున్నారు. కుటుంబ బంధాలకు, సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వడం, సమాజంతో మమేకమవడం, ఉన్నత విద్యార్హతలు, స్థిరమైన, చట్టబద్ధమైన ఉద్యోగం, పన్ను చెల్లించే స్థితి వంటి అంశాలతో పాటు దరఖాస్తుదారులు అమెరికాలో నివసించిన కాలాన్ని పరిగణనలోకి తీసుకోనున్నారు.

లోకం తీరు



అభ్యర్థుల ఆస్తుల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచాల్సింది ఈసీనే

▸ అలహాబాద్ హైకోర్టు

ప్రయాగ్‌రాజ్, ఆగస్టు 17: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఆస్తుల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పైనే ఉన్నట్టు కనిపిస్తోందని అలహాబాద్ హైకోర్టు అభిప్రాయపడింది. ఆస్తుల జాబితాను ఆదాయపు పన్ను విభాగం తనిఖీలు చేసిన తరువాత వాటిని ప్రజాబాహుళ్యానికి అందుబాటులో తీసుకురావాల్సిన బాధ్యత ఈసీపైనే ఉంటుందని తెలిపింది. ఆస్తుల జాబితాలు ప్రజలకు తెలిసేలా ఏర్పాట్లు చేయాలంటూ 2018లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలు కావడం లేదంటూ రిటైర్డు ఐఏఎస్ అధికారి ఎస్.ఎన్ శుక్లా ఆధీనంలోని లోక్ ప్రహరీ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అభ్యర్థులు ఫారం-26లో తమ ఆస్తుల వివరాలను పొందుపరచాల్సి ఉంటుంది. వాటిని ఆదాయపు పన్ను విభాగం తనిఖీ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంటుంది. ఈ బాధ్యత ఎవరన్నదానిపై సమస్య తలెత్తింది. దీనిని ఆదాయపు పన్ను శాఖే చూడాల్సి ఉంటుందని ఎన్నికల కమిషన్ తరపు న్యాయవాది చెప్పారు. తమపై అలాంటి బాధ్యత లేదని ఆదాయపు పన్ను శాఖ తెలిపింది. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకొని ప్రాథమికంగా చూస్తే ఇది ఎన్నికల కమిషన్ చేయాల్సిన పనేనని అభిప్రాయపడింది. అలా అయితే ఇందుకు కేంద్ర ప్రభుత్వం తమకు సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం కోర్టుకు తెలిపింది. దాంతో కేంద్ర హోం శాఖను ప్రతివాదిగా చేర్చుతూ తదుపరి విచారణను సెప్టెంబరు15కు వాయిదా వేసింది.

సుప్రీంకోర్టు, హైకోర్టుల స్థాయి సరిసమానం

▸ హైకోర్టుల కొలీజియంలకు ఎలాంటి ఆజ్ఞలు ఇవ్వలేం

▸ సీజేఐ జస్టిస్ గవాయ్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 17: న్యాయ వ్యవస్థలో సుప్రీంకోర్టు, హైకోర్టుల రాజ్యాంగపర స్థాయి సమానంగా ఉంటుందని సీజేఐ జస్టిస్ గవాయ్ స్పష్టం చేశారు. ఒకదాని కింద మరొకటి పనిచేయడం అంటూ ఉండదని తెలిపారు. ఒకటి సుపీరియర్, మరొకటి దిగువస్థాయిది అన్న మాటే ఉండదని చెప్పారు. పరస్పర గౌరవం ఆధారంగా ఆ రెండు వ్యవస్థలు పనిచేస్తాయని తెలిపారు. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ.. సుప్రీంకోర్టు, హైకోర్టుల కొలీజియంల పరిధిపైనా స్పష్టత ఇచ్చారు. న్యాయమూర్తి పదవికి ఫలానా వారి పేరు సిఫార్సు చేయాలని హైకోర్టు కొలీజియంకు సుప్రీంకోర్టు కొలీజియం ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని చెప్పారు. న్యాయమూర్తి పదవులకు ఎవరి పేర్లను సిఫార్సు చేయాలన్నదాన్ని హైకోర్టు కొలీజియంలే నిర్ణయం తీసుకుంటాయని తెలిపారు. మహా అయితే సుప్రీంకోర్టు కొలీజియం ఎవరి పేర్లనయినా సూచించవచ్చని, అంతే తప్ప వాటిని జాబితాలో చేర్చాలని ఆజ్ఞలు ఇవ్వలేవని చెప్పారు.

న్యూయార్క్ సిటీ క్లబ్‌లో కాల్పులు

▸ ముగ్గురి మృతి, 8 మందికి గాయాలు

న్యూయార్క్, ఆగస్టు 17: న్యూయార్క్ నగరంలోని ఓ క్లబ్‌లో గుర్తుతెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారు. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున క్లబ్‌లో చెలరేగిన ఓ వివాదమే కాల్పులకు దారితీసినట్లు భావిస్తున్నామని న్యూయార్క్ కమిషనర్ జెస్సికా టిష్ వెల్లడించారు. ఘటనా స్థలం నుంచి 36 షెల్ కేసింగ్‌లను, సమీపంలోని వీధిలో ఓ తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గాయపడిన వారిలో ముగ్గురు మహిళలు ఉన్నారని, వారంతా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని చెప్పారు. ఇటీవలి కాలంలో నగరంలో తుపాకీ హింస రికార్డు స్థాయిలో తగ్గిందనుకుంటున్న నేపథ్యంలో.. తాజా కాల్పుల ఘటన భయానకమైనదని ఆమె పేర్కొన్నారు.

ధర్మస్థల వివాదం వెనుక సీఎం ప్రమేయం

▸ ప్రతిపక్షనేత అశోక ఆరోపణ



బెంగళూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ధర్మస్థలలో సాగుతున్న వివాదం వెనుక కర్ణాటక సీఎం సిద్దరామయ్య పాత్ర ఉందని.., హిందూ మతం, ఆలయాలకు వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేసేందుకు కమ్యూనిస్టు భావాలు కలిగిన అర్బన్ నక్సల్స్‌కు ప్రభుత్వం మద్దతు ఇస్తోందని ప్రతిపక్షనేత అశోక తీవ్రంగా ఆరోపించారు. ఆదివారం హుబ్బళ్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సౌజన్య, సిట్ కేసులను ఎవరూ వ్యతిరేకించలేదన్నారు. ఎవరో ఒక వ్యక్తి మాటలు విని ముఖ్యమంత్రి సిట్ దర్యాప్తునకు ఆదేశించడం సరికాదని పేర్కొన్నారు. కొందరు ధర్మసల ఆలయానికి ఎక్స్‌కవేటర్‌తో దూసుకొస్తామని హెచ్చరిస్తున్నారని, అడవిలో మతోన్మాదులు, నక్సల్స్‌కు ఎర్ర తివాచీ పరిచి జనజీవనంలోకి తీసుకొచ్చిన సిద్దరామయ్య వీటన్నింటికీ కారణమని ఆరోపించారు. వివాదం వెనుక కుట్ర ఉందని డీసీఎం డీకే శివకుమార్ ఆరోపించారని, ఈ విషయమై ముఖ్యమంత్రి నోరు విప్పడం లేదని, కాంగ్రెస్‌లోనే హిందూ వ్యతిరేక, హిందూ అనుకూల గ్రూపులు ఉన్నాయని పేర్కొన్నారు. మరోవైపు, ముస్లింలీగ్‌తోపాటు పలు హిందూ వ్యతిరేక సంఘాలతో సంబంధాలు పెట్టుకున్న కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ఆలయాలను మూసివేసే ప్రయత్నం చేస్తోందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి ఆరోపించారు. హుబ్బళ్లిలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎవరో ఒక అనామకుడు విన్నవించాడని ప్రభుత్వం ఏకంగా సిట్ ఏర్పాటు చేసిందన్నారు. ధర్మస్థళ ధర్మాధికారి వీరేంద్రహెగ్డే పట్ల నోటికొచ్చినట్టు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు.

ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్



(మొదటి పేజీ తరువాయి)

పనిచేశారు. 2016 నుంచి 2019 వరకు ఆలిండియా కాయర్ బోర్డు చైర్మన్‌గా సేవలందించారు. 2023 ఫిబ్రవరి 18న ఝార్ఖండ్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2024 మార్చి 19 నుంచి జూలై 31 వరకు తెలంగాణ గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. 2024 జూలై 27న మహారాష్ట్ర గవర్నర్‌గా నియమితులై కొనసాగుతున్నారు.

ధన్‌ఖడ్ అనూహ్య రాజీనామాతో..

2022లో ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన జగదీప్ ధన్‌ఖడ్.. అనారోగ్య కారణాలు చూపుతూ ఈ ఏడాది జూలై 21న అనూహ్యంగా పదవికి రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఉప రాష్ట్రపతి ఎన్నికకు షెడ్యూల్ విడుదల చేసింది. ఆగస్టు 7న నోటిఫికేషన్ ఇవ్వగా, 21 వరకు నామినేషన్లకు అవకాశం కల్పించింది. సెప్టెంబరు 9న పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రకటించిన అభ్యర్థికే తమ మద్దతు అని, అభ్యర్థి ఎవరనేదీ ఆయన అభీష్టమేనని ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు ప్రకటించాయి. ఈ నెల 6న జరిగిన సమావేశంలో టీడీపీ సహా కీలక భాగస్వామ్య పక్షాలన్నీ ఈ మేరకు ప్రకటనలు చేశాయి. అయితే 2026లో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అదే రాష్ట్రానికి చెందిన సీపీ రాధాకృష్ణన్‌ను ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా బీజేపీ ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాధాకృష్ణన్ అభ్యర్థిత్వానికి ప్రతిపక్ష పార్టీల నుంచి కూడా మద్దతు లభిస్తుందని బీజేపీ భావిస్తోంది. విపక్ష ఇండియా కూటమిలో కీలకంగా ఉన్న తమిళనాడులోని అధికార డీఎంకే.. సీపీ రాధాకృష్ణన్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించదని అంచనా వేస్తోంది.

చంద్రబాబు శుభాకాంక్షలు

హైదరాబాద్/అమరావతి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్‌ను ఎంపిక చేయడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ రాజనీతిజ్ఞుడు, సుదీర్ఘకాలం దేశానికి సేవలందించిన గౌరవప్రదమైన నాయకుడు అయిన సీపీ రాధాకృష్ణన్ ఉప రాష్ట్రపతిగా నామినేషన్ వేయడాన్ని హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే, రాధాకృష్ణన్ ఎంపిక పట్ల తెలంగాణ బీజేపీ శాఖ హర్షం వ్యక్తం చేశారు. సుదీర్ఘ అనుభవం కలిగిన రాధాకృష్ణన్ ఉప రాష్ట్రపతిగా అందరి మన్ననలు పొందుతారని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్... ఇండియన్ తాలిబన్

▸ సంఘ్ వల్ల దేశంలో శాంతికి విఘాతం

▸ కాంగ్రెస్ నేత హరిప్రసాద్ విమర్శలు



న్యూఢిల్లీ, ఆగస్టు 17: ఆర్ఎస్ఎస్‌పై ఎర్రకోట వేదికగా ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించడంపై మాటల తూటాలు పేలుతున్నాయి. కాంగ్రెస్ మాజీ ఎంపీ, ప్రస్తుత కర్ణాటక శాసనమండలి సభ్యుడు బీకే హరిప్రసాద్.. సంఘ్‌ను ఇండియన్ తాలిబన్లుగా పేర్కొంటూ, ఈ సంస్థవల్ల దేశంలో శాంతికి విఘాతం కలుగుతోందని హరిప్రసాద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోనే అతి పెద్ద ఎన్‌జీవో ఆర్ఎస్ఎస్ అని, ఎందరో స్వయంసేవకులు దేశ స్వాతంత్ర్య సమరంలో ప్రాణాలను త్యాగం చేశారని ప్రధాని మోదీ కొనియాడిన విషయం విదితమే. దీనిపై స్పందించిన హరిప్రసాద్... సంఘ్ ఏనాడైనా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నదా అని నిలదీశారు. అసలు ఆర్ఎస్ఎస్ ఒక రిజిస్టర్డ్ సంస్థ కూడా కాదని, అయినా దానికి నిధులు ఎలా సమకూరుతున్నాయో అర్థం కావడం లేదని కాంగ్రెస్ నేత మండిపడ్డారు. దీనిపై బీజేపీ కూడా దీటుగా స్పందించింది. ఆర్ఎస్ఎస్‌ను గాంధీ, జయప్రకాశ్ నారాయణ్‌లే కొనియాడారని బీజేపీ అధికార ప్రతినిధి షెహనాజ్ పూనావాలా పేర్కొన్నారు. సాక్షాత్తూ కాంగ్రెస్ మాజీ అగ్రనేత ప్రణబ్ ముఖర్జీ కూడా సంఘ్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్‌దే తాలిబన్ మైండ్‌సెట్ అంటూ దుయ్యబట్టారు.

మానసిక వేధింపులను ఎదుర్కొనే మహిళల్లో గుండె జబ్బులు వచ్చే ముప్పు ఎక్కువ

▸ హార్వర్డ్ వర్సిటీ పరిశోధకులు అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 17: మానసిక వేధింపులను ఎదుర్కొనే మహిళల్లో గుండె సంబంధిత వ్యాధులు వచ్చే ముప్పు సాధారణం కన్నా 41% ఎక్కువని హార్వర్డ్ వర్సిటీ పరిశోధకులు నిర్వహించిన తాజా అధ్యయనంలో తేలింది. ప్రపంచవ్యాప్తంగా ప్రతీ ముగ్గురు మహిళల్లో ఒకరు ఏదో ఒక సందర్భంలో వేధింపులకు గురవుతున్నారని ఈ అధ్యయనం ఆందోళన వ్యక్తం చేసింది. "అది చేయవద్దు.. ఇది చేయవద్దు.. అని మహిళలపై ఇంట్లో ఆంక్షలు విధిస్తారు. పనిచేసే చోట్ల మహిళలు ఎన్నో వేధింపులు ఎదుర్కొంటారు. మానసిక వేధింపుల్లో హింస ఉండని కారణంగా చాలా మంది వీటిని తక్కువ ప్రమాదకరమైనవిగా భావిస్తారు. కానీ, ఇవి మహిళల వయస్సు పెరుగుతున్న కొద్దీ వారి ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావాన్ని కలుగజేస్తాయి. గుండె జబ్బులు, స్ట్రోక్‌కు కారణం అవుతాయి" అని అధ్యయనంలో పాల్గొన్న పరిశోధకురాలు రెబెకా తెలిపారు. మానసిక వేధింపులతో మహిళల్లో ఒత్తిడి పెరిగి, అది నరాల వ్యవస్థపై ప్రభావం చూపిస్తుందని, తద్వారా వారి శారీరక ఆరోగ్యం దెబ్బతింటుందని వివరించారు. రెండు దశాబ్దాల పాటు నిర్వహించిన ఈ అధ్యయనాన్ని 'సర్క్యులేషన్' అనే జర్నల్‌లో ప్రచురించారు.

ఢిల్లీలో శుభాన్షు శుక్లాకు ఘన స్వాగతం

▸ నేడు ప్రధాని మోదీని కలవనున్న శుక్లా

▸ తర్వాత స్వస్థలం లఖ్‌నవూకు పయనం



శుక్లాకు స్వాగతం పలుకుతున్న రేఖాగుప్తా, జితేంద్రసింగ్

న్యూఢిల్లీ, ఆగస్టు 17: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన తొలి భారత వ్యోమగామిగా రికార్డు సృష్టించిన శుభాంశు శుక్లా.. ఆదివారం తెల్లవారుజామున స్వదేశానికి తిరిగొచ్చారు. శుక్లాతోపాటు బ్యాకప్ వ్యోమగామిగా అమెరికాకు వెళ్లిన ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ కూడా భారత్‌కు చేరుకున్నారు. వీరికి ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, ఇస్రో చైర్మన్ వి నారాయణన్ ఘన స్వాగతం పలికారు. యాక్సియం-4 మిషన్ శిక్షణలో భాగంగా శుక్లా గతేడాది అమెరికాకు వెళ్లిన సంగతి తెలిసిందే. ఏడాది తర్వాత తొలిసారిగా భారత్‌కు చేరుకోవడంతో శుక్లాకు స్వాగతం పలకడానికి ఆయన భార్య కామ్నా, కుమారుడు కియాష్ కూడా విమానాశ్రయానికి చేరుకున్నారు. భారీగా తరలివచ్చిన ప్రజలు, అభిమానులు త్రివర్ణ పతాకాలు ఊపుతూ, డ్రమ్స్ వాయిస్తూ స్వాగతం పలికారు. శుభాంశు శుక్లా విజయానికి గుర్తుగా 'అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో భారత మొదటి వ్యోమగామి-2047 నాటికి వికసిత్ భారత్ కోసం అంతరిక్ష కార్యక్రమం కీలక పాత్ర' అనే అంశంపై కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చకు ప్రతిపాదించింది. భారత్‌కు చేరుకున్న శుక్లా ముందుగా సోమవారం ఢిల్లీలో ప్రధాని మోదీని కలుసుకుంటారు. అనంతరం తన స్వస్థలమైన ఉత్తరప్రదేశ్‌లోని లఖ్‌నవూకు వెళ్లనున్నారు. ఈ నెల 22-23వ తేదీల్లో జరిగే జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ఆయన తిరిగి దేశ రాజధానికి చేరుకుంటారు. అమెరికాలోని ఫ్లోరిడా నుంచి ఈ ఏడాది జూన్ 25న అంతరిక్షంలోకి దూసుకెళ్లిన యాక్సియం-4 మిషన్‌లోని నలుగురు వ్యోమగాముల్లో శుభాంశు శుక్లా ఒకరు. విజయవంతంగా ఐఎస్ఎస్‌లోకి చేరిన ఈ నలుగురు వ్యోమగాములు అక్కడ పలు ప్రయోగాలు పూర్తిచేసుకుని ఈ ఏడాది జూలై 15న భూమిపైకి చేరుకున్నారు.

తిరుమలలో వేడుకగా ఉట్లోత్సవం



ఉట్టి కొట్టేందుకు ఎక్కుతున్న యువకులు

తిరుమల, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకల్లో భాగంగా తిరుమలలో ఆదివారం ఉట్లోత్సవం వైభవంగా జరిగింది. శ్రీవారి ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం నిర్వహించిన మరుసటి రోజు ఉట్లోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా మలయప్పస్వామి ఓ తిరుచ్చిపై, శ్రీకృష్ణస్వామి మరో తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగుతూ ఉట్లోత్సవాన్ని తిలకించారు. ముందుగా మలయప్పస్వామి, కృష్ణస్వామి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా పెద్దజీయర్ మఠానికి వేంచేపు చేసి ఆస్థానం నిర్వహించారు. అనంతరం శ్రీవారి ఆలయం ముందు ఉట్లోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

తిరుమలలో సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ కాస్త తగ్గింది. ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు... వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరి పార్కులోని తొమ్మిది షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వీరికి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. ఇక, టైంస్లాట్ భక్తులకు కూడా రెండు నుంచి మూడు గంటల దర్శన సమయం పడుతోంది. మరోవైపు తిరుమలలో గదులకు డిమాండ్ కొనసాగుతునే ఉంది. గదులు లభించని భక్తులు జర్మన్‌షెడ్లు, పార్కులు, చెట్ల కింద, ఫుట్‌పాత్‌లపై సేదతీరుతున్నారు. సీఆర్వో ముందు గదుల కోసం భక్తులు పడిగాపులు కాస్తున్నారు.

నెలరోజుల్లో పీఎస్‌లకు కొత్త వాహనాలు: హోం మంత్రి

నక్కపల్లి (అనకాపల్లి జిల్లా), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజుల్లో అన్ని పోలీస్ స్టేషన్లకూ కొత్త వాహనాలను సమకూర్చుతామని, పోలీస్‌శాఖకు అన్ని సదుపాయాలనూ కల్పిస్తున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందన్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి ఆదివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ 'మహిళల భద్రతకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 60 వేల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. త్వరలో మరో 40 వేల కెమెరాలు ఏర్పాటు చేస్తాం. హైవే జంక్షన్లతో పాటు ఆస్పత్రులు, మాల్స్, స్కూళ్లు, హాస్టళ్లు, ఫ్రీ బస్సు పాయింట్ల వద్ద కూడా సీసీ కెమెరాలను అమర్చుతాం. మహిళల రక్షణ కోసం శక్తి యాప్‌ను సమర్థంగా నిర్వహిస్తున్నాం. వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రవేశపెట్టాం. గంజాయిపై ఉక్కుపాదం మోపాం' అని చెప్పారు. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ తొమ్మిది నెలల్లో ఇక్కడ పోలీస్‌స్టేషన్ భవనం పూర్తవుతుందని, ప్రారంభోత్సవానికి కూడా వస్తానని అన్నారు. విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఎస్పీ తుహిన్‌సిన్హా, డీఎస్పీలు పి.శ్రీనివాసరావు, శ్రావణి, సీఐలు కుమారస్వామి, లొడ్డు రామకృష్ణ, అప్పన్న పాల్గొన్నారు.

నూర్ మహమ్మద్ జిహాద్ కోసం పనిచేస్తున్నాడు

▸ పాక్ ప్రేరేపిత నిషిద్ధ ఉగ్రవాద గ్రూపుల్లో యాక్టివ్‌గా ఉన్నాడు

▸ ధర్మవరం వాసి ఉగ్రలింకులపై శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నిషేధిత ఉగ్రవాదులతో లింకులు కలిగిన శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన నూర్ మహమ్మద్ జీహాద్ కోసం పనిచేస్తున్నట్లు పోలీసు విచారణలో తేలిందని ఎస్పీ రత్న వెల్లడించారు. పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం మీడియాకు ఆమె వివరాలు వెల్లడించారు. రాష్ట్ర కౌంటర్ ఇంటెలిజెన్స్‌కు వచ్చిన సమాచారం మేరకు ధర్మవరంలోని లోనికోట ప్రాంతానికి చెందిన కొత్వాల్ నూర్ మహమ్మద్‌ను ఈనెల 16న అరెస్టు చేసి, అతడి నుంచి నిషేధిత జాబితాలో ఉన్న 6 పాక్ ప్రేరేపిత ఉగ్ర సంస్థలకు సంబంధించిన జిహాదీ సిద్ధాంత పుస్తకాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అతడు పాక్ ఉగ్రవాద సంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్న 36 సోషల్ మీడియా గ్రూపుల్లో సభ్యత్వం కలిగి ఉన్నట్లు తెలిపారు. ఆరు పాక్ ప్రేరేపిత నిషేధిత ఉగ్రవాద గ్రూపుల్లో యాక్టివ్‌గా ఉన్నాడనీ, ఉగ్రవాద భావజాలం కలిగి ఉండి దేశ వ్యతిరేక ప్రచారం, జిహాద్ కోసం పనిచేస్తున్నట్లు పోలీసు విచారణలో తేలిందని పేర్కొన్నారు. అందుకు సంబంధించిన మొబైల్‌ఫోన్, ఉగ్రవాద సాహిత్యం ఉన్న పుస్తకాన్ని స్వాధీనం చేసుకున్నామని, అతడి మొబైల్ ఫోన్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపామని వెల్లడించారు. నివేదిక వచ్చిన తర్వాత నిషేధిత ఉగ్రవాద సంస్థల్లో అతడి పాత్ర ఏమిటో, ఎవరెవరితో సంబంధాలున్నాయి.. ఇతర ఉగ్రవాద లింకులు తదితర వివరాలను వెల్లడిస్తామని ఎస్పీ తెలిపారు.

మావోయిస్టు అరెస్టు.. ఆయుధాలు స్వాధీనం



మావోయిస్టు నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలతో ఎస్పీ అమిత్ బర్దార్

పాడేరు రూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం కిల్లంకోట పంచాయతీ చింతగుప్ప గ్రామ సమీపంలో ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా బలియాపుట్టు గ్రామానికి చెందిన మావోయిస్టు చైతో అలియాస్ నరేశ్‌ను శనివారం సాయంత్రం పట్టుకుని అరెస్టు చేసినట్టు ఎస్పీ అమిత్ బర్దార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరురులకు వివరాలు వెల్లడించారు. చింతగుప్ప పరిసర ప్రాంతాల్లో కూంబింగ్ చేస్తున్న పోలీసులకు మావోయిస్టులు తారసపడ్డారని, కాల్పులు జరుపుతూ తప్పించుకునేందుకు ప్రయత్నించారని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా చైతోను పట్టుకున్నట్టు చెప్పారు. అతడి నుంచి 90 ఎంఎం పిస్టల్, 904 ఎంఎం అమ్మునిషన్, 303 రైఫిల్ మ్యాగ్జైన్, 303 లైవ్ అమ్మునిషన్, 3 కిట్ బ్యాగ్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. 2011లో జననాట్య మండలి బృందంలో చేరిన చైతో 15 ఏళ్ల వయసులోనే మావోయిస్టు దళంలో చేరాడన్నారు. 2017లో కటాఫ్ ఏరియా బొయిపరగుడ దళ కమాండర్‌గా బాధ్యతలు చేపట్టాడన్నారు. ప్రస్తుతం డీసీఎం సభ్యుడిగా, పెదబయలు, కోరుకొండ ఏరియా కమిటీ సెక్రటరీగా మావోయిస్టు కార్యకలాపాలు సాగిస్తున్నాడన్నారు. ఇప్పటికే 8 ఎన్‌కౌంటర్లలో చైతో పాల్గొన్నాడని వివరించారు. మావోయిస్టులు లొంగిపోతే వారికి పునరావాసం కల్పిస్తామని ఎస్పీ అమిత్ బర్దార్ తెలిపారు.



యశ్వంత్, జ్యాన్యజాయ్‌తో మురళీకృష్ణ, సునీత దంపతులు

పెళ్లి చేసిన చెవినొప్పి..!

▸ చికిత్స చేసిన డాక్టర్‌తో ప్రేమ

▸ ఒక్కటైన ఆంధ్రా అబ్బాయి...మెక్సికో అమ్మాయి

మెక్సికోలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ఆంధ్రా అబ్బాయి...ఒకరోజు అతనికి చెవినొప్పి వచ్చింది... అక్కడే ఓ మహిళా ఈఎన్‌టీ డాక్టర్ వద్దకు వైద్యానికి వెళ్లాడు. చికిత్స తీసుకున్నాడు. వారిద్దరికీ అక్కడ ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. పెద్దలు కూడా ఓకే చెప్పారు. అంతే... ఇద్దరూ ఒక్కటయ్యారు. ఆ అబ్బాయి ఎన్టీఆర్ జిల్లా గన్నవరం శివారు మర్లపాలేనికి చెందిన జాస్తి మురళీ కృష్ణ, సునీత దంపతుల కుమారుడు యశ్వంత్. ఆ అమ్మాయి జ్యాన్యజాయ్ రూయిజ్ అంజర్. గన్నవరంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి భారత సంప్రదాయం ప్రకారం పురోహితులు వీరిద్దరికీ వివాహం జరిపించారు. అదీ సంగతి!

-గన్నవరం, ఆంధ్రజ్యోతి

సెప్టెంబరు 12న సేవ్ ఆర్టీసీల డే

▸ జాతీయస్థాయిలో నిరసన

▸ 'ఫెడరేషన్' నిర్ణయం

విజయవాడ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబరు 12న 'సేవ్ ఆర్టీసీల డే' పేరిట జాతీయస్థాయిలో నిరసన దినం నిర్వహించాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్, ఏపీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నిర్ణయించాయి. అలాగే విద్యుత్ బస్సుల పాలసీని మార్చాలని సెప్టెంబరు 2న ఆందోళన చేపట్టాలని నిర్ణయించాయి. హైదరాబాద్‌లోని సుందరయ్య భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో దక్షిణాది రాష్ట్రాలు, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఆర్టీసీ యూనియన్ నాయకులు పాల్గొనగా, ప్రముఖ రవాణా రంగ నిపుణులు సీఐఆర్‌టీ పూణె పూర్వపు డైరెక్టర్, ఏపీఎస్‌ఆర్టీసీ విలీన కమిటీలో సభ్యుడిగా పనిచేసిన డాక్టర్ సుదర్శన్ పాదం అధ్యక్షత వహించారు. విద్యుత్ బస్సుల వల్ల ఆర్టీసీలకు కలిగే ప్రమాదంపై విస్తృతంగా చర్చించి ముసాయిదా తీర్మానాన్ని రూపొందించారు.

భర్త సెల్‌ఫోన్ ఇవ్వలేదని భార్య ఆత్మహత్య

ముదిగుబ్బ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): భర్త సెల్‌ఫోన్ ఇవ్వలేదని భార్య ఆత్మహత్య చేసుకుంది. శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం యాకర్లకుంటపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. ముదిగుబ్బ పోలీసుల కథనం మేరకు.. మహారాష్ట్రకు చెందిన సుధీర్ కట్కర్‌కు నీమా కట్కర్(18)తో ఆరునెలల క్రితం వివాహమైంది. వీరు బొగ్గులు కాల్చే పనికి ముదిగుబ్బ మండలానికి వలస వచ్చారు. ఆదివారం సాయంత్రం సుధీర్ కట్కర్‌ను సెల్‌ఫోన్ ఇవ్వాలని నీమా కట్కర్ అడిగింది. అతడు చార్జింగ్ లేదంటూ భార్యతో వాగ్వాదం చేసి వెళ్లిపోయాడు. మనస్తాపం చెందిన నీమా కట్కర్ గుడిసె సమీపంలో ఉన్న చెట్టుకు ఉరేసుకుంది.



వధూవరులతో మంత్రులు లోకేశ్, నిమ్మల, స్పీకర్ అయ్యన్న, ఎమ్మెల్యేలు

మంత్రి నిమ్మల కుమార్తె నిశ్చితార్థం..

▸ వధూవరులను ఆశీర్వదించిన మంత్రి లోకేశ్

పాలకొల్లు అర్బన్/ పాలకొల్లు టౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు కుమార్తె శ్రీజ నిశ్చయ తాంబూలాల కార్యక్రమం ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హాజరై వధూవరులు శ్రీజ, పవన్‌లను ఆశీర్వదించారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ కే. రఘురామ కృష్ణరాజు, మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, కేంద్ర మంత్రి బీహెచ్ శ్రీనివాస వర్మ తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడిగా విద్యాసాగర్



విద్యాసాగర్‌ను సత్కరిస్తున్న ఎన్‌జీజీవో నేతలు

విజయవాడ (గాంధీనగర్), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎస్‌జీఈఎఫ్) జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ ఎన్నికయ్యారు. న్యూఢిల్లీలో ఆదివారం జరిగిన సమాఖ్య జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు.

డీఏ బకాయిలపై హైకోర్టుకు : ఏపీసీపీఎస్‌ఈఏ

విజయవాడ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్‌ఈఏ) హైకోర్టును ఆశ్రయించింది. ఈ విషయాన్ని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాజీ పఠాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలను చెల్లించడానికి ప్రభుత్వం జీవో విడుదల చేసినప్పటికీ ఐదేళ్లుగా ఉద్యోగుల ఖాతాల్లో నగదు జమ కాలేదని, ప్రభుత్వానికి, అధికారులకు వందలసార్లు విన్నవించుకున్నా ప్రయోజనం లేదని పేర్కొన్నారు. హైకోర్టు, అసెంబ్లీలో పనిచేస్తున్న సీపీఎస్ ఉద్యోగులకే బకాయిలు చెల్లించి, మిగిలినవారికి ఇంతవరకు చెల్లించకపోవడం రాజ్యాంగ ఉల్లంఘన అవుతుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎస్ రద్దు కోసం రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు చేసి మరణించిన వారి కుటుంబాలకు డెత్ గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ సాధించడానికి సెప్టెంబరు 1న 'పెన్షన్ మార్చ్' చేస్తామని తెలిపారు. నాగార్జున యూనివర్సిటీ నుంచి విజయవాడలోని అంబేడ్కర్ విగ్రహం వరకు నల్లదుస్తులు ధరించి పాదయాత్రగా వెళ్లి నిరసన తెలుపుతామని, ప్రతి ఉద్యోగి పాల్గొని మార్చ్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

నల్లకలువల కొలనులో వికసించిన కవిత్వం



అనిశెట్టి రజిత వరంగల్ చైతన్యజ్వాల. హోరెత్తి ఎగిసిపడే కల్లోల కాలపు కడలి తరంగం. కవిత్వమై కాలాన్ని వ్యాఖ్యానించిన సంవేదనాశీలి. ఉద్యమోపజీవి. 1958 ఏప్రిల్ 14న పుట్టి పద కొండేళ్ళ వయసులోనే 1969 ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఎత్తిన పిడికిలి, విప్పిన ధిక్కారస్వరం– అర్ధదశాబ్దకాలం బహుముఖ సామాజిక ఉద్యమాలలో, ఊరేగింపులలో ఆమెను ముందువరసలో నిలిపాయి. అరవై ఏడేళ్ల వయసులో 2025 ఆగస్టు 11న తుది ఊపిరి ఆగేవరకు ఆ పిడికిలి బిగి సడలలేదు. ధిక్కారం మొక్క పోలేదు. కవిత్వం శాశ్వత చిరునామాగా అవి నిరంతర స్ఫూర్తిదాయక శక్తులై భాసిస్తాయి.

కార్మికులు, కర్షకులు, విప్లవవీరులు, శ్రామిక స్త్రీలు అందరూ ఆమె కవితలలో సందడి సందడిగా కనబడతారు. జన్మభూమి పథకాలు, విప్లవవీరుల తలలకు వెలకట్టే విధానాలు, మహిళా సాధికారత లోని మాయ, స్త్రీలపై అనుక్షణం జరిగే అత్యాచారాలు, ఇంటి పని వంటి అనేక సమస్యలను సహానుభూతితో కవిత్వం చేసింది. శ్రామిక బహుజన స్త్రీ సమస్యలను సంబోధించటం, చదువుకున్న మధ్యతరగతి భాషను వదిలి శ్రామిక జన వ్యవహార భాషలో యాసలో కవిత్వాన్ని రాయటం రజిత ప్రత్యేకతలు.

రజిత ఉద్యమ కవిత్వం ప్రధానంగా స్త్రీ సమస్యను, దళిత సమస్యను, తెలంగాణ అస్తిత్వ ఆరాట ఆత్మగౌరవ ఆకాంక్షలను చుట్టుకొని కనిపిస్తుంది. అంతర్జాతీయ మహిళా దశాబ్ది చైతన్య స్ఫూర్తితో 1984లో ప్రచురించిన 'గులాబీలు జ్వలిస్తున్నాయి' సంపుటిలో గులాబీ సౌందర్య సౌకుమార మాధుర్యాలతో, నలిగి పడ్డ అత్తరు త్యాగాలతో ఉపశమింపబడే ఆడవాళ్ళను అంతరంగ వేదన నుండి 'జ్వలించే గులాబీలు' అని పునర్నిర్వచించింది రజిత. వరకట్నపు ఆత్మహత్యలు హత్యలు, అత్యాచారాలు నిత్యకృత్యం అయిన ఈ మూడు దశాబ్దాల స్త్రీల దుఃఖపు జీర రజిత కవిత్వంలో వినబడుతుంది. 2012 డిసెంబర్‌లో ఢిల్లీలో జ్యోతి సింగ్‌పై జరిగిన అత్యాచార ఘటన సందర్భం నుండి 'అవును మౌనాన్నే మాట్లాడుతున్నాను' కవిత రాసింది. "నిత్య గాయాల జ్యోతిలా మండుతూ/ ఉద్యమ భాషనై మాట్లాడుతున్నాను" అనే కవితా పాదాలు రెండు ఆమె తననుతాను ఉద్యమప్రతినిధిగా నిలబడి మాట్లాడటాన్ని సూచిస్తాయి. రుద్రమ ప్రచురణల పక్షాన అత్యాచారాలపై వరంగల్ కవుల నిరసన కవిత్వాన్ని సేకరించి 'ఉద్విగ్న'ను ప్రచురించింది.

1985 కారంచేడు ఘటన పరిణామంలో తెలుగు నాట దళిత అస్తిత్వ ఉద్యమంగా బలపడింది. 'నేనొక నల్ల మబ్బునవుతా'నంటూ దానితో మమేకతను కవితాముఖంగా ప్రకటించింది రజిత. నలుపును దళిత సంకేతం చేసి 'నలుపిప్పుడు కోట్లాది బాధితుల చేతుల ఆయుధమై', నిరసన ప్రకటిస్తున్న వర్తమాన వాస్తవాన్ని చెబుతూ–

"ఈ నల్లమనుషులే/ కాకిగోలతో మీరు నటించే గాఢనిద్ర నుండి/ లేవగొట్టే దండోరాలవుతారు" – అంటూ 'నలుపంటే భయమెందుకు' కవితలో అగ్రవర్ణ అహంకారాన్ని సవాల్ చేసింది.

తెలంగాణ ఉద్యమ సందర్భంలో తెలంగాణ గుణగానం, తెలంగాణ సంస్కృతీ సంకీర్తనం, తెలంగాణలోని విశిష్టవ్యక్తుల ప్రశంస, తెలంగాణ రాష్ట్ర ఉద్యమ ఘటనలు రజిత కవిత్వానికి వస్తువైనాయి. అయితే కవితలను ఈ పద్ధతిలో వర్గీకరించి చెప్పటం కూడా కష్టమే. తరచూ అవన్నీ ఒక కవితలోనే కలగలిసి ఉంటాయి. 'జీవగడ్డగచేయ', 'పాట పుట్టిన ఊరు ఉయ్యాలో', 'పాట పూచిన' వంటి కవితలలో ఇది చూడవచ్చు. మొదటి కవితలో తెలంగాణ భాష ప్రశస్తి, కాకతీయచరిత్ర వైభవం, ప్రాచీన తెలంగాణ కవుల ప్రశస్తి, విప్లవోద్యమ ప్రస్తావన, తెలంగాణ ఉద్యమానికి చాళ్ళు దీసిన జయశంకర్ జనార్దన్, రాములు వంటి వాళ్ళ ప్రశంస, బతుకమ్మ పండుగ ప్రత్యేకత వంటివి కలగలిసి ఉన్నాయి. 'తల్లీ తెలంగాణమా', 'తెలంగాణ మార్చ్', 'నరుడా వినరా', 'అబ్బబ్బో సర్కారోడా' వంటి కవితలు తెలంగాణ రాష్ట్ర ఉద్యమం వలస విముక్తి ఆశయాన్ని పదే పదే నొక్కి చెప్పాయి. ప్రధానంగా ఇవి 2009 డిసెంబర్ 9న రాష్ట్రం ఇవ్వటానికి అంగీకరిస్తూ కేంద్ర ప్రభుత్వం చేసిన సూత్రప్రాయ ప్రకటన ఉపసంహరింపబడిన తరువాత ఉధృతమైన మలి దశ ఉద్యమకాలానికి చెందినవి. 'అబ్బబ్బో సర్కారోడా' కవిత ఇచ్చినమాట తప్పిన కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ఆగ్రహప్రకటన కాగా, ప్రత్యేక తెలంగాణా ఆకాంక్షకున్న ప్రజాబలం ప్రదర్శించటానికి 2011 మార్చ్ 10 న జరిగిన సాగరహార దృశ్యాన్ని కళ్ళ ముందు ఆవిష్కరింప చేసే కవిత 'తెలంగాణ మార్చ్'.

> **రజిత ఉద్యమ కవిత్వం ప్రధానంగా స్త్రీ సమస్యను, దళిత సమస్యను, తెలంగాణ అస్తిత్వ ఆరాట ఆత్మగౌరవ ఆకాంక్షలను చుట్టుకొని కనిపిస్తుంది. సామాజికంలోనూ వ్యక్తిగతంలోనూ రజితకి కవిత్వం ఊరట అయింది, ఓదార్పు అయింది. తన లోపల నిరంతరం జాజ్వల్యమానంగా రగిలే భావోద్వేగాలకి బాసట అయింది. ఆ జ్వాలాముఖి స్వరం శాశ్వతంగా మూగబోయింది, తను పంచిన కవితలను గుర్తులుగా వదిలి.**

తెలంగాణ ఉద్యమం, మహిళా సమస్యలు, కులపోరాటాలు, ప్రపంచీకరణ ఫలితాల వంటి అనేక ఘనమైన అనుభవాలను దాటి వచ్చాక కవి రజిత మనసు పాత జ్ఞాపకాల్లోకి తొంగి చూసింది. కాలం కాన్వాస్ మీద తను పుట్టిన ఊరుని కన్న తండ్రి, వసివాడని మనుషులు, గాయపడిన పాటలు, అమలిన గీతాలతో చిత్రించింది. 2023 లో వచ్చిన రజిత ఆఖరి కవితా సంపుటి 'కాలం కాన్వాస్ మీద' ఆమె అంతర్గాన కవితా లోలత్వంతో నిండిపోయింది: "ఊరంటే ఉట్టి మట్టి కాదు/ మట్టీ! మనిషీ! ఉత్పత్తి!/ ఊరంటే జనజీవన తంత్రం!/ సూర్యునితో కలెదిర్గే శ్రమ యంత్రం!" అని 'ఊరు బంధం' కవితలో అంటుంది. మనిషిని మనిషి పట్టించుకునే ఆరాటాలు తగ్గిన చోట ఊరు అటువంటి మానవీయ స్నేహాలను నిలిపి ఉంచుతుందని నమ్మింది రజిత. అందుకే జ్ఞాపకాల పల్లెలో తన బాల్యపు ఉనికికి చోటు లేకపోవడం గురించి వేదన పడుతుంది. అది సహజమూ, పరిణామ క్రమంలో భాగమూ అని తెలిసినా సరే ఆ మనాది ఆమెని నిలువనియ్యలేదు: "నా పల్లె జాడ ఏడనో జెప్పుండ్రని/ నోరార్సుకుపోంగ అడుగుతాంది/ కాలుగాలి కాటుగల్సిన పిల్లోలె గాయిరిగాయిరిగా తిరుగుతాంది" అంటూ ఇప్పటి ఊర్లలో తనకి కనిపించని గుండె తడిని తల్చుకుని బుగులు పడుతుంది. 'మా నాన్నే విశాల ప్రపంచం', 'మా నాయిన విశ్వమానవుడు' వంటి కవితల్లో తన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దిన తండ్రిని పదేపదే తల్చుకుంది రజిత. స్వేచ్ఛ, మానవ సంస్కారం, ప్రజాస్వామికత మొత్తంగా సమాజ సూత్రాలని పరిచయం చేసి స్వేచ్ఛా విహంగంలా తనను వినీలాకాశంలోకి ఎగురవేసిన 'నాయిన' ఆమె జీవితంలోనే కాదు, కవిత్వంలోనూ కథా నాయకుడే.

సామాజికంలోనూ వ్యక్తిగతంలోనూ రజితకి కవిత్వం ఊరట అయింది, ఓదార్పు అయింది. తన లోపల నిరంతరం జాజ్వల్యమానంగా రగిలే భావోద్వేగాలకి బాసట అయింది. ఆ జ్వాలాముఖ స్వరం శాశ్వతంగా మూగబోయింది, తను పంచిన కవితలను గుర్తులుగా వదిలి.

■ కాత్యాయనీ విద్మహే
■ కె ఎన్ మల్లీశ్వరి

దళిత కవితా సంపుటుల పరిచయం

దళిత రచయితల వేదిక, ఆంధ్ర ప్రదేశ్ – కవి సంధ్య, హైదరాబాద్ – భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం సౌజన్యంతో చల్లపల్లి స్వరూప రాణి 'అల్లిక', కోయి కోటేశ్వర రావు 'నాగస్వరం', తుల్లిమిల్లి విల్సన్ సుధాకర్ 'పోరాట పద్యం' – ఈ మూడు దళిత కవితా సంపుటాల పరిచయ సభ ఆగస్టు 24 సా.6గం.లకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. శిఖామణి అధ్యక్షతన జరిగే ఈ సభలో విమల, దార్ల వెంకటేశ్వరరావు, కదిరే కృష్ణ గ్రంథ పరిచయాలు చేస్తారు. చూపు కాత్యాయని, సంగిశెట్టి శ్రీనివాస్, జి.వి. రత్నాకర్‌లు ఆప్తవచనం పలుకుతారు. వివరాలకు: 98482 02526.

కవి సంధ్య

మంజీర పుస్తకావిష్కరణ సభ

విప్లవ కవి మంజీర రచనలు, జ్ఞాపకాలతో విరసం ప్రచురించిన 'వివా కామ్రేడ్ రవి' పుస్తకావిష్కరణ సభ ఆగస్టు 24 ఉ.10గం.లకు గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరుగుతుంది. సభలో పుస్తకాన్ని ఆవిష్కరించి పాణి, తాయమ్మ కరుణ, నల్లూరి రుక్మిణి, చిలకా చంద్ర శేఖర్, కేఎస్‌పీఎస్ కృష్ణ, వై వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడతారు.

రివేరా

అద్దేపల్లి సాహిత్య పురస్కారం

అద్దేపల్లి రామ మోహనరావు సాహిత్య పురస్కారాన్ని 2025కు గాను కవి, విమర్శకుడు, వక్త రెంటాల శ్రీ వేంకటేశ్వర రావుకు ప్రదానం చేస్తున్నాము. పురస్కార ప్రదాన సభ అద్దేపల్లి రామ మోహనరావు జన్మదిన మాసం సెప్టెంబర్ 7న కాకినాడలో జరుగుతుంది.

అద్దేపల్లి ఉదయభాస్కరరావు

సోమవారం 18 ఆగస్టు 2025

వివిధ

vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక
బొమ్మలు: అక్బర్

"రచన ప్రశ్నతో మొదలవ్వాలి"

– జయమోహన్

తమిళ రచయిత జయమోహన్ గారిని బుక్ బ్రహ్మ లిటరరీ ఫెస్టివల్‌లో చూసినప్పుడు ఒక సీనియర్ రచయిత లాంటి వేష భాషలు ఏం కనిపించలేదు. ఒక నార్మల్ సీనియర్ పర్సన్ లాగే అనిపించారు. నార్మల్ సీనియర్ పర్సన్స్‌కి కొన్ని కచ్చితమైన అభిప్రాయాలు ఉంటాయి, కొన్ని భేషజాలు ఉంటాయి, ముఖ్యంగా కొత్త తరం పట్ల ఒక చిన్నచూపు ఉంటుంది. కానీ, జయమోహన్ నా ఊహలు అన్నింటినీ తారుమారు చేశారు. సింపుల్, ఫ్రెండ్లీ, సులభంగా మాట కలపగలిగే వ్యక్తి.

మూడో రోజు ఉత్సవం ముగిశాక అందరూ వీడ్కోళ్లు చెప్పుకొని వెళ్ళిపోతుంటే, నాకు ఈ ఉత్సవం నుంచి ఒక పరిపూర్తి కావాలనిపించింది. ఆయనతో, ఇలా గుంపులో నిల్చొని కాకుండా, ఒక ముఖాముఖి చర్చ చెయ్యాలనిపించింది. ఆయన్ని అడగ్గానే చాలా మామూలుగా 'ఒకే ష్యూర్' అన్నారు. రాత్రి సెంట్రల్ యూనివర్సిటీ తమ్ముళ్ళు లిఖిత్, హర్ష, ఝూన్సీ పబ్లికేషన్స్ శ్రీదివ్యలను వెంటేసుకుని, లైట్లు ఆర్పేసిన కారిడార్‌లో ఫోన్ టార్చ్ ఆన్ చేసుకొని ఆయన గదికి చేరుకున్నాను. తలుపు తీయగానే ఎదురుగా టేబుల్ ముందు కూర్చుని జయమోహన్ నవ్వుతూ కనిపించారు. దండం పెట్టి ఎదురుగా ఉన్న మంచం మీద కూర్చున్నాను. మేమంతా సెటిల్ అయ్యాక జయమోహన్ మాట్లాడం మొదలైంది.

ముందుగా, తెలుగు సాహిత్యంతో మీకు ఉన్న పరిచయం ఏంటి?

తెలుగులో నాకు బాగా నచ్చిన నవల అల్పజీవి. విశ్వనాథ శాస్త్రి (రావి శాస్త్రి) గారి ఆ నవల ఎంతో గొప్ప రచన. నేను వివిధ భారతీయ భాషలలో వచ్చిన నవలల్ని పరిచయం చేస్తూ తెలుగు నుంచి 'అల్పజీవి' నవలని పరిచయం చేశాను. అలాగే నాకు చలం రచనలు కూడా ఇష్టం. దేవులపల్లి కృష్ణ శాస్త్రి గారి కవిత్వం నాకు ఎంతో ఇష్టం.

అసలు మీరు ఎందుకు రాస్తారు? డబ్బు, పేరు, కీర్తి ఇలాంటి వాటి కోసమా లేక ఒక కథ చెప్పాలనే, లేదా మీ లోపల ఉన్నదాన్ని వ్యక్తపరచాలనే ఓ బలమైన కోరిక వల్లనా?

ఇండియాలో రచయితగా మీరు బతకలేరు. రచన ఒక ఉద్యోగంగా అయ్యే పరిస్థితి లేదు. నేను ఇరవై ఏళ్ళు ప్రభుత్వ సంస్థలో ఉద్యోగం చేసి, నాకు సినిమాల్లో అవకాశాలు రావడం మొదలయ్యాక నేను ఉద్యోగానికి రాజీనామా ఇచ్చాను.

ఇంత సుదీర్ఘకాలం రచయితగా కొనసాగడం, ఇంత విస్తృతంగా రాయడం ఎలా సాధ్యం అయింది? (ఆయన పేరు మీద మూడు వందల పైనే పుస్తకాలు ఉన్నాయి!)

ఎవరైనా రచయిత ఎక్కువ కాలం రచయితగా కొనసాగాలంటే ఆరోగ్యకరమైన శరీరం ఉండడం ముఖ్యం. నేను నా శరీరాన్ని చాలా బాగా మెయింటైన్ చేస్తాను. ఆహారపు అలవాట్లు, నిద్రా, కాలకృత్యాలు అన్నీ పెర్ఫెక్ట్‌గా ఉంటాయి. నాకు ఇప్పుడు 63ఏళ్ళు. ఏ ఆరోగ్య సమస్యలూ లేవు. నేను అలోపతి మందులు కూడా అంత త్వరగా తీసుకోను, మత్తు కలిగించే ఎలాంటి మాదక ద్రవ్యాలూ ఎప్పుడూ తీసుకోలేదు. రచయితకి తన శరీరం పట్ల శ్రద్ధ ఉండాలి.



జయమోహన్ ప్రసాద్ సూరి

> **"వేరే జీవితో మనకు, 'తానే నేను' అన్నంతగా సహానుభూతి కలిగినప్పుడే మనం రాయగలం. ఇది ఒక నేపథ్యం కలిగిన వ్యక్తి మరొక నేపథ్యం గురించి రాసేటప్పుడూ ఉండాలి, ఒక వ్యక్తి మరొక వ్యక్తి గురించి రాసేటప్పుడూ ఉండాలి. తమిళంలో వెల్లలార్ అనే కవి అంటాడు, "నీళ్ళు లేక ఎండి పోయిన మొక్కను చూస్తే, నా మనసుకి ఎంతో కష్టంగా ఉంటుంది" అని. ఒక మొక్కతో కూడా మనల్ని మనం ఎంపతైజ్ చేసుకోగలిగినప్పుడు, వేరే నేపథ్యం కలిగిన వ్యక్తులతో ఎందుకు చేసుకోలేం?"**

మీరు ఒక రచనని ఏదైనా ఒక విషయం చెప్పాలనుకుని మొదలుపెడతారా? లేక ఏదైనా ఒక విషయం తెలిసినప్పుడు ఇది మంచి రచన అవుతుందని మొదలుపెడతారా?


రచన ఎప్పుడూ idea (ideology అనే మాటని ఆయన idea అన్నారు)తో మొదలు అవకూడదు. నీకు ఆల్రెడీ తెలిసిందాన్ని నిరూపించడం కోసం అన్నట్టుగా రచన చెయ్యకూడదు. రచన ప్రశ్నతో మొదలు అవ్వాలి. ఇప్పుడు తెలుగులో వచ్చిన 'తెల్ల ఏనుగు' నవలే తీసుకుంటే, అది ఒక ప్రశ్నతో మొదలైంది? ఈ దేశంలో దళితులు తెల్లవాళ్ళ పాలనను సపోర్ట్ చేశారు. ఎందుకంటే, దేశీయ రాజసంస్థానాలతో పోల్చుకుంటే, బ్రిటిష్ పాలనలో వాళ్ళకి గౌరవప్రదమైన జీవితం దొరికింది. కానీ అదే తెల్లవాడు కొన్ని కోట్లమంది చనిపోయే కరువుకు కారణం అయ్యాడు. ఆ కరువులో కళ్ల ముందు అన్ని వేల మంది చనిపోతూ ఉంటే ఏ చదువుకున్న బ్రాహ్మడూ దాని గురించి రాయలేదు. వీటన్నింటికి కారణం ఏంటి అనే ప్రశ్నతో ఈ నవల మొదలైంది. నవల చివరిలో నాకు దొరికిన సమాధానం ఎలాంటిదైనా కావొచ్చు. కానీ, ఆ సమాధానాన్ని అన్వేషిస్తూనే నా రచన నడుస్తుంది.

ప్రస్తుతం తెలుగులో అస్తిత్వ వాద ఉద్యమాలు బలంగా ఉన్నాయి. ఎంతోమంది వివిధ నేపథ్యాల నుంచి వచ్చి రచనలు చేస్తున్నారు. ఒక వాదన ఏంటంటే– ఎవరి గురించి వాళ్లే రాసుకోవాలని, వేరే వాళ్ళు రాయడం అన్నది సరైనది కాదని. దాని గురించి మీరేం అంటారు?

ఎవరి గురించి వాళ్ళు రాసుకోవడం మంచిదే. కాకపోతే మనం మనుషులు గానే ఎంతో వైవిధ్యం ఉన్న వాళ్ళం. మన పక్కనున్న వ్యక్తి గురించే మనకు తెలీదు. అలాంటప్పుడు వేరే వాళ్ళ గురించి నేను ఎలా రాయగలను? నేను రాసింది అంతా నా ఊహే అవుతుంది, లేదా నా అవగాహన అవుతుంది. ఇప్పటిదాకా వచ్చిన రచనలు అన్నీ అలా వచ్చినవే. ఇక్కడ మనం గుర్తుపెట్టుకోవాల్సింది– మనకు తెలీని దాని గురించి రాస్తున్నప్పుడు మనకు ఉండాల్సింది అవగాహన మాత్రమే కాదు empathy కూడా. వేరే జీవితో మనకు, 'తానే నేను' అన్నంతగా సహానుభూతి కలిగినప్పుడే మనం రాయగలం. ఇది ఒక నేపథ్యం కలిగిన వ్యక్తి మరొక నేపథ్యం గురించి రాసేటప్పుడూ ఉండాలి, ఒక వ్యక్తి మరొక వ్యక్తి గురించి రాసేటప్పుడూ ఉండాలి. తమిళంలో వెల్లలార్ అనే కవి అంటాడు "నీళ్ళు లేక ఎండిపోయిన మొక్కను చూస్తే, నా మనసుకి ఎంతో కష్టంగా ఉంటుంది" అని. ఒక మొక్కతో కూడా మనల్ని మనం ఎంపతైజ్ చేసుకోగలిగినప్పుడు, వేరే నేపథ్యం కలిగిన వ్యక్తులతో ఎందుకు చేసుకోలేం?

క్రాఫ్ట్ గురించి మాట్లాడదాం, మీరు ఒక కల్పనని విస్తృతం చేసి, ఒక పెద్ద నవలగా రాయడం కోసం ఎలాంటి పద్ధతిని పాటిస్తారు?

బహుశా ప్రపంచంలో అతిపెద్ద నవల నేనే రాసానేమో. 'వెన్మురసు' (మహాభారతం కథ) ఇరవై నాలుగు వేల పేజీల నవల. వెయ్యి పేజీల నవలలు, ఐదు వందల పేజీల నవలలు కూడా ఓ పది దాకా రాసాను. నా దృష్టిలో కాల్పనిక రచయితకి సాహిత్య పఠనం చాలా ముఖ్యం. క్లాసిక్స్ అనే రచనల్ని 15 నుంచి 20 మధ్య వయసులోనే చదవాలని అంటాను. అప్పుడు అర్థం కాకపోవచ్చు. కానీ మనసులో ముద్రించుకుపోతాయి. నా కూతురు తన పదిహేనవ ఏట టాల్‌స్టాయ్ 'వార్ అండ్ పీస్' చదివింది. పూర్తి అయిన తర్వాత అందులో ఓ ప్రధాన పాత్ర చనిపోయినందుకు ఏడ్చింది కూడా, తన ఏడుపు ఆపడం కోసం ఒక డ్రెస్ కొనివ్వాల్సి వచ్చింది. ఇప్పుడు తను చాలా మంచి రచయిత్రి అయింది. నా కొడుకు కూడా అంతే. విస్తృతమైన పఠనం మన ఊహా శక్తిని పెంచుతుంది. అలాగే మనం రాస్తున్న సబ్జెక్ట్ కోసం చేసే స్టడీ కూడా చాలా ముఖ్యం (ఇక్కడ ఆయన సోషియాలజీ, పొలిటికల్ ఎకానమీకి సంబంధించిన కొంత మంది రచయితల పేర్లు చెప్పారు). అలాగే నేను నా మనసులో ఎప్పుడూ కథల కోసం ధ్యానం చేస్తూ ఉంటాను. చటుక్కున ఒక మెరుపు మెరుస్తుంది. వెంటనే రాసేస్తాను.



రచనలో డెప్త్ అంటే ఏంటి? ఒక థ్రిల్లింగ్ రీడింగ్ అనుభవాన్ని ఇచ్చే పాపులర్ నవలకి, క్లాసిక్ నవలకి ఈ 'డెప్త్' విషయంలోనే తేడా చెప్తుంటారు.

'డెప్త్' అంటే ఒక రచనని అనేక కోణాల నుంచి తరచి చూడగలగడమే అంటాము. గొప్ప రచనలు అన్నింటిలోనూ ఈ లక్షణం ఉంటుంది. నేను ఇప్పటికి ఎన్నోసార్లు టాల్‌స్టాయ్ 'వార్ అండ్ పీస్' చదివాను. చదివిన ప్రతిసారీ అందులో ఒక కొత్త కోణం కనిపిస్తుంది. పాపులర్ రచనల్లో ఆ లక్షణం ఉండదు. చదివినంతసేపు బాగుండొచ్చు గానీ చదివిన తర్వాత మర్చిపోతాం. ఒకసారి రైల్లో వెళ్తున్నప్పుడు మా అమ్మాయి ఒక పాపులర్ నవల చదివి, దిగివెళ్లిపోతున్నపుడు ఆ పుస్తకాన్ని సీట్ లోనే వదిలేసింది. "ఎందుకు?" అని అడిగితే, "షెల్ఫ్‌లో దాచుకునేంత గొప్ప పుస్తకం కాదులే నాన్న," అంది. ఇలా ఎన్నో విషయాలు మాట్లాడుతూ– చివరిలో ఓ రెండు ప్రశ్నలు అడిగాను.

రచనల్లో cliche లని ఎలా అవాయిడ్ చేయ్యాలి? నేను రాస్తున్న కథల్లో ఒకేలాంటి సందర్భాలు వస్తున్నాయి.

వాటిని నేను cliche లు అనను. అది పెద్ద తప్పేం కాదు. నువ్వు చెప్తున్న విషయం, కథ కొత్తదా కాదా అనేదే ముఖ్యం. కానీ కథలో మనం వాడే వ్యక్తీకరణాలు, ఉపమానాలను రిపీట్ చెయ్యకూడదు. వెన్మురసు నవలలో కొన్ని వేల ఉపమానాలను వాడాను, రిపీట్ చెయ్యకుండా.

రచనలో పాఠకులని రంజింప చెయ్యడం కోసం అన్నట్టుగా ఏమైనా చేస్తారా?

No. I write to amuse myself. ("నా ముచ్చట కోసం నేను రాస్తాను" అనే ఈ మాటతో ఆయన మనసు దోచుకున్నారు. నేనూ నమ్ముతాను.)

ఆయనతో మాటల్లో సమయం తెలీకుండానే గడిచిపోయింది. రాత్రి అంతా అలా ఆయన మాట్లాడుతుంటే వింటూనే ఉండాలని అనిపిస్తున్నా, అంత పెద్దాయనను ఇంక ఇబ్బంది పెట్టడం ఇష్టంలేక ఓ పరవశం లాంటి భావనతో బయటికి వచ్చేశాను. వేలు ఖర్చుపెట్టి "రైటింగ్ మాస్టర్‌క్లాస్"లకు అటెండ్ అయ్యేవాళ్ళు నాకు తెలుసు. ఇక్కడ నాకు అలాంటి మాస్టర్ క్లాస్ ఇలా ఊరికినే జరగడం ఆహా ఏమి నా భాగ్యం అనుకుంటూ గదికి వచ్చి నిద్రపోయాను.

ఇంటర్వ్యూ ■ ప్రసాద్ సూరి
✆ 91336 08072

కంచు మెట్టెలు

సద్దలు జొన్నలు
ఆకలి అల్లికల రొట్టెవోసి
దద్దింకాదిన్నని దంచుతున్న
కరైకుడి మణి మృదంగం
వలయపట్టి డోలు
కుందెన కుదుర్ల మీద రోకలి బల
అమ్మ చేతి మట్టి గాజుల గల గల

అలుకుపిడసతోని ఇడుపులలికి
కోడీకలతోనీ నీరు సున్నము ముగ్గు దిద్ద
డావిన్సీ రవివర్మలు ఎమ్మెఫ్ హుస్సేన్‌లు
దిడ్డి గోడల మీద ఈనెల జాజు పట్టెలు
చేయిదిర్గిన రెక్కల చేతాలం
అమ్మ మునివేళ్ళ కాంటెంపరరీ పంచపాళి

అంట్లు తోముతున్న ఆరోహణావరోహణల్లో
జాలారి బండమీద చెవులటికెల నట్టువాంగం
మిద్దె రాములు సుక్క సత్తయ్యలను
పొయిల బూడ్దితోని పూతపూస్తున్న సార్కలు
పొడపోతుల గజ్జెల లాగులు
అమ్మ కంటె తుశ్శె నాగరాలు

పూసలెంకటమ్మ ఈత గుల్లల్ల
చిట్యాల అంగట్ల ఆదాంబి సందుకలు
ఎరుకలి నాంచారి జెప్తున్న ఎరుక
ఇరవై తులాల మెరిసేటి సాలంకడాలు
అమ్మ నీ పాదాలు పసుపొంచుకున్న
పగిడికొండలు

ఇంట్లకు ఆకిట్లకు
మక్బూల్ సాబ్రీ కవ్వాలి
ఎం.ఎస్. సుబ్బలక్ష్మి మీటుతున్న తంబుర
అమ్మ గచ్చు జగిండ్ల మీద నడుస్తున్నప్పుడు
జన్న జన్నంటూ కాళ్ల వేళ్ల కొసల కంచు మెట్టెల
మాదిగ డప్పుల మాయామాళవగౌళం

■ విశ్వనాథుల పుష్పగిరి
✆ 96664 35426

తొలి పుస్తకం వచ్చాక చదవాలన్న కాంక్ష మరింత పెరిగింది!

చదువు ముచ్చట

తుల శ్రీనివాస్

నా 'చింతలతొవ్వ' కవిత్వం సంపుటి వచ్చిన తరువాత నాలో చదవాలన్న కాంక్ష మరింత పెరిగింది. అత్యధికంగా

రీసెంట్‌గా ఏ పుస్తకాన్ని చదివి బాగా ఇష్టపడ్డారు?

శేషేంద్ర 'ఆధునిక మహాభారతం' చదివి ఆయన కవితా నిర్వహణ నైపుణ్యానికి అబ్బురపడ్డాను. నిజానికి అదొక కళాఖండం. చక్కటి భావ చిత్రాలు, ఇమేజరీలు, వాక్యాన్ని కవిత్వం చేసిన తీరు, అలంకారాల ప్రయోగం నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కవిగా నేనేమి చేయాలో, రాయాల్సిన వాక్యం ఎలా ఉండాలో ఆయన కవిత్వం నాకు గుర్తుజేసింది. ఈ సంపుటిలో సంవేదనలు నా రక్తంలోకి చేరాయి. సమాజాన్ని ఇంత డీప్ సీక్ చేసి చూసాడా అనిపించింది!

మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదవడం గుర్తుంది?

పీజీలో నా మిత్రుడొకడు చలం 'మైదానం' బహుమతిగా ఇచ్చాడు. మైదానాన్ని చదవడం వల్ల నా భావనా ప్రపంచం ఎక్స్‌పాండ్ అయింది. నెరెటివ్‌లో అంత థిక్‌గా ఎలా రాశాడా అనిపించేది. సంప్రదాయ జీవినైన నాకు సరికొత్త నేత్రాలనిచ్చింది మైదానమే.

మీ పఠనాభిరుచి కాలంతోపాటు ఎలా మారింది?

పేరు పొందిన పుస్తకాల్లో నిజంగా ఏముందో చదువాలన్న కుతూహలం పెరిగింది. సమాజ గతిని మలుపు తిప్పిన పుస్తకాలను కవి దృష్టితో పరిశీలిస్తున్నాను. లోకల్ లిటరేచర్‌తోపాటు అనువాద నవలలు కవిత్వం కథ ఇలా ఏది అందుబాటులో ఉంటే అది చదువుతాను. ఇపుడు నెరుడా కవిత్వం, దాస్తొయెవ్‌స్కీ 'ఇడియట్' నవల చదువుతున్నాను. రాయడం సుఖాన్ని ఇస్తే చదవడం ఆనందాన్ని ఇస్తుంది. నాకు సుఖపడటం కంటే ఆనంద పడటమే ఇష్టం.

మీ సమకాలీనంగా కవిత్వపరంగా ప్రేరణ కలిగించే తోటికవులు?

ప్రేరణ కలిగించిన వారిలో మునాసు వెంకట్ గారితో మొదలుకుని కె. శివారెడ్డి, గోరటివెంకన్న, ఎన్. గోపి, ప్రసేన్, నలిమెల భాస్కర్, వంశీకృష్ణ, జూకంటి జగన్నాథం, బొమ్మలబాయి సిద్ధార్థ, కవి యాకూబ్ వంటి లబ్ధప్రతిష్టులతో పాటు ఈ తరం కవులు మారాబత్తుల పెద్దన్న, మెట్టా నాగేశ్వరరావుల కవిత్వాన్ని, సాగర్ల సత్తయ్య కథలను ఎక్కువగా చదువుతాను. విభిన్నమైన ఈ రచయితల రచనారీతుల్ని ఆస్వాదిస్తాను.



మీరు ఎక్కువసార్లు చదువుకున్న కవిత్వ సంపుటి?

'మహాప్రస్థానం'. నా అభ్యుదయ భావాన్ని శ్రీశ్రీ మరింత విస్తృతపరిచాడు. శ్రీశ్రీ శబ్దవేగం హృదయానికి వ్యాయామం. పదాల్లోని గతి శక్తి ప్రకంపనలు సృష్టిస్తుంది. ఆ అభ్యుదయావేశం, శబ్ద కవిత్వ ఝరి మహాప్రస్థానాన్ని నన్ను మళ్లీ మళ్లీ చదివించింది.

కవిత్వ రచనలో మీకు ఉపయోగపడిన సలహా?

ఏ సలహా లేకుండానే తొలిసంపుటి 'చింతలతొవ్వ' అచ్చేసి, సద్విమర్శకులు ప్రశంసలు అందుకున్నాను. అయితే రెండో సంపుటికి వచ్చిన చాలా సలహాల నడుమ నాకు ఉపయోగపడిందని అనుకున్న సలహా– పొయెటిక్ టెక్నిక్ గురించి. దాన్ని అనుసరించి కేవలం నెరేటివ్ మీదనే డిపెండ్ అవ్వకుండా శిల్ప చతురతతో కవితలు అల్లిన విధానం నా రెండో సంపుటిలో చూడొచ్చు.

(తుల శ్రీనివాస్ తొలి కవిత్వ సంపుటి 'చింతల తొవ్వ' 2023లో పబ్లిష్ అయ్యింది.)

✆ 99485 25853

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
సోమవారం 18 ఆగస్టు 2025




22 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు


మిరప తోటకు మందులను పిచికారి చేస్తున్నరైతు

కూరగాయలు.. వర్షార్పణం

- బెండ, దొండ, బీర తోటలకు తెగుళ్లు
- సాగుదారులకు శాపంలా మారిన వాన
- వీడని వర్షాలతో కాపాడుకోలేక రైతుల ఆందోళన

కొల్లిపర, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా మెట్ట భూముల్లో వేసిన పంటలు వెలవెలపోతున్నాయి. వీడని వర్షాలతో వంగ, మిర్చి, బెండ, దొండ, దోస, బీర తోటలకు తెగు ళ్లు వ్యాపించాయి. దీంతో రైతులు వాటిని రక్షించుకోవడానికి మందులను పిచికారి చేస్తున్నారు. అయితే వీడని వర్షాలతో కూరగాయల తోటలను రక్షించుకోలేక, తాము చేస్తోన్న ప్రయత్నాలు విఫలమవుతుండటంతో రైతులు ఆందోళన చెందు తున్నారు. కూరగాయల ధరలు మండిపోతుండటంతో కొల్లిపర మండలంలో దావులూరుపాలెం, హనుమాన్‌పాలెం, అన్నవరం, అన్నవరం గౌడపాలెం, తూములూరు, మున్నంగి, వల్లభాపురం, పిడపర్రు, కొల్లిపర తదితర గ్రామాల్లోని రైతులు తక్కువ కాలం లో చేతికి వచ్చే వివిధ రకాల కూరగాయలను సాగుచేశారు. పైర్లు బాగా కాపు, పిందె, పూత దశలో ఉన్న సమయంలో వర్షా లు కారణంగా పూత రాలిపోయింది. తెగుళ్లు సోకి పురుగు ఆశించింది. పైర్లలో నీరు నిలిచిపోవడంతో కాయలు కుళ్లిపోయాయి. దోస, సొర, బీర పైర్లు వేసిన కాయలు వర్షపు నీటిలో, బురదలో ఉండటంతో చేతికి వచ్చే పంట దెబ్బతింది. లక్షలాది రూపాయల ఆదాయాన్ని కోల్పోయామంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షపు నీటితో బెండ, వంగ తోటలుకు తెగుళ్లు ఆశించి పూత రాలిపోయినట్లు రైతులు వాపోయారు. ఉద్యాన పంటలైన పసుపు, కంద, అరటి పంటలలో తేమ ఎక్కువగా ఉండటంతో ఆకుపచ్చగా ఉండాల్సిన ఆకులు తెల్లగా మారుతున్నాయి. కొంత మంది ఉద్యాన శాఖాధికారుల సూచనలు, సలహాల మేరకు ఎరువులను చల్లుతున్నారు. వాణిజ్య పంటలకు తెగుళ్లు వ్యాపించడంతో అదనంగా ఖర్చులు పెరిగిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.


కొల్లిపర : కంద పంటకు మందులను పిచికారి చేస్తున్న డ్రోన్

మట్టి పరీక్షలు మమ





రైతులకు ఎంతో ఉపయోగపడే.. భూసారం తెలియజేసే.. పంటల సాగుకు సద్వినియోగమయ్యే.. దిగుబడులు పెంచే మట్టి పరీక్షలపై వ్యవసాయశాఖ నిర్లక్ష్యం చేస్తోంది. ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే రైతుల పొలాల్లోని మట్టి సేకరించి పరీక్షలు చేసి భూసారాన్ని నిర్ధారించి రైతులకు భూ ఆరోగ్య కార్డులు ఇవ్వాలి. తదనుగుణంగా రైతులు పోషకాల వినియోగంతో పాటు ఏ పంటలు సాగు చేయాలో నిర్ధారించు కుంటారు. అయితే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో వ్యవసాయశాఖ మట్టి పరీక్షల విషయంలో స్పందించడం లేదు. సిబ్బంది.. పరీక్షలకు అవసరమైన పరికరాల కొరత పేరుతో మట్టి సేకరణ.. పరీక్షల నిర్వహణ.. ఆరోగ్య కార్డుల పంపిణీ తూతూమంత్రంగా చేస్తోంది. పంటల సాగుకు ముందే అందించాల్సిన భూసార కార్డులు ముద్రణ స్థాయిలోనే ఉన్నాయంటే రైతులకు సంబంధించిన విషయాల్లో అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. పంట సాగు పూర్తయ్యే లోపైనా రైతులకు ఆరోగ్య కార్డులు అందించే పరిస్థితులు కనిపించడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- భూసార పరీక్షలపై నిర్లక్ష్యం
- పరీక్షల లక్ష్యం 60,100.. పూర్తి 31,598
- భూ ఆరోగ్య కార్డుల పంపిణీ అరకొరగానే

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నేలలో సూక్ష్మపోషకాలు ఏ మోతాదులో ఉన్నాయో గుర్తించి.. ఏ పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చో రైతులకు వ్యవసాయశాఖ తెలియజేయాలి. ఇందుకు భూసార పరీక్షలు కీలకం. అయితే ఖరీఫ్ సాగు ప్రారంభమై వారాలు గడుస్తున్నా నేటికీ భూసార పరీక్షలు పూర్తి కాలేదంటే వీటిపై వ్యవసాయ శాఖకు ఉన్న చిత్తశుద్ధి తెలి యజేస్తోంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో మట్టి పరీక్షల లక్ష్యం 60,100 కాగా ఇప్పటికి 31,598 మట్టి నమూనాల పరీక్షలు మాత్రమే పూర్తయ్యాయి. వీటికి సంబంధించిన భూసార పత్రాలను అందించడంలో కూడా అంతులేని నిర్లక్ష్యం కొనసాగుతోంది. సాగు ప్రారంభం కాక మునుపే రైతులకు పుడమి ఆరోగ్య కార్డులు పంపిణీ చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. అయితే ఆచరణలో అది అమలుకు నోచుకోలేదు. సాధారణ విస్తీర్ణంలో ఇప్పటికే 50 శాతం పంటల (మిగతా 6వ పేజీలో)

ముద్రణలోనే కార్డులు

పల్నాడు జిల్లాలో 23,437 మట్టి నమూనాల సేకరణ లక్ష్యం కాగా 23,043 సేకరించారు. వీటిలో 14,077 నమూనాలను పరీక్షించారు. గుంటూరు జిల్లాలో లక్ష్యం మేర 13,862 మట్టి నమూనాలను సేకరించినా 7,455 పరీక్షలు మాత్రమే పూర్తయ్యాయి. బాపట్ల జిల్లాలో 22,801 నమూనాలను సేకరించగా 10,066 పరీక్షలు పూర్తయ్యాయి. ఆయా కార్డుల పంపిణీ ముద్రణ స్థాయిలోనే ఉంది.


సేకరించిన మట్టి నమూనాలు

సాగర్ వద్ద సందడి

- 22 క్రస్ట్‌గేట్ల ద్వారా జాలువారుతోన్న కృష్ణమ్మ
- సోయగాలు తిలకించేందుకు తరలివచ్చిన పర్యాటకులు

విజయపురిసౌత్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పరవళ్లు తొక్కుతూ కృష్ణమ్మ ప్రవహిస్తోంది. నాగార్జున సాగర్ జలాశయం నుంచి 22 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నుంచి జాలువారుతున్న కృష్ణమ్మ సోయగాలను తలకించేందుకు సెలవు దినమైన ఆదివారం పెద్దసంఖ్యలో పర్యాటకులు పోటెత్తారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి వేలాది మంది పర్యాటకులు సాగర్‌ను తిలకించేందుకు తరలివచ్చారు. దీంతో సాగర్ నూతన వంతెన, పాత



వంతెన, ప్రధాన డ్యాం వద్ద సందడి నెలకొంది. చిన్నారులు, యువత కేరింతలు కొడుతూ ప్రాజెక్ట్ వద్ద సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. కుటుంబసభ్యులతో కలిసి ఆనందంగా గడిపారు. రాత్రి వేళ విద్యుత్ లైట్ల వెలుగులో ప్రాజెక్ట్ అందాలు పర్యాటకులను కట్టిపడేశాయి. పర్యాటకులు రాకతో ఎత్తిపోతల నుంచి సాగర్ ప్రాజెక్ట్ రహదారి వాహనాలతో రద్దీగా మారింది. పర్యాటకులు నాగార్జున కొండను సందర్శించారు. పర్యాటకులు నాగసిరి, శాంతిసిరి, అగస్త్య లాంచీలలో నాగార్జున కొండకు వెళ్లారు. 60 అడుగుల ఎత్తు నుంచి జాలువారే ఎత్తిపోతల అందాలను కూడా వీక్షించారు.

ఇన్‌ఫ్లో 1,45,076 క్యూసెక్కులు

సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి వరద కొనసాగుతూనే ఉంది. ఆదివారం శ్రీశైలం నుంచి 1,45,076 క్యూసెక్కుల వరద నీరు వస్తుంది. దీంతో ప్రాజెక్ట్ అధికారులు 22 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. జలాశయం నీటిమట్టం 586.70 అడుగులు ఉంది. కుడి కాల్వ ద్వారా 6006, ఎడమ కాల్వ ద్వారా 3667, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 28,867, 22 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,70,588, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లోగా 2,11,820 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.


పెనుమూడి దిగువున కరకట్టకు ఆనుకునే తవ్విన రొయ్యల చెరువులు

ఎవరికీ పట్టని.. కరకట్ట

- వరదల సమయంలో హడావుడితో సరి
- దారుణంగా ఉన్నా ఊసేలేని మరమ్మతులు
- ఆక్రమణలతో కాలిబాటను తలపిస్తున్న కరకట్ట
- మళ్లీ వరద ముప్పుతో కట్ట పటిష్ఠతపై భయాందోళనలు

తెనాలి, రేపల్లె, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదీ తీరంలోని గ్రామాలకు రక్షణ కవచంలాంటి కుడి కరకట్ట ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు.. ఎక్కడ గండిపడుతుందో ఏ గ్రామాలను ముంచేస్తుందోనని ఆందోళనలో ప్రజలు ఉన్నారు. పది అడుగుల వెడల్పు ఉండాల్సిన కట్ట కొన్ని ప్రాంతాల్లో కాలిబాటను తలపించేలా చిక్కిపోయింది. సంవత్సరం క్రితం వచ్చిన వరద సమయంలో రాత్రి, పగలు విరామం లేకుండా మంత్రులు సైతం కరకట్టపై కాపలాకాశారంటే పరిస్థితి అర్థమవుతుంది. ప్రస్తుతం నదిలో నీటి ఉధృతి తక్కువగా ఉన్నా, వరుస వాయుగుండాలు, ముంచెత్తుతున్న వర్షాలతో భయం మాత్రం వెంటాడుతూనే ఉంది. వరదలు వచ్చినప్పుడు నాలుగు మూటలు అడ్డువేయడంతో సరిపెడుతున్నారే కానీ పటిష్ఠతకు శాశ్వత పనులపై ప్రభుత్వం దృష్టి సారించడంలేదు. కరకట్టను ఆనుకునే రొయ్యల చెరువులు తవ్వడం, కట్టల మట్టి తవ్వుకుని అమ్మేసుకుంటున్నా మామూళ్లు వసూలు చేసుకోవడానికి ఆర్సీ అధికారులు పరిమితమవుతున్నారు. దీంతో గుంటూరు జిల్లాలోని ప్రకాశం బ్యారేజి నుంచి బాపట్ల జిల్లా లంకెవానిదిబ్బ మధ్య 102 కిలోమీటర్ల పొడవున్న కరకట్ట పరిస్థితి దయనీయంగా మారింది. కరకట్ట 61 కి.మీటర్ల పొడవులో గుంటూరు, బాపట్ల జిల్లాల కింద 8 కి.మీటర్ల పొడవున దెబ్బతిన్నది. పెనుమూడి నుంచి లంకెవాని దిబ్బ వరకు 38 కి.మీటర్ల పొడవున కేవలం మట్టి పనితో కరకట్ట వదిలేశారు. పెనుమూడి నుంచి లంకెవానిదిబ్బ వరకు కరకట్టకు నదివైపునున్న భూముల్లో రొయ్యల చెరువులు (మిగతా 6వ పేజీలో)


పెదపులివర్రు-పెనుమూడి మధ్య కరకట్ట పరిస్థితి


మున్నంగి-వల్లభాపురం మధ్య కరకట్ట నదివైపున సగానికి కుంగిపోయిన చిత్రం

అమ్మో.. అంగన్వాడీ ఉద్యోగమా?

- యాప్‌లు, రికార్డుల నిర్వహణతో బెంబేలు
- లక్ష్యాలకు దూరంగా అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ
- రికార్డుల నిర్వహణ రద్దు జీవో వచ్చినా తప్పని భారం
- పనిచేయని ఫోన్లతో సతమతం..
- అధికారులకు సరెండర్

యాప్‌ల మోత.. రికార్డుల భారం.. పనిచేయని మొబైల్స్‌తో విధుల నిర్వహణపై అంగ న్వాడీలు బెంబే లెత్తిపోతున్నారు. అమ్మో అంగన్వాడీ ఉద్యోగమా అంటూ పలువురు విముఖత చూపుతున్నారు. తాజాగా నెలకొన్న పరిస్థితుల్లో ఉద్యోగమంటేనే భయపడే పరిస్థితి అంగన్వాడీల్లో నెలకొంది. తాము పనిచేయ లేమంటూ ఉద్యోగులు రోడ్డెక్కుతున్నారు. జిల్లాలో కొన్ని చోట్ల మొబైల్ ఫోన్లను అధికారులకు పలువురు సరండర్ చేశారు.


గుంటూరులో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు (పాత చిత్రం)

గుంటూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్త్రీ, శిశు సంక్షేమంలో అంగన్వాడీల పాత్ర అత్యంత కీలకమైనది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 5,295 కేంద్రాల ద్వారా 3 లక్షలమంది గర్భిణులు, బాలింతలు, లక్షన్నర మంది చిన్నారులకు పోషణ అందించడంతోపాటు, వారి సంక్షేమం విష యంలో అంగన్వాడీలది కీలకపాత్ర. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు బలవర్థక ఆహారాన్ని అందించడంతో పాటు, చిన్నారులకు ప్రీ స్కూలు విద్యను కూడా వీరు అందించాలి. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాల (మిగతా 6వ పేజీలో)




●చినకోండ్రుపాడు - ప్రత్తిపాడు ప్రధాన రహదారి

చినకోండ్రుపాడు రోడ్డంతా గోతులే

- రెండు దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోని వైనం
- గతంలో గ్రామస్థుల నుంచి మంత్రులకు నిరసన సెగ

ప్రత్తిపాడు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నుంచి చినకోండ్రుపాడు మీదగా జాతీయ రహదారిని కలిపే ప్రధాన రహదారి. సుమారు పది కిలోమీటర్లు ఉన్న ఈ రోడ్డు మొత్తం రాళ్లు లేచి పెద్దపెద్ద గోతులతో నిండిపోయింది. ఈ మార్గంలో ప్రయాణం అంటే వాహన చోదకులు దడుచుకుంటారంటే రోడ్డు ఎంత అధ్వానంగా ఉందో తెలుసుకోవచ్చు. ఈ రహదారిలో అధ్వానంగా మారిన రామవాగువంతెనపై వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో చినకోండ్రుపాడు గ్రామస్థులతో పాటు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పెద్దపెద్ద గోతులను మట్టితో కప్పగా వర్షాలతో మట్టి కొట్టుకుపోయి ప్రయాణం మరింత నరకప్రాయంగా మారింది. రోడ్డు నిర్మాణానికి గ్రామానికి వచ్చిన ప్రతీ నాయకుడు, అధికారిని వేడుకుంటున్నా ఎవరూ స్పందించడంలేదు.

మంత్రులకూ నిరసన సెగ

ఈ రోడ్డు నిర్మాణం విషయంలో ప్రత్తిపాడు నుంచి మంత్రులుగా చేసిన రావెల కిశోర్‌బాబు, మేకతోటి సుచరితలకు గ్రామస్థుల నుంచి నిరసన సెగ తగిలింది. గ్రామ పర్యటనల సమయాల్లో నేతలను గ్రామస్థులు నిలదీసేవారు. గత టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న రావెల కిశోర్‌బాబు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం టెండర్ల రద్దుతో రోడ్డు నిర్మాణం ఆగిపోయింది. ఆ తర్వాత మంత్రిగా చేసిన మేకతోటి సుచరిత పట్టించుకోలేదు. గత ఎన్నికల సమయంలో ఈ రోడ్డులోని గుంతలను చూపుతూ వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను టీడీపీ నాయకులు ఎండగట్టారు. అయితే 14 నెలలైనా రోడ్డు దుస్థితి మారలేదని గ్రామస్థులు వాపోతున్నారు.


ప్రమాదకరంగా రామవాగుపై బ్రిడ్జి

నిజాంపట్నం హార్బర్‌లో మూడో నెంబర్ హెచ్చరిక

- వాతావరణశాఖ హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన

గుంటూరు, నిజాంపట్నం(రేపల్లె), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం 24 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో సముద్రంలో ఈదురుగాలులతో కూడిన భారీవర్షాలు పడనున్నట్లు పేర్కొంది. వాయుగుండంతో ఈదురుగాలుతో కూడిన భారీవర్షం అలల ఉధృతి పెరుగుతాయని పోర్టు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆదివారం నిజాంపట్నం హార్బర్‌లో మూడో నెంబర్ ప్రమాద హెచ్చరిక ఎగురవేసినట్లు పోర్టు అధికారులు తెలిపారు. సముద్రంలో వేట చేసేందుకు మత్స్యకారులు ఎవరూ వెళ్ళరాదని సూచించారు. వేట చేసుకునే మత్స్యకారులకు వాకీటాకీల ద్వారా తక్షణమే ఒడ్డుకు చేరుకోవాలని సూచించారు. పొలాల్లో నిలిచిన నీటిని కొందరు కాల్వల తవ్వుకుని తరలించగా.. మరి కొందరు ఇంజన్లతో పైర్లను కాపాడుకున్నారు. దీంతో ఆదివారానికి కొంత మేర పైర్లు బయటపడ్డాయి. ఇంతలోనే మరో వాన గండం రైతులను వణికిస్తోంది. అల్పపీడన ప్రభావంతో సోమ, మంగళవారాల్లో జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చేసిన హెచ్చరికలు రైతులతో పాటు గుంటూరు, ఇతర పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


● హార్బర్‌లో 3వ నెంబర్ ప్రమాద హెచ్చరిక

ప్రకాశం బ్యారేజీకి పెరిగిన వరద ఉధృతి


బ్యారేజీ దిగువకు వరద నీరు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నది వరద ఉధృతి పెరిగింది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు, ప్రధాన వాగుల నుంచి 2,85,392 క్యూసెక్కుల వరదనీరు ఇన్‌ఫ్లోగా నమోదు అయిందని ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజీ రిజర్వాయర్‌లో 11.3 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా దిగువకు 2,82,358 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. తూర్పు డెల్టా కాల్వకు 2,518, పశ్చిమ డెల్టాకు 516 క్యూసెక్కులు వదులుతుండగా.. గుంటూరు చానల్‌కు నీటి విడుదల నిలిపివేసినట్టు జేఈ తెలిపారు.

జిల్లా వాలీబాల్ జట్ల ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా వాలీబాల్ జట్టు

గుంటూరు (క్రీడలు) ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని పడమట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగనున్న అండర్ 15 బాల బాలికల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు.. జిల్లా జట్లను స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎంఎవి ఆదివారం ప్రకటించారు. వేజెండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో.. ఎంపికలు నిర్వహించారు.

బాలుర జట్టు: ఎ.అరుణ్ కుమార్, డి.బ్రహ్మం (పెదకూరపాడు), వి.బాలాజీ నాయక్, ఏ.బాలు మహేంద్ర (గుంటూరు), కె.భువన సాయి (పెదకూరపాడు), ఎం.అజయ్ (తాడేపల్లి) స్టాండ్ బై లుగా పి.సోహైల్, పి.ఉల్హాస్.

బాలికల జట్టు: ఎస్.సువర్ణ (వీటి సిద్దార్థ), ఎస్.నేహ (పెదకూరపాడు), జి.నాగూర్ బీ, వై.సంధని, ఎ.నాగమల్లేశ్వరి (వేజెండ్ల), సిహెచ్ నవీన (మంగళగిరి) స్టాండ్ బైలుగా ఏ.దుర్గా లక్ష్మీ, వి.లక్ష్మీ రేణు (పెదకూరపాడు).

అంబటి ఆరోపణలు హాస్యాస్పదం: ధూళిపాళ్ల

పొన్నూరుటౌన్, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు అంబటి ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఎద్దేవా చేశారు. మండల పరిధిలోని చింతలపూడిలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పొన్నూరు పొలాలు ఎప్పుడైనా అంబటి చూశారా.. కనీసం దారులైనా తెలుసా అని ప్రశ్నించారు. కొమ్మమూరు బ్రిడ్జి నిర్మాణం కాంట్రాక్టర్ అంశంపై గత ప్రభుత్వ హయాంలో జరిగిందని, దానిని కూటమి ప్రభుత్వానికి ఆపాదిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వం మూడు విడతలు నోటీసులు ఇచ్చిందని.. ఈ అంశం మీద బహిరంగ చర్చకు తాము సిద్ధమేనని.. అంబటి సిద్ధమా అని సవాల్ విసిరారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన శాఖను పారదర్శకంగా నిర్వహిస్తున్నారన్నారు. పంట పొలాల మునక ఫొటోలు గ్రాఫిక్స్‌లో చూపారని, అమరావతి ముంపునకు గురికాకుండా ఆ నీటినే పొన్నూరుకు పంపారని రాజకీయ నిరుద్యోగులు మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. అమరావతి చుట్టూ ఉన్న ప్రాంతాల ప్రజలను రెచ్చగొట్టే కుట్రతో అంబటి వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు.

పుస్తకాల నిషేధం.. నిరంకుశ చర్య

● కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ


ప్రసంగిస్తున్న పెనుగొండ లక్ష్మీనారాయణ, పాల్గొన్న కేఎస్ లక్ష్మణరావు తదితరులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లో పలు పుస్తకాలను నిషేధిస్తూ.. ఆ రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్ జారీ చేసిన ఉత్తర్వులు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఎమ్.బావన్నారాయణ అధ్యక్షతన ఆదివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్, రాజ్యాంగ నిపుణులు ఏజీ నూరానీ, విద్యావేత్త సుమంత్రా బోస్ వంటి పలువురు ప్రముఖులు రాసిన 25 పుస్తకాలను నిషేధించారని వివరించారు. కశ్మీర్ ప్రజల స్థితిగతులతో పాటు వారి మనోభావాలపై ఎన్నో పరిశోధనలు, పరిశీలనలు చేసి అక్కడి వాస్తవ పరిస్థితులను పుస్తకాల రూపంలో తెచ్చారని తెలిపారు. ఆయా పుస్తకాల ప్రచురణ, కొనుగోళ్లపై గవర్నర్ వేటు వేయడం ప్రజల స్వేచ్ఛాయుత హక్కులను హరించడమేనని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రసంగిస్తూ జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించకుండా.. ఇటువంటి చర్యలు చేపట్టడం దారుణమన్నారు. పహల్గాంలో ఉగ్రవాద దాడుల పరిణామాల నేపథ్యంలో ప్రజల్లో విశ్వాసం కల్పించేందుకు తగిన చర్యలు అవసరమన్నారు. ఈ సమావేశంలో హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి కె.ఇ.శంకర్, ప్రొఫెసర్ ఎస్. వేణుగోపాలరావు, వీవీకే సురేష్, నిర్బంధ వ్యతిరేక పోరం నాయకుడు కె.రవిచంద్ర, కాపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నల్లమడ ఆధునికీకరణ చేపట్టాలి : కొల్లా రాజమోహనరావు


మాట్లాడుతున్న కొల్లా రాజమోహనరావు

పెదనందిపాడు,ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): తాగు, సాగునీటి సమస్యల పరిష్కారం కోసం నల్లమడ డ్రైను ఆధునికీకరణ చేపట్టాలని రైతు సంఘ నేత కొల్లా రాజమోహనరావు పేర్కొన్నారు. స్థానిక కొల్లా వెంకయ్య గ్రంథాలయంలో ఆదివారం నల్లమడ రైతు సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా జలాలు రాకపోవడం వల్ల నల్లమడ వాగులో పైనుంచి వచ్చే వర్షాల వల్ల ఈ ప్రాంత భూములు చౌడుబారి వ్యవసాయానికి పనికి రాకుండా పోతున్నాయన్నారు. 2019లోనే నల్లమడకు పరిపాలన అనుమతులు ఇచ్చినప్పటికీ భూ సేకరణ పూర్తికాలేదన్నారు. కానీ, ప్రజాప్రతినిధులు నిధులు కేటాయించామని ప్రకటనలు చేస్తున్నారని తెలిపారు. నల్లమడ వాగు ఆధునికీకరణ చేపట్టకపోవడం వల్ల ఈ ప్రాంతంలో వరదలు వచ్చి ఏటా వేలాది ఎకరాల పంటలు నీట మునిగి రైతులు నష్టాల బారిన పడుతున్నారన్నారు. 2017లో రూ.360 కోట్లు ఆధునికీకరణకు పరిపాలన అనుమతులు లభించాయని దాని ప్రకారం ఆధునికీకరణ చేపట్టాలని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సమస్య పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే అకారణంగా మహిళా రైతులు, రైతులపై కేసులు బనాయించారని వాటిని వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. యార్లగడ్డ అంకమ్మచౌదరి, గోవాడ సత్యనారాయణ, ఈదర బ్రహ్మరాజు, మన్నవ హరిప్రసాద్, జాష్టి వీరయ్యచౌదరి, కొల్లా నిర్మల, రామన్, మువ్వా పెద్దన్న, వెలినేని సత్యనారాయణ, హనుమంతరావు, వెంకయ్యచౌదరి పాల్గొన్నారు.

రామాంజనేయపురంలో పాఠశాల ఏర్పాటు చేయిస్తా

ఎఫెక్ట్

బెల్లంకొండ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం లోని రామాంజనేయపురంలో ప్రభుత్వ పాఠశాలను సత్వరమే ఏర్పాటు చేయిస్తానని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ వెల్లడించారు. 'చదువు వారికి సాహసమే' అనే శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం అయిన కథనానికి ఆయన స్పందించారు. రామాంజనేయపురంలో ఎంత మంది విద్యార్థులు ఉంటారు.. వాళ్లు రోజూ పాఠశాలకు వెళ్లేందుకు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారు.. అన్న వివరాలను ఎమ్మెల్యే సేకరించిన అనంతరం ప్రకటన చేశారు.

మట్టి పరీక్షలు మమ

(5వ పేజీ తరువాయి)

సాగును రైతులు చేపట్టారు. వచ్చే నెలాఖరుకు ఖరీఫ్ సీజన్ కూడా ముగియనున్నది. రబీకైనా సదరు పత్రాలు అందుతాయన్న నమ్మకం రైతులకు కలగడంలేదు.

పరీక్షలతోనే పోషకాల నిర్ధారణ..

పుడమిలో ప్రధాన పోషకాలైన ఉదజని సూచికతో పాటు మట్టి పరీక్షల ద్వారా ఆమ్ల, క్షార లవణాల స్థాయి(పీహెచ్)తో పాటు పాస్పరస్, పోటాషియం, ఆర్గానిక్ కార్బన్, సల్ఫర్, జింక్, ఐరన్, కాపర్, బోరాన్, మెగ్నీషియం నేలలో ఏ మోదుతులో ఉన్నాయో పరీక్షల ద్వారా గుర్తిస్తారు. భూమిలో సరైన పోషకాలు ఉన్నాయా.. లోపాలు ఉన్నాయా అనేది పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. ఈ పరీక్షల ఆధారంగా ఎంత మోతాదులో ఎరువులు వాడాలో రైతులకు అధికారులు సూచి స్తారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన భూసార పరీక్షలను అధికారులు అటకెక్కిం చారు. సూక్ష్మ పోషకాల లోపంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది. జింక్, బోరా న్, మెగ్నీషియం, గంధకం, ఇనుము, మాంగనీస్, రాగి, భాస్వరం, నత్రజని, పొ టాషియం వంటి సూక్ష్మ పోషకాలు పంటలకు అవసరంగా ఉంది. ఖరీఫ్‌లో సూ క్ష్మపోషకాల పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సూక్ష్మ పోషకాలను రాయితీపై అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మట్టి నమూనాల పరీక్షలు ఇలానే సాగితే రైతులు ప్రభుత్వం అందజేయనున్న సూక్ష్మపోషకాలను రైతులు కోల్పోయే ప్రమాదం ఉంది.

వరి, పత్తి సాగులో శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలి

లాంఫాం(తాడికొండ)ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న వేళ వరి, పత్తి పంటలు వేసే రైతులు శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవా లని ఏరువాక కేంద్రం, సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం. వెంకటరా ములు, కోఆర్డినేటర్ ఎన్. వెంకట లక్ష్మి సూచించారు. ప్రస్తుతం కురుస్తు న్న వర్షాలు కారణంగా వరి నారుమడి నీట మునిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పత్తి పంటను ఇంకా విత్తని రైతులకు పలు సూచనలు తెలియజేశారు. నారుమ డిలో లేదా ఆరుతడి వరి సాగు పొలాల్లో విత్తనం చల్లిన రెండు నుంచి మూడు రోజుల వయసులో మూడు రోజుల కన్నా ఎక్కువ నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. నారు విత్తిన 7 నుంచి 30 రోజుల మధ్యలో నారు ఐదు రోజు ల కన్నా ఎక్కువగా నీటిలో మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉంద న్నారు. మునిగిన నారుమడి లో నుంచి ఐదు రోజుల లోపు నీరు పూర్తిగా బయటకు తీసివేసిన తర్వాత 5 సెంట్ల నారు మడికి ఒక కిలో యూరి యా, ఒక కిలో పొటాష్ వేసుకోవాలి, ఒక గ్రాము కార్బెండిజం లేదా 2 గ్రాముల కార్బెండిజం మాంకో జెబ్ లను లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని తెలియజేశారు. వరి పంట పిలకల దశలో మునిగితే నీరు బయటకు పోయిన తర్వాత ఎకరానికి 20 కి లోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను అదనంగా వేసుకో వాలని సూచించారు. పత్తి పంటను ఒక ప్రాంతంలోని రైతులందరూ ఒకేసారి విత్తుకు న్నట్లయితే గులాబీ రంగు పురుగు సమస్యను తగ్గించవచ్చన్నారు.

అమ్మో.. అంగన్వాడీ ఉద్యోగమా?

(5వ పేజీ తరువాయి)

కారణంగా వారికి పనిభారం పెరిగి మొత్తంగా వ్యవస్థ దెబ్బతింటోంది. యాప్‌లు, రికార్డుల నిర్వహణ భారం కారణంగా ఉద్యోగులు అంగన్వాడీ కేంద్రాల నిర్వహణపై దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారు. అంగన్వాడీల నిర్వహణ లక్ష్యాలకు దూరంగా జరిగిపో తోంది.

పనిచేయని ఫోన్లు.. తలనొప్పిగా యాప్‌లు

అంగన్వాడీ కార్యకర్తలు విధిగా నాలుగు ఆన్‌లైన్ యాప్‌లను నిర్వహించాలి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన పోషణ ట్రాకర్లో ప్రతి రోజూ చిన్నారులు, గర్భిణులు, బాలింతల పోషణ వివరాలు నమోదు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన బాల సంజీవని యాప్‌లో రాష్ట్ర ప్రభుత్వం అందించే పోషణ వివరాలు నమోదు చేయాలి. వీటితోపాటు నెలకు రెండు సార్లు అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఫేషియల్ రికగ్నిషన్ హాజరు నమోదు చేయాలి. నెలకు ఒక సారి మిల్క్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలి. అయితే సరుకులన్నీ ఒకేసారి రాకపోవడంతో వాటిని వేరు వేరు సమయాల్లో యాప్‌లో నమోదు చేయాల్సి వస్తోంది. టేక్ హోమ్ కిట్లలో ఇచ్చే సరుకులు మొత్తం ఒకేసారి రాకపోవడంతో గర్భిణులు, బాలింతలు పలు మార్లు అంగన్వాడీల చుట్టూ తిరగాల్సి వస్తోంది. దీనికి తోడు ఎప్పుడో పాతకాలం నుంచి వాడుతున్న మొబైల్స్ పనిచేయకపోవడం, యాప్‌లకు సపోర్టు చేయకపోవడం వంటి కారణంగా యాప్‌ల నిర్వహణ పెద్ద తలనొప్పిగా మారింది. ఆ కారణంగా లబ్ధిదారులు ఒకటికి పదిసార్లు అంగన్వాడీల చుట్టూ తిరగాల్సి వస్తోంది. కొందరైతే వదిలేసుకుంటున్నారు. అలా వారి వివరాలు నమోదు కాకపోతే మరుసటి నెల నుంచి సరుకుల సరఫరా ఆగిపోతోంది. ఆ కారణంగా మరుసటి నెల సరుకుల కొరత వచ్చి లబ్ధిదారుల ఆగ్రహానికి అంగన్వాడీలు గురవుతున్నారు. చివరకు లబ్ధిదారుల ఆగ్రహావేశాలతో ఉద్యోగులు ఒత్తిడికి గురవుతున్నారు.

ఆరు రకాల రికార్డుల మోత

అంగన్వాడీ ఉద్యోగులపై రికార్డుల మోత అంతా ఇంతా కాదు. కూటమి ప్రభుత్వం వచ్చాక వారి విన్నపాన్ని మన్నించి రికార్డుల భారాన్ని తొలగిస్తూ జీవో జారీ చేసింది. ఆ జీవో ప్రకారం ఎవరూ ఫిజికల్ రికార్డులు నిర్వహించాల్సిన పనిలేదు. కానీ ఆరు రికార్డులు నిర్వహించాలని అధికారులు హుకూం జారీ చేశారు. ఫుడ్ కంజంప్షన్ రికార్డు(ఎఫ్‌సీఆర్), పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు ఇచ్చే అనుబంధ పోషణ రికార్డు (ఎస్ఎన్‌పీ), ప్రతి రోజూ గర్భిణి, బాలింతల రికార్డుతో పాటు ప్రతి నెలా మంత్లీ ప్రాజెక్టు రిపోర్టు(ఎంపీఆర్), అంగన్వాడీ పరిధిలోని హౌస్‌హోల్డ్ సర్వే, గ్రోత్ రికార్డుతో పాటు చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు సంబంధించిన రెండు టేక్ హోమ్ రేషన్(టీహెచ్ఆర్)ల సంతకాల రిజిస్టర్, స్టాఫ్ అటెండెన్స్ రిజిస్టర్ సహా మొత్తం ఆరు రకాల రికార్డులను ఉద్యోగులు నిర్వహించాల్సి వస్తోంది. ఫలితంగా విధుల్లో నాణ్యత తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో యాప్‌లు నిర్వహించలేమని మొబైల్స్ సెరండర్ చేసి ఉద్యోగులు నిరసన తెలిపారు. అధికారుల సర్దుబాటుతో ఆ విషయం అంతటితో ఆగింది. తక్షణమే యాప్‌ల నిర్వహణకు తగిన ఫోన్లు ఇచ్చి, రికార్డుల నిర్వహణను నిలిపివేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. పనిభారం తగ్గించి, న్యాయమైన వేతనాలు ఇవ్వాలని కోరుతున్నారు.

ఎవరికీ పట్టని.. కరకట్ట

(5వ పేజీ తరువాయి)

తవ్వేశారు. పెనుమూడి దగ్గర ఆర్‌సీ కార్యాలయాల దగ్గర్లోనే నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపినా వాటిని అడ్డుకునే వారే లేరు. రాజుకాల్వ-లంకెవానిదిబ్బ మధ్య రెండు నుంచి నాలుగడుగుల వెడల్పు కూడా లేదు. దీంతో ఇప్పుడు వరద వస్తే ఒక్కచోట కాకుండా ఎన్నిచోట్ల గండ్లు పడతాయోనన్న భయం తీరవాసులకు వెన్నులో వణుకు పుట్టిస్తోంది. గత ఏడాది కృష్ణా నదికి దశాబ్దాల కాలంలో రానంతటి వరద రికార్డు స్థాయిని నమోదు చేసుకుంది. ఆ సమయంలో తాడేపల్లి మండలంలోని విజయవాడ క్లబ్ దగ్గర, ప్రాతూరు-వల్లభాపురం మధ్య కరకట్ట రోడ్డు దారుణంగా మారింది. వల్లభాపురం వార్ఫ్ దగ్గర మూడడుగుల లోతుకు 300 మీటర్ల పొడవున కుంగిపోయింది.

పొంచి ఉన్న ముప్పు..

గత ఏడాది వరదల సమయంలో దోనేపూడి, పెదపులివర్రు, పెనుమూడి మధ్య రెండు మూడు ప్రాంతాల్లో కరకట్టపై నుంచి నీరు బ్యాంక్ కెనాల్‌లోకి చొచ్చుకు వస్తుండటంతో ఇసుక మూటలు అడ్డువేసి అడ్డుకున్నారు. దీంతో అప్పటికి గండం గడిచింది. అయితే ఇప్పుడు అదే ప్రాంతాల్లో మళ్లీ భయం కలిగిస్తున్నది. ఎగువన వర్షాలతో పాటు జలాశయాల నుంచి వరద నీరు కిందికి వస్తోంది. దీంతో ఎప్పుడు ఎంత వరద వస్తుందో, ఏ స్థాయిలో విరుచుకుపడుతుందో అర్థంకాని విధంగా నదిలో పరిస్థితి మారింది. కనీసం కట్ట బలహీనంగా ఉన్నచోట ఇసుక మూటలు అడ్డువేసి రక్షణ ఏర్పాటు చేస్తారా అంటే అసలు ఆ శాఖ అధికారులే కనిపించని పరిస్థితి.

మామూళ్లతో పర్యవేక్షణ గాలికి..

కరకట్ట పటిష్ఠత విషయంలో పర్యవేక్షించాల్సిన ఆర్‌సీ అధికారులు ఆ బాధ్యతలను గాలికొదిలేశారు. బ్రిటీష్ హయాంలో కరకట్టపైకి మనిషి కూడా వెళ్లడానికి వీలులేనంత కట్టుదిట్టమైన నిబంధనలు అమలు చేశారు. అయితే ఇప్పుడు ఏకంగా కట్టనే తవ్వుకుపోతున్నా పట్టించుకునే వారే లేరు. ఆర్సీ విభాగానికి సంబంధించి ప్రస్తుతం ఏఈలు కాదుకదా కనీసం వారి సహాయకులు కూడా కనిపించరు. పెనుమూడి దిగువన రొయ్యల చెరువులు, మట్టి తవ్వకందారుల దగ్గర మామూళ్లు వసూలు చేసుకోవడానికి అధికారులు పరిమితమవుతున్నారు. గత వైసీపీ హయాంలో ఇసుక దందాకు అడ్డు రాకుండా చేసేందుకు నదీపరివాహక ప్రాంతంపై అజమాయిషీ ఉండాల్సిన ఆ శాఖనే నిర్వీర్యం చేశారు. వైసీపీ సర్కారు పోయి, కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా వారు గాడిన పడలేదు. రేపల్లె మండలంలో కరకట్ట పరిస్థితి ఎలా ఉంది? ఎక్కడెక్కడ మరమ్మతులు చెయ్యాలనేది తెలుసుకునేందుకు ఆర్‌సీ అధికారుల కోసం తహసీల్దారు, ఇతర శాఖల అధికారులు ప్రయత్నిస్తే ఎవరూ అందుబాటులో లేని పరిస్థితి.

వాటర్ బాటిల్ కోసం గొంతు కోశాడు

శావల్యాపురం, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): ఇద్దరి మధ్య చోటు చేసుకొన్న వాగ్వివాదం ముదిరి.. మరో వ్యక్తి గొంతుకోసిన ఘటన శావల్యాపురంలోని గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి పక్కనున్న షాపు వద్ద శనివారం రాత్రి జరిగింది. ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. ఇర్లపాడు గ్రామానికి చెందిన వూట్ల శ్రీనివాసరావు ట్రావెల్స్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రాత్రి 11.30 సమయంలో వినుకొండలో పనులు ముగించుకొని స్వగ్రామానికి వెళ్తూ.. వాటర్ బాటిల్ కోసం శావల్యాపురం పీహెచ్‌సీ సమీపంలోని షాపు వద్ద ఆగాడు. అదే సమయంలో చిన్నకంచెర్లకు చెందిన పూరేటి గణేష్ కూడా అక్కడికి వచ్చాడు. ఇద్దరూ తమకే ముందుగా వాటర్ బాటిల్ ఇవ్వాలని షాపు యజమానిని ఒత్తిడి చేశారు. అనంతరం ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకొంది. ఇద్దరూ కొట్లాడుకొనే సమయంలో గణేష్ పక్కనున్న ఉల్లిపాయలు తరిగే కత్తితో శ్రీనివాసరావు మెడపైన కోసి అక్కడి నుంచి పరారయ్యాడు. క్షతగాత్రుడిని వినుకొండలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.. ఎస్ఐ లోకేశ్వరరావు నమోదు చేశారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

తెనాలిరూరల్,ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన తెనాలి సుల్తానాబాద్ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అంగలకుదురుకు చెం దిన కిరాణా షాపు నిర్వాహ కుడు పువ్వాడ సుబ్బారావు (72) ఆదివారం తెనాలి వచ్చారు. తిరిగి స్వగ్రామానికి నడుచుకుంటూ వెళ్తుండగా.. వెనుక నుంచి వేగంగా వచ్చి న ఓ కారు అతడిని ఢీ కొ ట్టింది. తీవ్రగాయాలతో ఉన్న సుబ్బారావును స్థానికులు తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మార్గ మధ్యలోనే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘనటపై త్రీటౌన్ పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

గుంటూరు సిటీ వార్తలు


ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న చదలవాడ అరవిందబాబు

విద్యతోనే సూర్య బలిజల అభివృద్ధి సాధ్యం

● నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు

గుంటూరు (విద్య), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో విద్య అనే ఆయుధంతో అన్ని విధాల ఎదిగేందుకు కృషి చేయాలని నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. సూర్య బలిజ విద్యా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బ్రాడీపేట సీపీఎం కార్యాలయం కొరటాల సమావేశ మందిరంలో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోటు పుస్తకాలు, ఇతర విద్యా ఉపకరణాలు పెద్ద ఎత్తున అందజేశారు. ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరు తమ అభ్యున్నతి కోసం కృషి చేయాలని సూచించారు.

విద్య సంఘం అధ్యక్షుడు చదలవాడ రఘురాం సభకు అధ్యక్షత వహించగా కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త డాక్టర్ దాసరి కృష్ణారావు, విద్యా సంఘం కార్యదర్శి మద్దెల కైలాసనాద్ బాబు, కోశాధికారి సిద్ధాబత్తుని విజయకుమార్, భాస్కరరావు, మద్దుల రాము, నాగ రాము, మద్దుల వీరభద్రరావు, జక్కుల వెంకట రమణమూర్తి, తీగల దుర్గాప్రసాద్, జిల్లా విద్యా సంఘం నాయకులు, పూల మహేష్, చదలవాడ సుధాకర్, ధరణికోట మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు పథకం మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక

● ఝాన్సీ లక్ష్మీ భాయ్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన జనసేన

గుంటూరు మెడికల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకంతో కూటమి ప్రభుత్వం సంక్షేమ రంగంలో మరో ముందడుగు వేసినట్లు జనసేన పార్టీ కృష్ణ, పెన్నా కో ఆర్డినేటర్ పార్వతి నాయుడు తెలిపారు. జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి ఆధ్వర్యంలో ఆదివారం హిమని సెంటర్లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటానికి, ఝాన్సీ లక్ష్మీబాయ్ చిత్రపటాలకు వీరమహిళలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్వతి నాయుడు మాట్లాడుతూ ఏ సంక్షేమ పథకానికి రానంత స్పందన ఉచిత బస్సు పథకానికి వచ్చిందని ఆమె హర్షం వ్యక్తం చేశారు. జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకంతో వైసీపీ నేతలకు మతి భ్రమించిందన్నారు. కార్యక్రమంలో కోలా పద్మావతి, లంకా మాధవి, ధరణి, సరోజినీ, నాజర్ వలి, బందెల నవీన్, రెల్లి నాగరాజు, వడ్డే సుబ్బారావు, కోలా అంజనేయులు, నందూరి స్వామి, శెట్టి శ్రీనివాసరావు, రామకృష్ణ, హఫీజ్, జక్కా రాఘవులు పాల్గొన్నారు.


పవన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పార్వతి నాయుడు

30న సంచార, విముక్త జాతుల మహాసభ

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ

గుంటూరు(తూర్పు), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో స్ఫూర్తి పేరున ఈనెల 30న విజయవాడలో సంచార, విముక్త జాతుల మహాసభ నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ తెలిపారు. గుంటూరు, చంద్రమౌళినగర్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో సభకు సంబంధించిన ఆహ్వానపత్రికలను ఆవిష్కరించి మాట్లాడారు. నాటి ప్రధాని వాజ్‌పేయి నుంచి మోదీ వరకు సంచార జాతుల అభివృద్ధికి అనేక కార్యక్రమాలను అమలు చేసారని గుర్తు చేసుకున్నారు. జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ జిల్లాలోని సంచార, విముక్తి జాతులను, నాయకులను కలిసి సభకు రావాలని కోరుతామన్నారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తుల్లిమిల్లి రామకృష్ణ మాట్లాడుతూ సభలో సంచార కులాల వృత్తుల కళల ప్రదర్శనతో పాటు ఉద్యమ నాయకులకు సత్కారాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలపాటి రవికుమార్, చరక కుమార్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు భజరంగ్ రామకృష్ణ, దేసు సత్యానారాయణ, తోట శ్రీనివాసరావు, మంత్రి సుగుణ తదితరులు పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

మాస్టర్ అథ్లెటిక్స్‌లను ఆదుకోవాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మాస్టర్ అథ్లెటిక్స్‌లను ఆదుకోవాలని మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ లాల్‌వజీర్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీనియర్ అథ్లెటిక్స్‌లకు ఆర్థిక తోడ్పాటు అందించాలని శాప్ ఛైర్మన్‌కు వినతిపత్రం అందజేశామని చెప్పారు. ఈనెల చివరిలో బాపట్లలో రాష్ట్ర అథ్లెటిక్ మీట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులు రాజస్థాన్‌లో జరిగే జాతీయ పోటీలలో పాల్గొంటారని వివరించారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల సభ్యులు మాదిలేటి రెడ్డి, నజీర్, గిరి, డాక్టర్ పురుషోత్తం, నగేష్, షఫీ, సుబ్బారావు, వలి, ఖాదర్, సుబ్బారావు, లక్ష్మి, మల్లికా, చిన్ని, వెంకటాద్రి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న షేక్ లాల్‌వజీర్, పాల్గొన్న సంఘు సభ్యులు

ముగిసిన పోలేరమ్మ తల్లి పొంగళ్ళ మహోత్సవాలు

గుంటూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): చుట్టుగుంట పోలేరమ్మ తల్లి శ్రావణ మాస పొంగళ్ళ మహోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. చివరి రోజు ఆదివారం అమ్మవారి పొంగళ్ళు, జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచే అమ్మవారి పొంగళ్ళు, జాతరలో భాగంగా మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున క్యూ కట్టారు. చుట్టుగుంట, శాంతినగర్, హనుమాన్‌నగర్, ఏటి అగ్రహారం, శ్రీ లక్ష్మీనగర్‌తో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అలానే మాజీ మంత్రి అంబటి రాంబాబు, టీడీపీ నేత డాక్టర్ నిమ్మల శేషయ్య, అర్బన్ బ్యాంకు ఛైర్మన్ బోనబోయిన శ్రీనివాస్, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్, వైసీపీ నాయకుడు అంగడి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు వేంపాటి సాంబిరెడ్డి పలువురు నాయకులు అమ్మవారి సేవలో పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ తల్లి

నిజమైన భక్తితోనే శాంతి, సౌభాగ్యాలు

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి


భక్తులకు వడ్డన చేస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నిజమైన భక్తితోనే సమాజంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరుస్తాయని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. చుట్టుగుంటలో ఆదివారం జరిగిన పోలేరమ్మ కొలుపులు, శ్రీలక్ష్మీ నరసింహస్వామి నగర్(వడ్డెరగూడెం)లోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో జరిగిన కొలుపులు, శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. తొలుత చుట్టుగుంట పోలేరమ్మ తల్లి దేవస్థానంలో వార్షిక కొలుపుల్లో భాగంగా పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి, ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలను వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ పోలేరమ్మ తల్లి గుంటూరు నగరానికి ఆరాధ్యదేవత. ప్రతి ఏటా జరిగే కొలుపులు భక్తుల విశ్వాసాన్ని, సమాజంలో ఐక్యత, శాంతి, సౌభ్రాతృత్వాన్ని నెలకొల్పుతాయన్నారు. అనంతరం గుంటూరు నగరంలోని ఇస్కాన్ హరే కృష్ణ గోకులక్షేత్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొని ఎమ్మెల్యే మాధవి శ్రీకృష్ణుడికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఇచ్చిన బోధనలు నేటికీ సమాజానికి మార్గదర్శకమన్నారు.

రజకుల అభ్యున్నతికి కృషి చేసిన టీడీపీ

గుంటూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రజకుల రాజకీయ, ఆర్థిక అభ్యున్నతికి కృషి చేసిన పార్టీ తెలుగుదేశం అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం జరిగిన రజక నేతల ఆత్మీయ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రజకుల రాజకీయ, ఆర్థిక అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేసిన పార్టీ తెలుగుదేశమేనని, టీడీపీ ప్రభుత్వ హయాంలో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపడం, అధ్యయన కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. రజకుల్లో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించే దిశగా టీడీపీ మరింత బలంగా ముందుకు వెళ్తుందని, ఇందులో భాగంగానే తనను ఎమ్మెల్యే చేసిందని, తన పరిధిలో రజకులకు మెరుగైన రాజకీయ అవకాశాలు కల్పిస్తానని, రజకులకు జరుగుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని గళ్ళా మాధవి హామీ ఇచ్చారు. కార్యక్రమానికి గుంటూరు, పరిసర ప్రాంతాల రజక నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



మాట్లాడుతున్న నసీర్ అహమద్, పాల్గొన్న ఆవాజ్ కమిటీ సభ్యులు

స్వాతంత్ర్య ఫలాలు అందరికి అందాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఫలాలు ప్రతి ఒక్కరికి అందాలని కళారత్న అవార్డు గ్రహీత నసీర్ అహ్మద్ అన్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్రోద్యమం నాటి త్యాగాలు- నేటి కర్తవ్యాలు అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. స్వతంత్ర్య సంగ్రామంలో కులం, మతం, ప్రాంతంతో నిమిత్తం లేకుండా కలిసి పోరాడారని గుర్తు చేసుకున్నారు. యూటీఎఫ్ నాయకురాలు ఎండీ షకిలా బేగం మాట్లాడుతూ అమెరికన్ సామ్రాజ్యవాదంతో భారతదేశ లౌకికతత్వంకు ప్రమాదం ఏర్పడిందని అన్నారు. మిడిల్ క్లాస్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వివికే సురేష్ మాట్లాడుతూ లౌకికతత్వాన్ని పరిరక్షించుకునేందుకు సమైక్య ఉద్యమాలు అవసరమన్నారు. ఈ కార్యక్రమానికి ఆవాజ్ కమిటీ నాయకులు సుభాని అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో ఎంఏ చిష్టి, సలీం, ప్రొఫెసర్ వేణుగోపాల్, రవిచంద్ర, నజీర్ మహెక్, సైదా, కళ్యాణి పాల్గొన్నారు.

కమనీయ కరుణోదయం కరుణశ్రీ కవిత్వం

● సాహితీవేత్త కళ్యాణశ్రీ

గుంటూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కమనీయ కరుణోదయం కరుణశ్రీ కవిత్వం అని ప్రముఖ సాహితీవేత్త కళ్యాణశ్రీ (హైదరాబాద్) తెలియజేశారు. ఆదివారం బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో 'అమరావతి సాహితి మిత్రులు' నిర్వహించిన సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై కరుణశ్రీ కవిత్వంపై ప్రసంగించారు. సంస్థ అధ్యక్షులు డాక్టర్ రావి రంగారావు అధ్యక్షత వహించిన సభలో ఆయన మాట్లాడుతూ కరుణకు, ప్రేమకు, సుకుమార భావాలకు, సున్నితమైన హృదయ స్పందనలకు కరుణశ్రీ కవిత్వం పెద్దపీట వేసిందని ఆయన వివరించారు. ఈ మాసం కవిగా తుమ్మల సాంబశివరావు (హైదరాబాద్) పాల్గొని వచన కవితలను, మినీ కవితలను వినిపించి సభను రంజింపజేశారు. పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన కవితా పఠన కార్యక్రమంలో చల్లా సత్యవతి, శరకణం కనకదుర్గ, మేడిశెట్టి సుభద్రా కృష్ణ, గడల శివప్రసాద్, సంబరాజు రమణి, భద్రవేణి, బండికల్లు జమదగ్ని, పుట్టంరాజు నరసింహ మూర్తి మొదలైన వారు పాల్గొన్నారు. ముఖ్య అతిథి కళ్యాణశ్రీని, 'ఈ మాసం కవి' తుమ్మల సాంబశివరావును సంస్థ పక్షాన రావి రంగారావు, డాక్టర్ టి సేవకుమార్ ఘనంగా సత్కరించారు. 'నిక్కచ్చి కవిత' పోటీ విజేత మేడిశెట్టి సుభద్రా కృష్ణకు 'శాంతశ్రీ ట్రస్ట్' వారు రూ.500 నగదు బహుమతి అందజేశారు. సభలో అలీఘర్ ముస్లిం విశ్వ విద్యాలయం ప్రాచార్యులు ప్రొఫెసర్ షేక్ మస్తాన్, పట్టాభి కళా పీఠం అధ్యక్షులు తూములూరి రాజేంద్రప్రసాద్ తదితరులున్నారు.


సాహితీవేత్తలను సత్కరిస్తున్న రావి రంగారావు తదితరులు

ప్రతిజ్ఞ కార్యక్రమాలను జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలకు వ్యతిరేఖంగా ఈ నెల 28న జరిగే ప్రతిజ్ఞ కార్యక్రమాలను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి పిలుపునిచ్చారు. స్థానిక పాతగుంటూరులో ఆదివారం జరిగిన సీఐటీయూ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆ రోజున అమరవీరుల స్ఫూర్తితో ప్రతిజ్ఞ దినంగా పాటించాలని కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రజలపై మోపుతున్న భారాలను పోరాటాల ద్వారానే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వంతో ఆదానీ చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో లక్ష్మణరావు, ఎం.సాంబశివరావు, వై.నేతాజీ, జి.రమణ, బి.ముత్యాలరావు, నన్నపనేని శివాజీ, పూర్ణ పాల్గొన్నారు.

ఫీజు బకాయిలను తక్షణం విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ

గుంటూరు (విద్య), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణం చెల్లించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్ డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించాలని కోరుతూ ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. జిల్లా కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ జీవో నెంబర్ 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ సమీర్, జిల్లా సహాయక కార్యదర్శులు పవన్ రూపస్, నగర అధ్యక్ష, కార్యదర్శులు సౌమ్య, యశ్వంత్, నగర ఉపాధ్యక్షుడు హర్షిత, గంగాధర్, సహాయ కార్యదర్శులు సంతోష్, సుభాని, శశాంక్ సుర్జిత్, నగర గర్ల్స్ కన్వీనర్ సింధు శ్రీ తదితర విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆవోపా ఆధ్వర్యంలో పెన్షన్లు పంపిణీ

గుంటూరు (విద్య) ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్ ప్రొఫెషనల్ (ఆవో ఆధ్వర్యంలో వృద్ధులకు ఆదివారం పెన్షన్లు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షులు కేవీ బ్రహ్మం అధ్యక్షతన 108 మంది పేదలకు పెన్షన్లు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పోలిశెట్టి శ్రీనివాస్, అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు, డాక్టర్ పోలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ వృద్ధులకు విద్యార్థులకు చేయూతనివ్వడం హర్షణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ మహంకాళి శ్రీనివాసరావు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మద్ది సాయి రమేష్, ఊటుకూరు నాగేశ్వరరావు, కోటి స్వామి గుప్తా. వెంకట్రావు, మద్ది కోటిరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల చోరీపై రాష్ట్రంలో చర్చ లేకపోవడం శోచనీయం

● పులివెందుల ఎన్నికపై జగన్ వ్యాఖ్యలు విడ్డూరం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

గుంటూరు(తూర్పు), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఓట్ల చోరీపై దేశమంతా చర్చ జరుగుతుంటే ఆంధ్రప్రదేశ్‌లో పాలక, ప్రతిపక్ష నాయకులు స్పందించకపోవడం శోచనీయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ అన్నారు. గుంటూరు, కొత్తపేటలో ఆదివారం జరిగిన జిల్లా మహాసభల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. దొంగ ఓట్లపై స్పందించకుండా పులివెందులలో ప్రజాస్వామ్యం గురించి జగన్ మాట్లాడుతున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవం చేసుకున్న జగన్ ఇప్పుడు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సూపర్-6 హామీలన్ని ఖచ్చితంగా అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. నూతన బస్సులు కొనుగోలు చేయకుండా, తగిన సిబ్బంది నియామకం జరుగకుండా మహిళలకు ఉచిత బస్సు పథకం వలన ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. మరో వైపు ఈ పదకొండేళ్ల పాలనలో మోదీ ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, రైతాంగాన్ని గాలికి వదిలేశారని, ధరలు నియంత్రించలేదని, పేదరికాన్ని పోగొట్టలేదని, ఉద్యోగ కల్పన చేయలేదని, నల్ల ధనం వెనక్కి తేలేదని చెప్పారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ, ప్రాంతీయ బూర్జువా పార్టీల పట్ల ప్రజల్లో అసమ్మతి ఉందన్నారు. అంతకుముందు బీఆర్ స్టేడియం నుంచి కొత్తపేట సీపీఐ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సభకు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అధ్యక్షత వహించగా, సభలో నాయకులు మాల్యాద్రి, ఆకిటి అరుణ్ కుమార్, వెలుగూరి రాధాకృష్ణమూర్తి, చిన్ని తిరుపతయ్య, చెరుకుమల్లి సింగారావు, మేడా హనుమంతరావు, పుష్పాల సత్యనారాయణ, ముప్పాళ్ళ శివశంకర్రావు, రామిశెట్టి ఆదేశ్వరరావు, నాసర్‌జీ, రావుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ వేడుకలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఏపీయూ డబ్ల్యూజే 69వ ఆవిర్భావ వేడుకలు నగరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బ్రాడీపేటలో శ్రీ షిరిడి సాయి దీనజన సేవా సమితి అంధుల పాఠశాలలో నిత్యావసర సరుకులు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ కోరుతూ మొక్కలు నాటారు. జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్ మీరా మాట్లాడుతూ యూనియన్ పోరాటాల ఫలితంగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు, హెల్త్ ఇన్సూరెన్స్, ఆర్టీసీ బస్ పాస్‌లు, ఇళ్ల స్థలాలు వంటి సౌకర్యాలు వచ్చాయన్నారు. జిల్లా నాయకులు కె.రాం బాబు, శ్యామ్ నాయక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పి.భక్తవత్సలరావు. నగర అధ్యక్ష, కార్యదర్శులు కొంగర వెంకయ్య, కార్తీక్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు కె.తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులు బి.వెంకటేశ్వరరావు, ఏ.వీరభద్రరావు పాల్గొన్నారు.

భారతీయ మజ్దూర్ సంఘు కార్యవర్గ ఎన్నిక

గుంటూరు(తూర్పు), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేటలో భారతీయ తపాలా ఉద్యోగుల సంఘం, గుంటూరు బీఎంఎస్ (భారతీయ మజ్దూర్ సంఘ) గ్రూప్ సి తొలి వార్షిక మహా సభలు, కార్యవర్గ ఎన్నిక కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిలుగా జిల్లా కన్వీనర్ కే.మురళీకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వెంకయ్య హాజరయ్యారు. గుంటూరు బీఎంఎస్ గ్రూప్ సి అధ్యక్షుడిగా ఎం.నాగరాజు, కార్యదర్శిగా ఆర్.బాలకృష్ణ, కోశాధికారిగా ఎస్‌డీ సుభానిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు డివిజన్ పోస్ట్‌మెన్ సంఘ కార్యదర్శి సిహెచ్ మురళీకృష్ణ, అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని నూతన కమిటీని అభినందించారు.

వీనులవిందుగా శాస్త్రీయ సంగీత కచేరి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం, శ్రీ త్యాగరాజ కళావేదికపై నెలవారీ కార్యక్రమంలో భాగంగా పద్మావతి సారనాథన్, చెన్నై వారిచే శాస్త్రీయ సంగీత కచేరి వీనుల విందుగా సాగింది. వీరికి వయోలిన్‌పై గాయత్రీ శివాని, మృదంగంపై ఆర్ అనంతకృష్ణన్ చక్కటి వాయిద్య సహకారాన్ని అందించారు. అన్నమయ్య, త్యాగరాజ కీర్తనలను ఆలపించి సంగీతాభిమానులను అలరించారు. అనంతరం శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణ కిషోర్, ఉపాధ్యక్షుడు ఎస్ గిరిజాశంకర్ కళాకారులను సత్కరించారు.

భర్త, అత్తమామల వేధింపులతో మహిళ ఆత్మహత్యాయత్నం

గుంటూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : భర్త, అత్తమామల వేధింపులు తట్టుకోలేక ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన ఆదివారం అరండల్‌పేటలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం గ్రామానికి చెందిన గుడ్డేటి వినీత కవలకుంట్ల గ్రామంలో ఆశా వర్కర్‌గా పని చేస్తోంది. ఐదు సంవత్సరాల క్రితం చాపలమడుగు గ్రామానికి చెందిన పల్లె నెహెమియాతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె భర్త ఏ పనులు చేయకుండా, చిన్న విషయాలకు ఆమెతో గొడవ పడుతుంటాడు. భర్త పల్లె నెహెమియా, అత్త పల్లె సౌరమ్మ, మామ పల్లె భధరయ్య అందరూ కలిసి వినీతను వరకట్నంగా నాలుగు లక్షలు తీసుకురమ్మని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. దీంతో బాధితురాలు జీవితంపై విరక్తి చెంది ఆరండల్‌పేటలోని తన అక్క ఇంటిలో 30 వివిధ రకాల టాబ్లెట్స్ మింగీ ఆత్మహత్యకు ప్రయత్నించింది. దీంతో ఆమెను చికిత్స కోసం గుంటూరులోని కొత్తపేటలో గల విక్రమ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న బాధితురాలు ఇచ్చిన రిపోర్టు మేరకు కె. రోజలత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొరికిన డబ్బుల కట్టను పోలీసులకు అందించిన వ్యాపారి

గుంటూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గల నల్లచెరువు 9వ లైను వద్ద గుర్తు తెలియని వ్యక్తులు పోగొట్టుకున్న డబ్బుల కట్టను ఓ వ్యాపారి పోలీసులకు అందించి తన నిజాయితీ చాటుకున్నాడు. శ్రీనివాస్ రైస్ మార్ట్ దగ్గర కొంత డబ్బులను రోడ్డుపై గుర్తు తెలియని వ్యక్తి పోగొట్టుకున్నాడు. షాప్ ఓనర్ రాజనాల శ్రీనివాసరావు, సంపత్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఆదాంషాలకు ఆ డబ్బు దొరికింది. దీంతో వారు లాలాపేట పోలీస్ స్టేషన్ కు తీసుకొని వచ్చి డబ్బులను ఎస్ఐ బాల నాయక్‌కు అప్పగించారు. సదరు డబ్బు పోగొట్టుకున్న వారు లాలాపేట పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి వివరాలు అందించి నగదు తీసుకువెళ్ళవచ్చన్నారు.


ఆసుపత్రిని ప్రారంభిస్తున్న తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

అత్యాధునిక వైద్య సదుపాయాలతో జేవీఎం ఆసుపత్రి

● హాజరైన పలువురు ఎమ్మెల్యేలు, నగర ప్రముఖులు

గుంటూరు మెడికల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మణిపురం ఫ్లైఓవర్ పక్కన, భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో ఆధునిక సౌకర్యాలతో, అత్యాధునిక వైద్య పరికరాలతో నిర్మించిన జేవీఎం మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, మొహమ్మద్ నసీర్ అహ్మద్, గళ్ళా మాధవి, బూర్ల రామాంజనేయులు, డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆసుపత్రిలో వివిధ విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి శిశు వైద్యనిపుణులు కోటి నాగయ్య మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో పీడియాట్రిక్స్, పీడియాట్రిక్ సర్జరీ, నియోనేటాలజీ, గైనకాలజీ, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, కార్డియాలజీ, పల్మనాలజీ, న్యూరాలజీ, డెర్మటాలజీ, వాస్కులర్ సర్జరీ, ఎమర్జెన్సీ సర్వీసులు అందుబాట్లో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి కన్సల్టెంట్‌లు డాక్టర్ జేవీ లక్ష్మీ, డాక్టర్ జే పవన్‌కుమార్, డాక్టర్ జే లోకేష్‌తో పాటు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, తులసీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ తులసి రామచంద్ర ప్రభు, తులసీ యోగేష్ చంద్ర, మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

యోగా జీవితంలో భాగమవ్వాలి : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని, ప్రతి రోజూ కొంత సమయాన్ని యోగాకు కేటాయించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ సూచించారు. గుంటూరు అరండల్‌పేటలోని కెనడీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 'యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా' ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా చాంపియన్ షిప్- 2025 విజేతలకు ఆదివారం ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే యోగాను అనుసరించాలని సూచించారు. తల్లిదండ్రులు ప్రతి రోజూ విద్యార్థులను యోగా కేంద్రాలకు తీసుకెళ్లడాన్ని ఒక బాధ్యతగా తీసుకోవాలన్నారు. యోగా గురువులు కొంత సమయాన్ని పేద వర్గాలు నివసించే ప్రాంతాల్లో యోగా కేంద్రాల నిర్వహణకు కేటాయించాలని కోరారు. తద్వారా ప్రతి ఒక్కరికీ ఆరోగ్యాన్ని, మానసిక ఆనందాన్ని అందించిన వారవుతారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టాబత్తుని చిట్టిబాబు, స్కూల్ డైరెక్టర్ కే.శ్రీకాంత్, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అంకమ్మరావు, యోగా టీచర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల ఓటమి తర్వాతైనా జగన్ మారాలి

● టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి



గుంటూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో ఘోర ఓటమి తర్వాతైనా జగన్ మారాలని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధర్మం ఎంత బలంగా ఉన్నా అది తాత్కాలికమేనన్న విషయం జగన్మోహనరెడ్డికి గత ఎన్నికల ఫలితాల తర్వాత జ్ఞానోదయం అయినట్లుందని అన్నారు. ధర్మం నెమ్మదిగా ముందుకెళ్ళటం అంటే జైలు నుంచి బెయిలుపై విడుదలై 12 ఏళ్లవుతున్నా, 2,782 కోర్టు వాయిదాలకు గైర్హాజరైనా కనీసం వారెంట్ కూడా జారీ కాకపోవటం జగన్మాయ కాక మరేమిటన్నారు. చట్టాల్లో ఉన్న లొసుగులను అడ్డుపెట్టుకొని బతుకీడుస్తున్న జగన్మోహనరెడ్డి కూడా శ్రీకృష్ణుడి జీవిత సారాంశం గురించి ప్రజలకు సందేశం ఇవ్వటం హాస్యాస్పదంగా ఉందన్నారు. జగన్ రెడ్డితో సహా మాజీ మంత్రులంతా నెమ్మదిగా శ్రీకృష్ణ జన్మస్థానానికి వెళ్లక తప్పదన్నారు. 35 సంవత్సరాలుగా పులివెందుల ప్రజలకు ఓటు వేయటం అనే అనుభూతి ఎలా ఉంటుందో తెలియక మనోవ్యధకు గురయ్యారని, దాని ఫలితమే వైసీపీ అభ్యర్థి మూడంకెల ఓట్లకే పరిమితమయ్యాడని అన్నారు. చంద్రబాబుపై కక్షతో కుప్పం స్థానిక సంస్థల ఎన్నికల్లో పాపాల పెద్దిరెడ్డితో జగన్ చేయించిన నేరాలు ఘోరాలకు వారు మూల్యం చెల్లించక తప్పదన్నారు. జగన్ హింస భరించలేక సజ్జల రామకృష్ణారెడ్డి, అంబటి రాంబాబు, పేర్ని నాని, జోగి రమేష్ లాంటి నేతలు బయట ఉండేకంటే జైల్లో ఉండటమే ఉత్తమమని భావిస్తున్నారని కనపర్తి ఎద్దేవా చేశారు.


చుక్కపల్లి శంకరరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కుటుంబ సభ్యులు రమేష్, సురేష్, పలువురు ప్రముఖులు

దార్శనికుడు చుక్కపల్లి శంకరరావు

● ఘనంగా శత జయంతి ఉత్సవం

● హాజరైన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్

గుంటూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామికవేత్తగా ఎదిగి, సామాజిక సేవా రంగాల్లో తనదైన ముద్ర వేసుకున్న దివంగత చుక్కపల్లి శంకరరావు గొప్ప దార్శనికుడని పలువురు ప్రముఖులు కీర్తించారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త చుక్కపల్లి శంకరరావు శత జయంతి ఉత్సవాలు ఆయన తనయులు పారిశ్రామిక వేత్తలు చుక్కపల్లి రమేష్, చుక్కపల్లి సురేష్‌ల ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలలోని జింఖానా ఆడిటోరియంలో ఆదివారం వేడుకగా జరిగాయి. ఈ సందర్భంగా చుక్క పల్లి శంకరరావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ నన్నపనేని రాజకుమారి, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, ఆధ్యాత్మిక వేత్త బొల్లేపల్లి సత్యనారాయణ పలువురు ప్రముఖులు చుక్కపల్లి శంకరరావు విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. జిల్లాలోని కంచర్ల పాలెంలోని కుగ్రామంలో జన్మించిన ఆయన ఆటో మొబైల్ రంగంలో వ్యాపారం ప్రారంభించి పయనీర్ సంస్థ స్థాపించి వ్యాపార సామ్రాజ్యాన్ని సృష్టించి దిగ్గజంగా ఎదిగారన్నారు.

ఆకట్టుకున్న 'చాగంటి' ఆధ్యాత్మిక ప్రవచనం

చుక్కపల్లి శంకరరావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త చాగంటి కోటేశ్వరరావు చేసిన ఆధ్యాత్మిక ప్రవచనం ఆహూతులను ఆకట్టుకుంది. అంతకముందు కర్ణాటక సంగీత గాత్ర కచేరి ఆహుతులను అలరించింది. ఈ సందర్భంగా చుక్కపల్లి శంకరరావు జీవిత చరిత్ర డాక్యుమెంటరీ ఆసక్తిగా తిలకించారు.

స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎంపికలు

గుంటూరు (క్రీడలు), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి నియామకానికి జిల్లా విద్యా శాఖ అధికారి సీవీ రేణుక విధి విధానాలను విడుదల చేశారు. ఈ ఏడాది నూతనంగా నియామకం పొందిన కార్యదర్శి రెండు సంవత్సరాలు ఈ పదవిలో కొనసాగనున్నారు. కనీసం పది సంవత్సరాలు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించిన వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఈ ఎంపికలకు అర్హులు. ఆసక్తి గల ఉపాధ్యాయులు ఈనెల 20వ తేదీలోపు తమ దరఖాస్తులను విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.



గేట్-2026

దేశంలోని ఐఐటీలు సహా పలు ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన 'గేట్-2026' షెడ్యూల్ వెలువడింది. మొత్తం 30 సబ్జెక్టు పేపర్లకు ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ ఎంట్రెన్స్‌ను గౌహతి ఐఐటీ నిర్వహిస్తోంది. ఎంట్రెన్స్‌లో సాధించిన స్కోరు, ఫలితం వెలువడిన నాటి నుంచి మూడు సంవత్సరాలపాటు వాలీడ్‌గా ఉంటుంది. ఆ స్కోరుతో మూడేళ్లలో ఎంటెక్ తదితర కోర్సుల్లో అడ్మిషన్ తీసుకోవచ్చు.

- **దరఖాస్తులకు చివరి తేదీ:** 2025 సెప్టెంబర్ 25
- **ఎంట్రెన్స్ తేదీలు:** 2026 ఫిబ్రవరి 7, 8, 14, 15
- **ఫలితాలు:** 2026 మార్చి 19
- **వెబ్‌సైట్:** http://gate2026.iitg.ac.in/

ఎలా ప్రిపేర్ కావాలి

జాతీయ స్థాయిలో అత్యంత పోటీ ఉన్న ఎంట్రెన్స్‌ల్లో 'గేట్' ఒకటి. అభ్యర్థుల టెక్నికల్ నాలెడ్జ్‌కి ప్రామాణికంగా ఈ ఎంట్రెన్స్‌ను భావిస్తుంటారు. గేట్ అత్యంత ప్రామాణికంగా ఉండడానికి కారణం దీనిని ఐఐటీలు నిర్వహించడమే. గ్రాడ్యుయేషన్ తర్వాత ఉద్యోగం చేస్తూ చాలా మంది గేట్ ఎంట్రెన్స్ రాస్తుంటారు. ప్రశ్నలపరంగా చూస్తే ఇందులో మల్టిపుల్ చాయిస్, న్యూమరికల్ తరహా ఆన్సర్, జనరల్ రిలేటెడ్ ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థి ఇంజనీరింగ్ కాన్సెప్ట్‌లు, అనలిటికల్ థింకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్ ఎబిలిటీస్ పరీక్షిస్తారు. గేట్ స్కోరుతో ఉన్నత చదువులే కాకుండా ఇతర అవకాశాలు కూడా ఉంటాయి.

ప్లానింగ్: గేట్ ప్రిపరేషన్ మొదలుపెట్టే ముందే ప్రస్తుత వర్క్ షెడ్యూల్‌ను పరిశీలించుకోవాలి. రోజువారీ పనులకు పోనూ ప్రిపరేషన్‌కు ఎంత సమయం కేటాయించగలం అనేది అంచనా వేసుకోవాలి. సిలబస్‌ను ముందు పెట్టుకుని సరైన పద్ధతిలో విభజించుకుని, వీక్లీ, మంత్లీ ప్లాన్‌ను సిద్ధం చేసుకోవాలి. ఉదాహరణకు ఈ వారం నెలలో పూర్తి చేయాల్సిన చాప్టర్లు, లేదా సబ్జెక్టులు అని ప్లాన్ చేసుకోవాలి.

సరైన స్టడీ మెటీరియల్: అభ్యర్థి తాను రాసే ఇంజనీరింగ్ సబ్జెక్టుకు సంబంధించి సరైన మెటీరియల్‌ను ఎంచుకోవాలి. దీనికి సంబంధించి కోచింగ్ సెంటర్ల మెటీరియల్ ఉంటుంది. అలాగే చాలా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ కూడా అందుబాటులో ఉన్నాయి. గూగుల్‌లో సెర్చ్ చేస్తే వాటికి సంబంధించిన వివరాలు అందుబాటులోకి వస్తాయి.

మొబైల్ యాప్స్, ఆన్‌లైన్ మెటీరియల్: గేట్ అకాడమి, టెస్ట్ బుక్, గ్రేడ్‌అప్, తదితర యాప్స్‌లో స్టడీమెటీరియల్ అందుబాటులో ఉంటుంది. అలాగే మాక్‌టెస్ట్‌లు, ప్రాక్టీస్ ప్రశ్నలు లభిస్తాయి.

మాక్‌టెస్ట్‌లు: రోజు థియరీ చదవడం, ప్రశ్నలు పూరించడం చేయడంతో ప్రిపరేషన్ పూర్తయినట్లు కాదు. గత సంవత్సర ప్రశ్న పత్రాలు, మాక్ టెస్ట్‌లు రాయడం వల్ల టైమ్ మేనేజ్‌మెంట్‌తోపాటు బలహీనంగా ఉన్న చాప్టర్లను గుర్తించడం సులువు అవుతుంది. తరవాత తప్పులను పరిశీలించుకుంటే ఎక్కడ మెరుగు పరుచుకోవాలో అర్థం అవుతుంది. మాక్ టెస్ట్‌లు కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి.

స్ట్రెస్ మేనేజ్‌మెంట్, మోటివేషన్: ప్రిపరేషన్‌లో మోటివేషన్ ఉండాలంటే ఇప్పటి వరకు ఎంత సిలబస్ పూర్తి చేశారు అనేది పరిశీలించుకుంటూ ఉండాలి. రోజువారీ, నెలవారీ లక్ష్యాలను ఎలా అందుకున్నది చూసుకుంటే మరింత ఉత్సాహం కలుగుతుంది. మాక్‌టెస్ట్‌ల్లో లభించిన స్కోరుతో లక్ష్యాన్ని ఎంత వరకు చేరుకున్నామో అర్థం అవుతుంది. అలాగే మంచి స్టడీ గ్రూప్‌లో చేరడం, లేదా ప్రిపేర్ అయ్యే వ్యక్తులతో కలిసి చదువు సాగిస్తే మోటివేషన్ లభిస్తుంది.

అకడమిక్ అవకాశాలు

ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ తరవాత విద్యార్థులకు పలు అవకాశాలు ఉంటాయి. అందులో పాపులర్ ఆప్షన్ మాత్రం పోస్ట్‌గ్రాడ్యుయేషన్ ఇంజనీరింగ్.

ఇంజనీరింగ్ పీజీ

- **మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ(ఎంటెక్)/ మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్(ఎంఈ):** కాల పరిమితి రెండేళ్లు. ఈ కోర్సు చేయడానికి బీటెక్/బీఈతోపాటు గేట్ స్కోరు ఉండాలి. ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీలతోపాటు బిట్స్ పిలానీ, డీటీయూ, జాదవ్‌పుర్ యూనివర్సిటీ, అన్నా వర్సిటీ మొదైనవి ఉన్నాయి.

స్పెషలైజేషన్లు: సీఎస్ఈ, ఏఐ అండ్ ఎంఎల్, డేటా సైన్స్, రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్, వీఎల్ఎస్ఐ డిజైన్, పవర్ సిస్టమ్స్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, థెర్మల్ ఇంజనీరింగ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ మొదలైనవి.

- **మాస్టర్ ఆఫ్ సైన్స్(ఎంఎస్సీ)/ ఎంఎస్(రీసెర్చ్):** ఐఐఎస్సీ, ఐఐటీ, కొన్ని యూనివర్సిటీలు వీటిని అందిస్తున్నాయి. పీహెచ్‌డీ చేయాలనుకునే వారికి ఇది సరైన కోర్సు. గేట్ లేదా ఆయా సంస్థలు పెట్టుకునే పరీక్షల ద్వారా అడ్మిషన్ లభిస్తుంది.

ఇతర అవకాశాలు

- **పబ్లిక్ సెక్టార్లో ఉద్యోగాలు:** ఓఎన్‌జీసీ, బీహెచ్‌ఈఎల్, ఐఓసీ, గెయిల్, డీఆర్‌డీఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, పబ్లిక్ సెక్టార్ ఎంటర్ ప్రైజస్‌లు తమ టెక్నికల్ విభాగాల్లో నేరుగా 'గేట్' ర్యాంకర్లకు ఉద్యోగాలు ఇస్తారు.
- **అంతర్జాతీయ అవకాశాలు:** 'గేట్'లో మంచి స్కోరు సాధించిన విద్యార్థులకు విదేశాల్లో చదువుకునే అవకాశం లభిస్తుంది. అలాగే విదేశీ స్కాలర్‌షిప్ కూడా లభిస్తుంది. నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్(ఎన్‌యూఎస్), ఈటీహెచ్ జ్యూరిచ్ తదితర విద్యా సంస్థలు 'గేట్' స్కోరును అంగీకరిస్తాయి.
- **ఇండస్ట్రీ-అకడమిక్ గుర్తింపు:** ఇండస్ట్రీ, అకడమిక్ వైపు 'గేట్' స్కోరును సబ్జెక్ట్ ఎక్సలెన్స్‌కు బెంచ్ మార్కుగా భావిస్తారు.



ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు
డైరెక్టర్, ఎన్ఐటి రాయపూర్

దిక్సూచి

స్కాలర్‌షిప్స్

దివ్యాంగ విద్యార్థులకు..

దివ్యాంగ విద్యార్థుల కోసం సామాజిక న్యాయం, సాధికారిక మంత్రిత్వ శాఖ ఉపకార వేతనాలు అందిస్తోంది. 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ గుర్తింపు పొందిన వైకల్యం ఉన్న విద్యార్థుల చదువుల కోసం 'స్కాలర్‌షిప్ ఫర్ డిజెబిలిటీస్'ను అందిస్తున్నారు. వీటిలో పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు, దేశీయ, విదేశీ చదువులు, పోటీ పరీక్షల శిక్షణ కోసం కూడా సహాయం చేస్తున్నారు.

స్కాలర్‌షిప్ రకాలు:

- **ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్:** 9, 10 తరగతుల వారికి ఉద్దేశించింది.
- **పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్:** 11వ తరగతి నుంచి పీజీ, డిగ్రీ, డిప్లొమా వారికి ఉద్దేశించింది.
- **టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్:** ప్రముఖ విద్యా సంస్థల్లో యూజీ, పీజీ చదువులకు ఉద్దేశించింది.
- **నేషనల్ ఫెలోషిప్:** భారతీయ యూనివర్సిటీల్లో ఎంఫిల్, పీహెచ్‌డీలకు ఉద్దేశించింది.
- **నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్:** విదేశాల్లో మాస్టర్స్, పీహెచ్‌డీలకు ఉద్దేశించింది. అభ్యర్థులు దీనికి ఎంపికయ్యే సంవత్సరం ఏప్రిల్ 1 నాటికి 35 సంవత్సరాల లోపు ఉండాలి.
- **ఫ్రీ కోచింగ్ స్కాలర్‌సిప్:** ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రొఫెషనల్ కోర్సుల పరీక్షల కోచింగ్‌లకు ఉద్దేశించింది.

అర్హత: 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ డిజెబిలిటీ ఉన్నవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. వైకల్యానికి సంబంధించిన, యూడీఐడీ కార్డు ఉండాలి.

కుటుంబ ఆదాయం: రూ.2.5 లక్షలు(ప్రీ-పోస్ట్ మెట్రిక్ దరఖాస్తుదారులకు), రూ.8 లక్షలు(టాప్ క్లాస్, నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్, ఫ్రీ కోచింగ్ దరఖాస్తు దారులకు), నేషనల్ ఫెలోషిప్ వారికి ఎలాంటి ఆదాయ పరిమితి లేదు. ఒకే తల్లిదండ్రుల నుంచి ఇద్దరు పిల్లలు మాత్రమే అర్హులు. కవలల విషయంలో మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు: నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ధ్రువపత్రాలు: పాస్‌పోర్ట్ ఫోటో, బర్త్ సర్టిఫికెట్, డిజెబిలిటీ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ నెంబర్, ట్యూషన్ ఫీజు రసీదు, చివరి విద్యార్హత సర్టిఫికెట్, ఆధార్‌తో లింక్ అయిన బ్యాంకు ఖాతా వివరాలు.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 31 **వెబ్‌సైట్:** scholarships.gov.in

గిరిజన విద్యార్థులకు..

కేంద్ర గిరిజన గిరిజన వ్యవహార శాఖ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన గిరిజన విద్యార్థులకు దేశ వ్యాప్తంగా ఉన్న విద్యా సంస్థల్లో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు చదివేందుకు 'జాతీయ స్కాలర్‌షిప్ పథకం' అందిస్తోంది. ఇంజనీరింగ్, మెడిసిన్, మేనేజ్‌మెంట్, సైన్స్ టెక్నాలజీ, హ్యూమానిటీస్, లా, సోషల్ సైన్స్ వంటి విభాగాల్లో చదువుకు ఏడాదికి 2.50 లక్షలతోపాటు ఇతర ఆర్థిక సహాయం పొందవచ్చు.

స్కీమ్ పేరు: జాతీయ గిరిజన విద్యార్థుల ఉన్నత విద్యా పథకం(టాప్ క్లాస్ స్కాలర్‌షిప్)

అర్హత: అభ్యర్థులు గిరిజన వర్గానికి చెందిన వారై ఉండాలి. మంత్రిత్వశాఖ ప్రకటించిన ప్రముఖ విద్యా సంస్థలో డిగ్రీ, పీజీలో ప్రవేశం పొంది ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం ఆరు లక్షల లోపు ఉండాలి. ఒకే కోర్సుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మరో స్కాలర్‌షిప్ పొందుతూ ఉండరాదు.

ధ్రువపత్రాలు: గిరిజన సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, అడ్మిషన్/ఫీజు రసీదు, ఆధార్ లింక్ చేసిన బ్యాంక్ పాస్‌బుక్, అర్హత పరీక్ష సర్టిఫికెట్/మార్క్‌షీట్, బోనఫైడ్ సర్టిఫికెట్

దరఖాస్తు: ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్, అవసర పత్రాల్ అప్‌లోడ్ తరువాత మంత్రిత్వశాఖ ధ్రువీకరణ పొందాలి.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 31

వెబ్‌సైట్: scholar-ships.gov.in



నౌకాదళంలో ఉద్యోగాలు

భారత నౌకాదళంలో గ్రూప్ 'సీ' నాన్ గెజిటెడ్, 1266 ఇండస్ట్రియల్ ట్రేడ్స్‌మెన్ స్కిల్డ్ ఖాళీల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఎక్స్‌నేవల్ అప్రెంటిస్ అభ్యర్థులు మాత్రమే అర్హులు. రాత పరీక్ష, ట్రేడ్ టెస్ట్ ఆధారంగా ఎంపిక ఉంటుంది. వయస్సు 18 నుంచి 25 సంవత్సరాల లోపు ఉండాలి.

ట్రేడులు: సివిల్ వర్క్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంట్, మెషిన్ తదితరాలు.

చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 2

వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in



బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో జనరలిస్ట్ ఆఫీసర్లు

మొత్తం పోస్టులు 500

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 500 జనరలిస్ట్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.

విద్యార్హతలు: కనీసం 60 శాతం మార్కులతో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీ వారికి 55 శాతం చాలు. చార్టర్డ్ అకౌంటెంట్ ఉత్తీర్ణతతోపాటు, అనుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

వయస్సు: 22 నుంచి 35 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్లను అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం: ఆన్‌లైన్ రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ

పరీక్ష విధానం: 150 మార్కులకు ఆబ్జెక్టివ్ పరీక్ష ఉంటుంది. ఇందులో 20 మార్కులు ఇంగ్లిష్, 20 మార్కులు క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, 20 మార్కులు రీజనింగ్, 90 మార్కులు ప్రొఫెషనల్ నాలెడ్జ్‌కి ఉంటాయి.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ **చివరి తేదీ:** 2025 ఆగస్ట్ 30

వెబ్‌సైట్: https://bankofmaharashtra.in/

చిరు ప్రయత్నం ఫలించేనా?

- సమ్మె నేపథ్యంలో చిరంజీవిని కలసిన చిన్న నిర్మాతలు
- మెగాస్టార్ శుభవార్త చెబుతానన్నారు: నిర్మాత నట్టికుమార్
- నేడు ఫెడరేషన్‌తో చిరంజీవి చర్చలు?

తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించిన కార్మికుల వేతన పెంపు సమస్య తన పరిధిలో లేదనీ, దానిపై ఫిల్మ్ ఛాంబర్ నిర్ణయమే అంతిమం అని చిరంజీవి గతంలో సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అయితే రెండు వారాలుగా టాలీవుడ్ కార్మికుల సమ్మె కొనసాగుతున్నా ఇప్పటివరకూ ఫిల్మ్ ఛాంబర్ కానీ, నిర్మాతలు కానీ సమస్యకు పరిష్కారం సాధించలేకపోయారు. దీంతో టాలీవుడ్ పంచాయితీ మళ్లీ మెగాస్టార్ నివాసానికి చేరినట్లు ఆదివారం నాటి పరిణామాల నేపథ్యంలో తెలుస్తోంది. సయోధ్య కోసం కొందరు నిర్మాతలు ఆదివారం చిరంజీవిని ఆశ్రయించారు. ఇరువర్గాలతో సంప్రదింపులకు తాను సిద్ధమనీ, ఈ సమస్యకు తానో పరిష్కారం చూపుతానని చిరంజీవి అభయం ఇచ్చినట్లు నిర్మాతలు సి. కల్యాణ్, నట్టికుమార్ చెప్పారు. అదే నిజమైతే రెండు వారాలుగా కొనసాగుతోన్న సినీ కార్మికుల సమ్మె పరిష్కారం కోసం జరుగుతున్న ప్రయత్నాల్లో మరో ముందడుగు పడి, కార్మికుల సమ్మెకు ఓ పరిష్కారం దొరుకుతుందని ఇండస్ట్రీ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. అయితే సోమవారం చిరంజీవి ఫెడరేషన్‌తో చర్చలు జరుపుతారని నిర్మాత నట్టికుమార్ చెప్పిన మాటలపై కొందరు సంశయాన్ని వెలిబుచ్చుతున్నారు. గతంలో సమ్మె పరిష్కారం కోసం చిరంజీవి చొరవ చూపుతున్నారంటూ వచ్చిన వార్తలను ఆయన నిర్మొహమాటంగా ఖండించిన ఉదంతాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. అయితే నట్టికుమార్ మాట నిజమవుతుందా? చిరంజీవి శుభవార్త చెబుతారా? అనే ఆసక్తి మాత్రం ఇప్పుడు అంతటా నెలకొంది.



కార్మికులతో చిరంజీవి మాట్లాడతానన్నారు: సి. కల్యాణ్

టాలీవుడ్ కార్మికుల సమ్మె విషయంలో మొదట్నుంచి చిరంజీవి పేరు ప్రముఖంగా వినిపిస్తున్నా ఆయన మాత్రం బయట ఎక్కడా స్పందించింది లేదు. సమ్మె పరిష్కారం కోసం ఇండస్ట్రీలోని అగ్రనిర్మాతలంతా ఆదివారం చిరంజీవితో సమావేశమవుతారని శనివారం ఉధృతంగా ప్రచారం జరిగింది. ఏం జరిగిందో కానీ ఆదివారం అగ్ర నిర్మాతల్లో ఎవరూ చిరంజీవిని కలవలేదు. కానీ ఆదివారం ఉదయం నిర్మాత సి. కల్యాణ్ ఒక్కరే చిరంజీవిని ఆయన నివాసంలో కలిశారు. అనంతరం కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ 'కార్మికుల సమ్మె సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు చిరంజీవి గారు ప్రతి రోజూ మాతో మాట్లాడుతున్నారు. త్వరలోనే ఈ సమస్యకు ఓ పరిష్కారం దొరుకుతుందని ఆశిస్తున్నాను' అని చెప్పారు. 'ఒక పెద్దమనిషిగా ఇరు వర్గాలకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో చిరంజీవి ఉన్నారు, తనవంతుగా కార్మికులతో మాట్లాడతానన్నారు' అని తెలిపారు. 'చిన్న నిర్మాతలు బాగా ఇబ్బందులు పడుతున్నారు, నా అనుభవంతో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులను ఆయనకు వివరించాను. ఫెడరేషన్ గతంలోనే నిర్మాతల ప్రతిపాదనలను అంగీకరించినా, వారి బలహీనతల వల్లే అవేవీ అమల్లోకి రాలేదు సినిమా షూటింగ్స్ అనేవి ఓ కుటుంబ వాతావరణంలో జరగాలి తప్ప, కార్మిక చట్టాల ప్రకారం సినిమాలకు పనిచేయించడం కుదరదు' అని కల్యాణ్ అన్నారు.

చిరంజీవి మాట వింటామని ఫెడరేషన్ చెప్పింది: నట్టికుమార్

ఇదిలా ఉండగా ఆదివారం సాయంత్రం నిర్మాత నట్టి కుమార్ ఆధ్వర్యంలో పలువురు చిన్న నిర్మాతలు చిరంజీవిని కలిశారు. సినిమాల నిర్మాణంలో తాము ఎదుర్కొంటున్న కష్టాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా నట్టికుమార్ మీడియాతో మాట్లాడుతూ 'ఫెడరేషన్‌తో సమావేశమై వారి వాదన కూడా వింటాననీ, త్వరలోనే శుభవార్త చెబుతానని చిరంజీవి చెప్పారు. చిన్న సినిమాలకు ఇబ్బందిరాకుండా చూడాలని మేం ఆయన్ను కోరాం. నిర్మాతల ఇబ్బందులను వివరించాం. మా ప్రతిపాదనలకు చిరంజీవి సానుకూలంగా స్పందించారు, పరిష్కారం దిశగా ప్రయత్నిస్తానని భరోసా ఇచ్చారు. సోమవారం ఫెడరేషన్ నాయకులతో సమావేశమవుతానని చెప్పారు. 'చిరంజీవి ఏం చెబితే అది తూచా తప్పకుండా పాటిస్తామ'ని ఫెడరేషన్ చెప్పింది కాబట్టి ఈ సమస్య పరిష్కారమవుతుందని భావిస్తున్నాను' అని నట్టికుమార్ తెలిపారు. అయితే సి. కల్యాణ్, నట్టికుమార్ వ్యాఖ్యలపై గానీ, జరుగుతున్న పరిణామాలపై గానీ ఇప్పటివరకూ ఫిల్మ్ ఛాంబర్ కానీ, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ కానీ స్పందించలేదు. మరి చిరంజీవి స్వయంగా పూనుకొని, ఈ సమస్యకు ఓ పరిష్కారం చూపుతారా, కార్మికులతో సమ్మెను విరమింజేస్తారా, లేదా అనేది వేచిచూడాలి.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

పవన్.. రాజకీయ తుపాను



రజనీకాంత్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత, సినీ హీరో పవన్ కల్యాణ్‌ను సూపర్ స్టార్ రజనీకాంత్ రాజకీయ తుపాన్‌గా అభివర్ణించారు. ఆ మేరకు ఆయన ఎక్స్ ఖాతాలో ఆదివారం చేసిన ట్వీట్ వైరల్‌గా మారింది. తాజాగా రజనీకాంత్ 50 యేళ్ళ సినీ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సంగతి తెల్సిందే. ఆ సందర్భంగా రజనీకాంత్‌కు పవన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆ సందేశానికి రజనీకాంత్ ప్రతిస్పందించారు. 'ఏపీ ఉప ముఖ్యమంత్రి, నా సోదరుడు, పొలిటికల్ సైక్లోన్ పవన్ కళ్యాణ్ గారు... ప్రేమతో చెప్పిన విషెస్‌కు ఉప్పొంగిపోయా. మీ విషెస్‌ను ఓ గౌరవంగా భావిస్తున్నా. మీకు నా హృదయపూర్వక ధన్యవాదాలు' అని రజనీకాంత్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

నిధి డబుల్ ధమాకా


'హరిహర వీరమల్లు' చిత్రంతో ప్రేక్షకులను పలకరించారు నిధి అగర్వాల్. ఆమె ప్రస్తుతం 'రాజాసాబ్'లో కథానాయికగా నటిస్తున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా దర్శకుడు మారుతి ఈ హారర్ థ్రిల్లర్‌ను తెరకెక్కిస్తున్నారు. ఆదివారం నిధి అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. డిసెంబరు 5న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.



మరో హారర్ థ్రిల్లర్‌లో నిధి

నిధి అగర్వాల్ మరో హారర్ థ్రిల్లర్ చిత్రంలో నటించనున్నారు. ఆమె పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ ఈ చిత్రాన్ని ప్రకటించి, ఆమె లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. నిఖిల్‌కార్తీక్.ఎన్ దర్శకత్వంలో పుప్పాల అప్పలరాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దసరాకు టైటిల్‌ను ప్రకటించనున్నారు.





క్రీడా నేపథ్యంలో..

విజయ రామరాజు టైటిల్ రోల్ పోషించిన స్పోర్ట్స్ డ్రామా 'అర్జున్ చక్రవర్తి'. సిజా రోజ్ కథానాయిక. విక్రాంత్ రుద్ర దర్శకత్వంలో శ్రీని గుబ్బల నిర్మించారు. ఈనెల 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా మేకర్స్ 'అర్జున్ చక్రవర్తి' టైటిల్ సాంగ్‌ని ఆవిష్కరించారు. విక్రాంత్ రుద్ర సాహిత్యానికి విఘ్నేష్ భాస్కరన్ స్వరాలు సమకూర్చారు. దీపక్ బ్లూ, సత్యకుమార్, విఘ్నేష్ పాయ్ ఆలపించారు. ఈ చిత్రంలో హర్ష్ రోషన్, అజయ్, అజయ్ ఘోష్ కీలక పాత్రలు పోషించారు.



వినోదం ఖాయం

ఎన్.ఎన్.ఆర్.చౌదరి హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తోన్న చిత్రం 'నేను... నా లల్లి'. ఆదివారం చిత్రబృందం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ "నేను నా లల్లి' సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది. ఆద్యంతం ప్రేక్షకులను వినోదంలో ముంచెత్తడం ఖాయం. ఈ చిత్రంలో పాటలు కూడా రాశాను' అని చౌదరి తెలిపారు. కథానాయిక తస్లీమ్ మాట్లాడుతూ 'కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే పాత్ర నాది. చక్కటి సినిమా చూశామన్న అనుభూతి ప్రతి ఒక్కరికీ కలుగుతుంది' అని అన్నారు.

'హలగలి' యోధుని కథ

హీరో డాలీ ధనంజయ, సప్తమి గౌడ ప్రధాన పాత్రల్లో సుకేష్ నాయక్ దర్శకుడిగా చారిత్రక నేపథ్యంతో తెరకెక్కుతోన్న చిత్రం 'హలగలి'. యార్లగడ్డ లక్ష్మీ శ్రీనివాస్ సమర్పణలో కల్యాణ్ చక్రవర్తి ధూళిపాళ్ల నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ధనంజయను ఓ యోధుడిగా పరిచయం చేస్తూ గ్లింప్స్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా డాలీ ధనంజయ మాట్లాడుతూ "నిర్మాత కల్యాణ్, డైరెక్టర్ సుకేశ్ చాలా ప్యాషన్‌తో ఈ ప్రాజెక్టుని రూపొందిస్తున్నారు. తప్పకుండా సినిమా ఒక మంచి అనుభూతిని ఇవ్వబోతుంది. అందరి అంచనాలను అందుకుంటుంది' అని అన్నారు.

ఉత్తరేణి ఉపయోగాలెన్నో!

మన చుట్టూ మనకు ఉపయోగపడేవి ఎన్నో ఉంటాయి. కానీ వాటి గురించి తెలియక పనికి రావనుకుంటాం. అలాంటి ఓ మొక్కే ఉత్తరేణి. అందరూ దీనిని పిచ్చి మొక్క అంటూ పీకి పడేస్తూ ఉంటారు. కానీ దీని వలన అనేకప్రయోజనాలు ఉన్నాయి. ఆ వివరాలు తెలుసుకుందాం..



ఉత్తరేణి మొక్కను క్లాక్ ప్లాంట్ అని కూడా అంటారు. ఇది రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో, పొలాల్లో విరివిగా పెరుగుతుంది. ఈ మొక్కను అందరూ కలుపు మొక్కగా పరిగణించి పీకేస్తూ ఉంటారు. నేలంతా పరుచుకుంటూ ఒక మీటరు ఎత్తు పెరుగుతుందీ మొక్క. దీనికి పసుపు రంగు పూలు పుస్తాయి. వాటి నుంచి చిన్న కాయలు కాస్తాయి. ఈ మొక్క ఆకులు, పువ్వులను సంప్రదాయ వైద్యంలో వాడతారు. గాయాలు, చర్మ సమస్యలను పరిష్కరించేందుకు వినియోగిస్తారు. ఈ మొక్క వేరును జ్వరం, జీర్ణ సంబంధిత సమస్యలను తగ్గించేందుకు ఉపయోగిస్తారు. ఈ మొక్కలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ మైక్రోబియల్, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు కూడా ఉన్నాయి. ఈ మొక్క నేలంతా పరుచుకుని నేల కోతకు గురికాకుండా కాపాడుతుంది.


● డాక్టర్ శ్రీనాథ్,
వృక్ష శాస్త్రవేత్త, కన్హా శాంతివనం, హైదరాబాద్

ఇలాచేస్తే మచ్చలు మాయం..!

వాతావరణ కాలుష్యం వల్ల ముఖం మీద మొటిమలు వస్తుంటాయి. వీటివల్ల ఏర్పడే మచ్చలను మాయం చేయడంలో బియ్యప్పిండి ప్యాక్‌లు అద్భుతంగా పనిచేస్తాయి. వాటి గురించి తెలుసుకుందాం...



- ఒక గిన్నెలో రెండు చెంచాల బియ్యప్పిండి, చిటికెడు పసుపు, ఒక చెంచా పచ్చి పాలు వేసి పేస్టులా కలపాలి. పొడిచర్మం ఉన్నవారయితే ఒక చెంచా గులాబీ నీళ్ల కూడా కలుపుకోవచ్చు. ఈ పేస్టును ముఖానికి పట్టించి ఇరవై నిమిషాలు ఆరనివ్వాలి. తరువాత వేళ్లతో గుండ్రంగా రుద్దుతూ పిండిని తొలగించాలి. వెంటనే గోరువెచ్చని నీళ్లతో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తూ ఉంటే చర్మం మీద పేరుకున్న మృతకణాలు అలాగే మచ్చలు తొలగిపోయి ముఖం కాంతులీనుతుంది.
- ఒక గిన్నెలో రెండు చెంచాల బియ్యప్పిండి, ఒక చెంచా కలబంద గుజ్జు, ఒక చెంచా తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పట్టించి పావుగంటసేపు ఆరనివ్వాలి. తరవాత మంచినీళ్లతో శుభ్రం చేసుకోవాలి. తరచూ ఇలా చేస్తూ ఉంటే తగినంత తేమ అంది ముఖ చర్మం నిగారిస్తుంది. మచ్చలు, ముడతలు కూడా క్రమంగా తగ్గిపోతాయి.
- గిన్నెలో రెండు చెంచాల బియ్యప్పిండి, ఒక చెంచా నిమ్మరసం, ఒక చెంచా పెరుగు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి పావుగంటసేపు ఆరనివ్వాలి. తరవాత పదినిమిషాలు వేళ్లతో మర్ధన చేసి గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. రెండు రోజులకు ఓసారి ఇలా చేస్తూ ఉంటే ముఖం మీద మొటిమలు రావు. మచ్చలు, పిగ్మెంటేషన్ కూడా తగ్గుతాయి.



లక్ష్యం... మహిళా చైతన్యం

"చిన్నప్పుడు ఎన్నో కలలు... సోలో ట్రావెలింగ్ చేయాలని. పర్వతాలు అధిరోహించాలని. వాటిని నిజం చేసుకొనే క్రమంలో ఎన్నో అవహేళనలు, అవమానాలు. కానీ ఆత్మస్థైర్యంతో నిలబడి, కుటుంబం మద్దతుతో అన్నిటినీ అధిగమించాను. కామారెడ్డి జిల్లా సోమారం పేట మాది. అమ్మ భూలి... వ్యవసాయం చేస్తుంది. నేను, అన్నయ్య... ఇద్దరు సంతానం. కరోనా సమయంలో నాన్న చనిపోయారు. అప్పటి నుంచీ కుటుంబ భారం అమ్మపై పడింది. నేను బీకాం మొదటి సంవత్సరం చదువుతున్నా. ప్రస్తుతం మహిళా సాధికారత నినాదంతో సైకిల్ యాత్ర చేస్తున్నాను. దాంతోపాటు తప్పనిసరిగా సీటు బెల్టు, హెల్మెట్ ధరించాలని చెబుతూ వాహనదారుల్లో చైతన్యం నింపుతున్నాను. జూన్ 14న హైదరాబాద్‌లో ఈ యాత్ర ప్రారంభమైంది. ఈ నెల 16 నాటికి 2,871 కిలోమీటర్లు ప్రయాణించి, కరీంనగర్ చేరుకున్నాను. మొత్తం ఐదు వేల కిలోమీటర్ల ఈ యాత్రను శ్రీశైలంలో ముగించాలని అనుకొంటున్నా. వనపర్తి, జోగులాంబ గద్వాల్ తరువాత కర్నూలులోకి ప్రవేశించాను. నంద్యాల, తిరుపతి, ఒంగోలు, అరకు, విశాఖపట్టణం, శ్రీకాకుళం, ఇచ్ఛాపురం వరకు వెళ్లాను. ఏపీలోని దాదాపు అన్ని ప్రధాన పట్టణాలకూ వెళ్లాను. రోజుకు సగటున 60 నుంచి 70 కిలోమీటర్లు ప్రయాణిస్తున్నా. ఉదయం ఆరు గంటలకు మొదలుపెట్టి, సాయంత్రం ఆరు గంటలకు ఆపేస్తాను. యాత్ర కోసం కాలేజీలో మూడు నెలలు అనుమతి తీసుకున్నా. వాతావరణ మార్పులవంటి అనూహ్య పరిస్థితులు ఎదురైతే దూరం, సమయం పెరగవచ్చు.

నీవల్ల కాదన్నవారే...

నేను పర్వతారోహణ చేస్తానంటే కొందరు నీవల్ల ఏమవుతుందని అన్నారు. సోలో ట్రావెలింగ్ ఎంచుకొంటే తక్కువ చేసి మాట్లాడారు. నేను కాస్త పొట్టిగా



ఉంటాను. కనుక ఇలాంటివి నేను చేయలేనని కొందరు నిర్ధారణకు వచ్చేశారు. అసలు కారణం... ఒక ఆడపిల్ల ఇంతటి సాహసం చేయడం అలాంటివాళ్లకు నచ్చదు. ఎత్తి పొడుపు మాటలతో నిరుత్సాహపరచాలని చూస్తారు. నా కలలను నిజం చేసుకోవడానికి, నన్ను నేను నిరూపించుకొని, నాలాంటి ఆడపిల్లలను తక్కువ అంచనా వేసి, చులకనగా చూసేవారి నోళ్ల మూతలు పడేలా సమాధానం చెప్పడానికి సోలో ట్రావెలింగ్ మొదలుపెట్టాను. మహిళా సాధికారత నినాదం తీసుకున్నాను. పర్వతారోహణలో కూడా శిక్షణ తీసుకున్నాను. అప్పుడు కూడా కొందరు... 'నువ్వు నీ బ్యాగ్ అంత ఎత్తు లేవు. దాన్ని ఎత్తడమే నీకు కష్టం. ఇక మౌంటెనీరింగ్ ఏం చేస్తావ్' అంటూ అవమానించారు. ఆ మాటలు నాలో కసిని, పట్టుదలను పెంచాయి. రెండేళ్ల కిందట ఆఫ్రికాలోనే అత్యంత ఎత్తయిన కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి చూపించాను. నాడు విమర్శించినవారే అభినందనలు తెలిపారు.

కార్గిల్ టు కన్యాకుమారి...

ఇదే నా మొదటి సైకిల్ రైడ్ కాదు. 2022లో ఆధ్యాత్మిక గురువు జగ్గీ వాసుదేవ్ ఇచ్చిన 'సేవ్ సాయిల్' (మట్టిని కాపాడదాం) నినాదంతో తెలంగాణ మొత్తం... ఐదు వేల కిలోమీటర్లు చుట్టివచ్చాను. గత ఏడాది పద మూడు మంది బృందంతో కలిసి కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు పర్యటించాను. 3,800 కిలోమీటర్ల ఆ యాత్రను 23 రోజుల్లో పూర్తి చేశాం. అయితే ఒక మహిళగా రెండు మూడు నెలలపాటు ఇల్లు వదిలి, ఒంటరిగా ప్రయాణించడం అంటే సాధారణ విషయం కాదు. ఎన్నో ఇబ్బందులు, సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఎక్కువగా నేను రాత్రి పూట పెట్రోలు బంకుల్లో క్యాంప్ టెంట్ వేసుకొని బస చేస్తుంటాను. దానివల్ల ఖర్చు తగ్గుతుంది. కుదరకపోతే హోటల్‌లో రూమ్ తీసుకొంటాను. ఒక్కోసారి కొందరు తమ ఇళ్లకు ఆహ్వానిస్తారు. ఎక్కడ బస చేసినా... నా లొకేషన్ ఇంట్లోవాళ్లకు పంపిస్తాను. వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేస్తాను. నాకున్న ప్రధాన లక్షణం ఏంటంటే... దేనికీ భయపడను.

> **ఎవరెస్ట్ అధిరోహించాలి...**
>
> ప్రస్తుత యాత్ర తరువాత ఆలిండియా సైకిల్ రైడ్ చేయాలని ఉంది. అలాగే ఎవరెస్ట్ పర్వతం అధిరోహించాలనేది నా చిరకాల స్వప్నం. అయితే అందుకు తగిన నిధులు లేక సన్నాహకాలు ఇంకా ప్రారంభించలేదు. కిలిమంజారో ఎక్కాలనుకున్నప్పుడు నిధులు సమకూర్చుకోవడానికి నాలుగేళ్లు పట్టింది. తరువాత కూడా పర్వతారోహణ కొనసాగించాలని అనుకున్నా. కానీ ఎంత ప్రయత్నించినా డబ్బు సర్దుబాటు కాకపోవడంతో సైకిల్ యాత్ర మొదలుపెట్టాను. ఎప్పటికైనా ఎవరెస్ట్ కలను నిజం చేసుకొంటాను.

సవాళ్లు ఎన్నో...

ఏకధాటిగా సైకిల్ తొక్కడమంటే సులువు కాదు. ఎన్నో సవాళ్లు ఎదురవుతాయి. ఒళ్లు నొప్పులు, వ్యాధులు వచ్చే అవకాశాలు అధికం. రహదారి మీద భారీ వాహనాలు వేగంగా తిరుగుతుంటాయి. కొంత మంది మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తుంటారు. ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలి. లేదంటే ప్రాణాలకే ముప్పు. మధ్యలో సైకిల్‌కు రిపేర్లు వస్తుంటాయి. టైర్లు పగిలిపోతుంటాయి. నేను బాగా ఇబ్బంది పడింది... అరకు ఘాట్ రోడ్డులో. ఎగువకు వెళ్లేటప్పుడు సైకిల్‌ను బలంగా తొక్కాలి. దానివల్ల ఎక్కడ చైన్ తెగిపోతుందోననే భయం. ఇప్పటివరకు ఆ ఘాట్‌లో ఎవరూ సైక్లింగ్ చేయలేదట. అలాంటిది నేను చేశానంటే గర్వంగా అనిపించింది.

భయపడితే సాధించలేం...

నిరుత్సాహపరిచేవారు ప్రతిచోటా ఉంటారు. కానీ వారి మధ్యనే ప్రోత్సహించేవారూ ఉంటారు. 'ఒక అమ్మాయి ఇంతటి సాహసం చేస్తోంది. సమాజ హితం కోసం తనవంతుగా ప్రయత్నిస్తోంది' అని చాలామంది అభినందిస్తుంటారు. నా వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తుంటాను. అవి చూసి నాలాంటివారు కొందరు స్ఫూర్తి పొందామని మెసేజ్‌లు పెడుతుంటారు. కొందరేమో 'నాకూ అలాంటి కలలు ఉన్నాయి. కానీ పెద్దవాళ్లు వద్దంటున్నారు' అని నిరాశతో మాట్లాడుతుంటారు. వాళ్లకు నేను చెప్పేది ఒక్కటే... మహిళ ఎదుగుదలలో కుటుంబ మద్దతు ముఖ్యమనేది నా అభిప్రాయం. ఒకవేళ ఇంట్లోవాళ్లు కాదంటే వాళ్లను ఒప్పించాలి. మా అమ్మవాళ్లు కూడా మొదట్లో వద్దన్నారు. పర్వతారోహణ అంటే... ప్రాణాలు పోయే ప్రమాదం ఉంటుందన్నారు. 'మరణం ఎప్పుడో అప్పుడు రావాల్సిందే. దానికి భయపడుతూ కలలు, ఆశయాలు పక్కన పెట్టడం తగద'ని నచ్చజెప్పాను. అర్థం చేసుకున్నారు. ఇప్పుడు నా సాహసం చూసి గర్వపడుతున్నారు."

● హనుమా

నేతన్నల ఇంటి దీపమై...

మన దేశంలోని ప్రతి ప్రాంతానికి తమవైన విలక్షణ కళారూపాలు ఉన్నాయి. ముఖ్యంగా చేనేత కళాకారుల నైపుణ్యం ఎక్కడికక్కడే ప్రత్యేకంగా కనిపిస్తుంది. ఆ కళాకారుల ఉత్పత్తులను ఒకే చోట చేర్చి, వారికి స్థిరమైన ఆదాయం లభించేలా చేస్తున్నారు దీపా కృష్ణన్. "రాబోయే తరాల కోసం మన సంస్కృతిని పరిరక్షించడమే నా ఆశయం' అంటున్న ఆమె దేశవ్యాప్తంగా క్రాఫ్ట్ టూర్స్‌ను, వర్క్‌షాపులను కూడా నిర్వహిస్తున్నారు.



"ప్రపంచం ఆధునికత వెంట పరుగులు పెడుతోంది. ఈ ప్రభావం అన్ని రంగాల్లోనూ కనిపిస్తోంది. ముఖ్యంగా... మన హస్త కళా సంప్రదాయాలు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయి. కళాకారులకు తగిన ప్రతిఫలం లభించకపోవడమే దీనికి ప్రధాన కారణం" అంటారు దీపా కృష్ణన్. ముంబయి కేంద్రంగా పని చేస్తున్న ఆమె సంస్థ 'ద మ్యాజిక్ రూమ్' దేశంలోని వివిధ ప్రాంతాల చేనేత కళా రూపాలన్నింటినీ ఒకే చోటికి చేర్చే ప్రయత్నం చేస్తోంది. కొన్ని వందల మంది కళాకారులకు ఆర్థికంగా భరోసా ఇస్తోంది.

ఒడుదొడుకులను తట్టుకొని...

ముంబయిలో పుట్టి పెరిగిన దీపకు చేనేత వస్త్రాలంటే ప్రాణం. 'నేషనల్ టాస్క్ ఫోర్స్ ఆన్ హ్యాండ్లూమ్స్'లో ఆమె సభ్యురాలు. "కొత్త ప్రదేశాలను సందర్శించడం నాకు చాలా ఇష్టం. అందులోనే కెరీర్ వెతుక్కోవాలని... ఇరవయ్యేళ్ళ క్రితం ఒక టూరిజం కంపెనీ స్థాపించాను. దేశంలో పలు ప్రాంతాలకు వెళ్ళినప్పుడు... గ్రామీణ ప్రాంతాల్లోని చేనేత కళాకారులు, డిజైనర్లు, వ్యాపారులతో పరిచయాలు ఏర్పడ్డాయి. భారతీయ చేనేత వస్త్రాల వైవిధ్యం సాటిలేనిదని అప్పుడే అర్థమయింది" అంటున్నారు దీప. కరోనా కారణంగా... ఆ కంపెనీ కార్యకలాపాలు నిలిచిపోయాయి. అప్పుడే ఆమె దృష్టి చేనేత కళమీద పడింది. 'ద మ్యాజిక్ రూమ్' పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేశారు. ముంబయి, ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోని చేనేత కళాకారులతో వస్త్రాలు తయారు చేయించారు. మరోవైపు అల్పాదాయ వర్గాల మహిళలకు వివిధ హస్త కళల్లో శిక్షణ ఇప్పించారు. వారికి స్థిరమైన ఆదాయం లభించేలా చేశారు. అయితే ఇది అంత సులువుగా జరిగిపోలేదు. ముఖ్యంగా ఆర్థికమైన సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చింది. కానీ ఆ ఒడుదొడుకులన్నిటినీ తట్టుకొని... తన లక్ష్యం వైపు ఆమె పయనించారు.

అది మన బాధ్యత...

"భారతదేశంలోని హస్త కళారూపాలన్నీ, ప్రధానంగా అన్ని రకాల చేనేత వస్త్రాలు ఒకే చోట లభించేలా చూడాలనేది నా కల. దీనికోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, గుజరాత్, బిహార్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్... ఇలా వివిధ రాష్ట్రాలు తిరిగాను. చేనేత కళాకారులకు పెట్టుబడి అందించి... వివిధ రకాల వస్త్రాలు తయారు చేయించాను. పులియాకు చెందిన చేనేత జమ్దానీ, కచ్‌కు చెందిన అజ్రక్, అసోంకు చెందిన ఎరీ సిల్క్, శాంతినికేతన్ నుంచి కాంతా దుపట్టా, మధుబని హ్యాండ్ ప్రింటెడ్ తుస్సార్ సిల్క్... ఇలా ఎన్నో రకాల వస్త్రాలను తయారు చేయించి, ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో విక్రయిస్తున్నాను. దీని ద్వారా 500 మందికి పైగా కళాకారులకు నిలకడైన ఉపాధి లభిస్తోంది. చేనేత సహకార సొసైటీలు, ఎన్జీవోలు, ఉత్పత్తి బృందాలు, స్వతంత్రంగా పని చేసే కళాకారులు... ఇలా ఎంతో మందితో మేము కలిసి పని చేస్తున్నాం. హ్యాండ్లూమ్ అనేది కేవలం ఒక వస్త్రం కాదు... దానికి ఒక తనదైన చరిత్ర, గుర్తింపు ఉన్నాయి. వాటిని కాపాడుకోవడం మన బాధ్యత. అందుకే దీన్ని నేను వ్యాపారంగా పరిగణించడం లేదు" అని చెబుతున్నారు దీప. వచ్చే ఆదాయంలో ఎక్కువభాగం హస్తకళలకు ప్రాచుర్యం కల్పించడానికి, ప్రోత్సాహం అందించడానికి ఆమె ఖర్చు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా క్రాఫ్ట్, టూర్స్, వర్క్‌షాప్స్ నిర్వహిస్తున్నారు. "మన కళల ప్రాధాన్యం, వాటి మూలాలు పట్టణ ప్రజలకు తెలియాలి. అప్పుడే వారు వాటితో మమేకం అవుతారు" అంటున్న దీప తమ 'మ్యాజిక్ హబ్'ను భారతీయ కళా, సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు వేస్తున్నారు.

పిల్లలను బాధ్యతాయుతంగా పెంచాలి..!

తల్లిదండ్రుల పెంపకం మీదనే పిల్లల భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. అందుకే చిన్నప్పటి నుంచీ పిల్లలకు క్రమశిక్షణ, మంచి అలవాట్లు నేర్పించాలి. పిల్లలను బాధ్యతాయుతంగా పెంచడంలో తల్లిదండ్రులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...



- పిల్లలతో స్నేహపూర్వకంగా మెలగాలి. వాళ్లమీద కోపంతో అరవకూడదు. అజమాయిషీ చేయకూడదు. పిల్లలకు స్నేహ హస్తాన్ని అందిస్తూనే తప్పులను సరిచేస్తూ జాగ్రత్తగా వ్యవహరించాలి. ఇంట్లో సంతోషకరమైన వాతావరణం ఉండేలా చూసుకోవాలి. అప్పుడే పిల్లలు తమ భావాలను స్పష్టంగా చెప్పగల్గుతారు.
- పిల్లలను ఇతరులతో పోల్చకూడదు. పిల్లల్లో ఉన్న ప్రత్యేకమైన తెలివితేటలను ఆసక్తిని గుర్తించి తగిన ప్రోత్సాహన్ని అందించాలి.
- చెప్పిన పనులు చేయకుండా ఒక్కోసారి పిల్లలు మొండికేస్తూ ఉంటారు. అలాంటి సమయాల్లో పిల్లలను దగ్గర కూర్చోపెట్టుకుని బుజ్జగింపు ధోరణిలో పనులు చెప్పి చేయించాలి. ఆ పనులు పూర్తిచేసిన తరువాత కృతజ్ఞతా పూర్వకంగా మాట్లాడితే పిల్లలు సంబరపడతారు. మరోసారి చెప్పిన వెంటనే పనులు చేసేస్తారు కూడా!
- తోటివారితో స్నేహంగా ఉండడం, అవసరమైతే సహాయ సహకారాలు అందించడం లాంటివాటిని పిల్లలకు నేర్పించాలి. కష్టపడడం, నాయకత్వ లక్షణాలు, సమష్టి కృషి ఆవశ్యకతలను వివరించాలి.
- సొంత అభిరుచులు, ఆశయాలను పిల్లలమీద రుద్దకూడదు. దీనివల్ల పిల్లల్లో ఒత్తిడి పెరిగి వారి సృజనాత్మక శక్తి దెబ్బతింటుంది. పిల్లల అభిప్రాయాలను అడిగి తెలుసుకోవాలి. వాళ్లకి ఇష్టమైన రంగంలో ఎదిగేలా తోడ్పాటును అందించాలి. ఇలాంటి బాధ్యత పిల్లల మనసుల్లో చెరగని ముద్ర వేస్తుంది.

కాళ్లతో బాణాలు వేస్తూ...

ప్రేరణ



చాలామంది చిన్న చిన్న సమస్యలకే భయపడి వెనకడుగు వేస్తారు. కానీ జమ్మూ కాశ్మీరుకు చెందిన శీతల్ దేవి, తనలోని శారీరక లోపాన్ని అధిగమించి, నలుగురికీ స్ఫూర్తినిస్తున్నారు. రెండు చేతులూ లేకపోయినా కాళ్లతో బాణాలు వేస్తూ పతకాలు కొల్లగొడుతున్న ఆమె ప్రస్థానమిది..

శీతల్ దేవి.. జమ్మూకశ్మీర్‌లోని ఓ మారుమూల ప్రాంతంలో నిరుపేద కుటుంబంలో పుట్టారు. తండ్రి వ్యవసాయం చేస్తే, తల్లి మేకల కాపరిగా కష్టపడుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. శీతల్‌కు పుట్టుకతోనే రెండు చేతులు లేవు. దాంతో ఆమె తల్లిదండ్రులు ఎంతో బాధపడ్డారు. అయినా కూతురికి ధైర్యం చెప్పి అన్ని విషయాల్లో ప్రోత్సహించారు. తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడు ఓసారి వైద్యం కోసం బెంగళూరు వెళ్లారు శీతల్. అక్కడే ఆమెకు ప్రీతి అనే ఆర్చర్ పరిచయమయ్యారు. ప్రీతి, శీతల్‌కు పారా క్రీడల గురించి, పారా ఆర్చరీ గురించి చెప్పారు. అలా శీతల్‌కు ఆర్చరీ పరిచయమయింది. తరువాత శీతల్.. జమ్మూలోని శ్రీ మాత వైష్ణో దేవీ ష్రైన్ బోర్డ్‌కు వెళ్లారు. "అక్కడ నాలా శారీరక లోపాలే కాక మానసిక సమస్యలున్నవారు కూడా ఆర్చరీ నేర్చుకోవడం చూసి ప్రేరణ పొందాను. మొదట్లో ఆర్చరీ కష్టంగా అనిపించింది.. నావల్ల కాదేమో అనిపించింది.. కానీ మా కోచ్‌లు కుల్దీప్, అభిలాష్ చౌదరి నన్నెంతో ప్రోత్సహించారు. కాళ్లతో విలు విద్య సాధ్యమేనని నాలో ధైర్యం నూరిపోశారు. చేతులు లేకపోయినా కాళ్లతో బాణాలు వేసే ప్రపంచంలోని తొలి ఆర్చర్‌గా గుర్తింపు పొందిన, అమెరికన్ ఆర్చర్, మాట్ స్టుట్జ్‌మ్యాన్ వీడియోను కుల్దీప్ నాకు చూపించారు. అది చూశాక నాలో పట్టుదల పెరిగింది" అని చెప్పుకొచ్చారు శీతల్. ఆమెలోని పట్టుదలను చూసిన కోచ్ కుల్దీప్, ఆమె కోసం ప్రత్యేకమైన విల్లును తయారు చేయించారు. తరువాత ఆరునెలల్లోనే విలు విద్యలో శీతల్ దేవి ఆరితేరారు. "ఆర్చరీ నా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. ఆర్చరీ వలనే నేను ఎంతో మందికి తెలిశాను. వేరే వారిని చూసి నేను ప్రేరణ పొందాను. అలాంటి నేను ఇప్పుడు ఇంకొందరికి ప్రేరణ కావడం చాలా ఆనందంగా ఉంది" అంటున్నారు శీతల్.

> **ఆడపిల్లల్ని ప్రోత్సహించాలి..**
>
> 
>
> "సాధారణంగా గ్రామాల్లో ఆడపిల్లలను బయటకు రానివ్వరు. ఆడవాళ్లు ఏం సాధించగలరని అనుకుంటూ ఉంటారు. కానీ ఆడవాళ్లు ఏమైనా సాధించగలరు. దేశానికి పతకాలు కూడా తీసుకురాగలరు. అయితే అవన్నీ జరగాలంటే మొదట తల్లితండ్రులు తమ కూతుళ్లను నమ్మాలి. ఆపై ప్రోత్సహించాలి. అలాగే సమయం చాలా విలువైనది. ఆలోచిస్తూ సమయం వృధా చేసుకోకూడదు. ఓటమికి భయపడకూడదు. ఓడినా దాని నుంచి పాఠం నేర్చుకుని విజయం వైపు సాగాలి" అంటున్నారు శీతల్.

ఎన్నో పతకాలు..

ప్రపంచవ్యాప్తంగా చేతులు లేకపోయినా విలువిద్యలో రాణిస్తున్న అతికొద్ది మందిలో శీతల్ ఒకరిగా నిలిచారు. పలు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ఆమె పతకాలు సాధించారు. యూరోపియన్ పారా ఆర్చరీ కప్‌లో రజతం, వరల్డ్ పారా ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో రజతం, ఏసియన్ పారా గేమ్స్ 2022లో రెండు స్వర్ణ పతకాలు, ఒక రజత పతకం తన ఖాతాలో వేసుకున్నారు. గతేడాది ప్యారిస్ పారా ఒలింపిక్స్‌లోనూ కాంస్యం సాధించారు. గతేడాది రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా శీతల్.. అర్జున అవార్డు అందుకున్నారు.

కొత్తిమీర తాజాగా...

మనం రోజూ వంటకాల్లో కొత్తిమీరను ఉపయోగిస్తూ ఉంటాం. అందుకే బజార్లో తాజాగా కనిపించినప్పుడు పెద్ద కట్టలను తెచ్చుకుని ఫ్రిజ్‌లో పెట్టుకుంటూ ఉంటాం. కానీ రెండు రోజులకే కొత్తిమీర కుళ్లిపోతూ ఉంటుంది. అలా కాకుండా కొత్తిమీర వారం పాటు తాజాగా ఉండేలా ఎలా నిల్వ చేసుకోవాలో తెలుసుకుందాం...



- పొడవాటి గాజు గ్లాసును తీసుకుని దాని నిండా నీటిని నింపాలి. అందులో కొత్తిమీర కాడలు మునిగేలా కట్టను గ్లాసులో నిలబెట్టాలి. ఆకులకు నీళ్ల తగలకూడదు. ఈ గ్లాసుమీద ఒక ప్లాస్టిక్ కవర్ కప్పి దాన్ని చల్లని ప్రదేశంలో ఉంచాలి. ఈ గ్లాస్‌ని ఫ్రిజ్‌లో కూడా పెట్టవచ్చు. ఇలా చేస్తే కొత్తిమీర చాలా రోజుల వరకు తాజాగా ఉంటుంది.
- కొత్తిమీరను తెచ్చిన వెంటనే కడగకూడదు. దాన్ని ఓ పేపర్ లేదా పలుచని గుడ్డమీద పరచి తడి మొత్తం ఆరనివ్వాలి. తరువాత దాని వేర్లు, కాడలు కొద్దిగా కత్తిరించాలి. ఎండిన, కుళ్లిన ఆకులను తీసివేయాలి. ఇలా శుభ్రం చేసిన కొత్తిమీరను పొడి గుడ్డ లేదా కాగితంలో చుట్టి ఫ్రిజ్‌లో పెడితే పది రోజుల వరకు తాజాగా ఉంటుంది. దీన్ని గాలి జొరబడని ప్లాస్టిక్ డబ్బాలో కూడా పెట్టవచ్చు. ఈ డబ్బాను ఫ్రిజ్‌లో పెడితే లోపల తేమ చేరుతుంది కాబట్టి డబ్బాలో ఓ కాగితాన్ని ఉంచడం మంచిది. ఇలా తేమ తగలకుండా జాగ్రత్త చేస్తే కొత్తిమీర తాజాగా నిల్వ ఉంటుంది.

సెలెక్టర్లకు సవాల్

● పోటీలో గిల్, జైస్వాల్, అయ్యర్, సిరాజ్
● క్లిష్టంగా మారిన ఆసియా జట్టు ఎంపిక



న్యూఢిల్లీ: ఆసియా కప్‌నకు భారత జట్టు ఎంపిక సెలెక్టర్లకు కత్తిమీద సాములా మారింది. రెగ్యులర్ టీ20 ఆటగాళ్లతో పాటు యువ స్టార్లు శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, శ్రేయాస్ అయ్యర్, మహ్మద్ సిరాజ్‌తోపాటు సీనియర్ పేసర్ బుమ్రా కూడా టోర్నీకి అందుబాటులో ఉండనున్నారు. వీళ్లంతా ఈ ఏడాది ఫిబ్రవరిలో స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో ఆడలేదు. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో వీరిలో ఎవరినీ పక్కనబెట్టే పరిస్థితి లేకపోవడంతో.. సమతూకమైన జట్టును ఎంపిక చేయడం సెలెక్టర్లకు సవాల్‌గా మారింది. జట్టు ఎంపిక కోసం మంగళవారం సెలెక్టర్లు సమావేశమయ్యే అవకాశం ఉంది. వచ్చేనెల 9 నుంచి దుబాయ్‌లో జరిగే ఆసియా కప్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో రెండు లేదా అంతకుమించి మ్యాచుల్లో టీమిండియా తలపడాల్సి రావచ్చు. ఈ నేపథ్యంలో జట్టు ఎంపికలో ఎలాంటి తేడా వచ్చినా తీవ్ర విమర్శలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి. ఇటీవలే ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో కెప్టెన్‌గా సత్తా చాటిన గిల్ హఠాత్తుగా పొట్టి ఫార్మాట్ రేసులోకి వచ్చాడు. ఆ టూర్ నుంచి రాగానే దులీప్ ట్రోఫీ ఆడకుండానే విశ్రాంతి తీసుకున్న అతను ఏ ఫార్మాట్‌లోనైనా ఆడేందుకు సిద్ధమంటూ బోర్డుకు గిల్ సందేశం కూడా పంపాడు. వాస్తవంగా గిల్ అంతర్జాతీయ టీ20లు ఆడి ఏడాది దాటింది. పొట్టి వరల్డ్‌కప్‌లో ట్రావెల్ రిజర్వ్‌గా వ్యవహరించాడు. అయితే, సూపర్ ఫామ్‌లో ఉన్న గిల్‌ను పక్కనబెట్టే సాహసం సెలెక్టర్లు చేస్తారా? ఒకవేళ అతడిని జట్టులోకి తీసుకుంటే ఏ స్థానంలో ఆడించాలనేది పెద్ద ప్రశ్నార్థకం. టీ20ల్లో అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ ఓపెనర్లుగా వ్యవహరిస్తుండగా.. తిలక్ వర్మ, సూర్యకుమార్, శివమ్ దూబే, రింకూ సింగ్, హార్దిక్ పాండ్యాతో బ్యాటింగ్ లైనప్ బలంగా ఉంది. గిల్‌ను తీసుకోవాలంటే వీరిలో ఒకరిపై వేటు వేయాలి. పేసర్ సిరాజ్ పరిస్థితి కూడా ఇలాంటిదే. ఏడాదికిపైగా టీ20లకు దూరంగా ఉన్నాడు. కానీ, ఇంగ్లండ్‌తో సిరీస్‌లో అతడి ప్రదర్శన ఎంతో ఆకట్టుకొంది. అయితే, ఐపీఎల్‌లో పెద్దగా రాణించకపోవడం సిరాజ్‌కు కొంత మైనస్‌గా మారే అవకాశం ఉంది. పొట్టి క్రికెట్‌లో బుమ్రాను ఏమాత్రం పక్కనబెట్టలేని పరిస్థితి. జైస్వాల్, శ్రేయాస్ అయ్యర్ రేసులోనే ఉన్నా.. వారిని జట్టులోకి తీసుకోవడం అంత సులువైన విషయం కాదు.

నేను ఆడతాను!



స్టార్ పేసర్ బుమ్రా పనిభారంపై రకరకాల ఊహాగానాలు వినవస్తున్నాయి. అయితే, ఆసియా కప్‌నకు తాను అందుబాటులో ఉంటానని భారత క్రికెట్ బోర్డుతో పాటు అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీకి బుమ్రా సమాచారం ఇచ్చినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇటీవలే ముగిసిన ఇంగ్లండ్ టూర్‌లో బుమ్రా ఫిట్‌నెస్ సమస్యలతో ఇబ్బందులు పడ్డాడు. గతేడాది టీ20 వరల్డ్‌కప్ ఫైనల్ తర్వాత బుమ్రా మళ్లీ అంతర్జాతీయ పొట్టి క్రికెట్ ఆడలేదు. చాంపియన్స్ ట్రోఫీకి కూడా దూరమయ్యాడు. అయితే, బుమ్రా రాకతో భారత బౌలింగ్ మరింత బలంగా మారుతుంది. కాగా, దుబాయ్ పరిస్థితులకు అలవాటు పడటానికి టోర్నీకి కొన్ని రోజుల ముందే టీమిండియాను అక్కడికి పంపాలని బీసీసీఐ భావిస్తున్నట్టు తెలిసింది.

10 సెకన్లకు రూ. 14 లక్షలు

ఆసియా కప్‌లో చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ తలపడనుండడంతో టోర్నీకి మరింత క్రేజ్ పెరిగింది. దీంతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టోర్నీ ప్రసార హక్కులు దక్కించుకున్న సోనీ నెట్‌వర్క్ భావిస్తోంది. ఇదే అదనుగా.. టోర్నీలో ప్రకటనల రేట్లను కూడా భారీగా పెంచినట్లు తెలుస్తోంది. టోర్నీలో భారత్ ఆడే మ్యాచ్‌ల సమయంలో కేవలం పది సెకన్ల ప్రకటనకు రూ. 14 నుంచి 16 లక్షలు ధర నిర్ణయించినట్టు సమాచారం. ఇదే ధర ఇండో-పాక్ మ్యాచ్‌లకు కూడా వర్తిస్తుందని ప్రకటనలు ఇచ్చే సంస్థలకు వెల్లడించిందట.

మరో మూడు మార్పులతో..

దేశవాళీ క్రికెట్ నిబంధనలు

న్యూఢిల్లీ: దేశవాళీ క్రికెట్‌లో బీసీసీఐ మరిన్ని నిబంధనలను ప్రవేశపెట్టనుంది. తీవ్రంగా గాయపడిన ఆటగాడి స్థానంలో మరో ప్లేయర్‌ను ఆడించవచ్చనే నిర్ణయం తీసుకున్న మరుసటి రోజే బోర్డు మరో మూడు నిబంధనలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇకనుంచి ఎవరైనా ఉద్దేశపూర్వకంగా షార్ట్ రన్ తీస్తే స్ట్రయికర్ ఎవరు ఉండాలనే నిర్ణయం ప్రత్యర్థి కెప్టెన్ చేతుల్లోనే ఉంటుందని స్పష్టం చేసింది. ఎక్కువ పరుగులు తీసే క్రమంలో బ్యాటర్లు ఒక్కోసారి క్రీజులో బ్యాట్ పెట్టకుండానే పరిగెడుతుంటారు. అవతలి ఎండ్‌లో టెయిలెండర్ ఉంటే ప్రధాన బ్యాటర్లు తనకు స్ట్రయికింగ్ రావాలనే ఉద్దేశంతో కావాలనే ఇలా చేస్తుంటారు. ఇకనుంచి అలాంటి సమయాల్లో తర్వాతి బంతికి బ్యాటింగ్ ఎవరు చేయాలనేది అవతలి జట్టు కెప్టెన్ నిర్ణయం తీసుకుంటాడు. అయితే ఆ క్రికెటర్ కావాలనే షార్ట్ రన్ చేశాడని అంపైర్ తేల్చాల్సి ఉంటుంది. ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్‌లో షార్ట్ రన్ తీస్తే ఐదు పరుగుల పెనాల్టీ విధిస్తున్నారు.

మ్యాచ్ మధ్యలో వెళితే..: ఇకనుంచి మ్యాచ్ మధ్యలో బ్యాటర్ రిటైర్ అయి మైదానం వీడితే తిరిగి అతడిని అనుమతించరు. ప్రత్యర్థి కెప్టెన్ అభ్యంతరం చెప్పకపోయినా ఆడించడం కుదరదని బోర్డు తేల్చింది. అతడి ఇన్నింగ్స్‌ను రిటైర్ అవుట్‌గా ప్రకటిస్తారు. కానీ 25.4.2 నిబంధన ప్రకారం గాయం కారణంగా క్రీజును వీడితే మాత్రం తిరిగి బ్యాటర్ ఆడేందుకు వీలుంటుంది. దీంతోపాటు ఐసీసీ ఇటీవల ప్రవేశపెట్టిన వన్డేల్లో రెండు బంతుల విధానాన్ని బోర్డు.. విజయ్ హజారే ట్రోఫీలో అమలు చేయనుంది. ఈ రూల్ ప్రకారం 1 నుంచి 34 ఓవర్ల మధ్య రెండు ఎండ్‌ల నుంచి కొత్త బంతులతో ఆడిస్తారు. ఆ తర్వాత 35వ ఓవర్ నుంచి మాత్రం ఆ రెండింట్లో ఏదో ఒక బంతిని మాత్రమే ఫీల్డింగ్ టీమ్ ఎంచుకోవాల్సి ఉంటుంది.

బాబర్, రిజ్వాన్ లేకుండానే..



కరాచీ: పాకిస్థాన్ స్టార్ క్రికెటర్లు బాబర్ ఆజమ్, మహ్మద్ రిజ్వాన్‌లకు ఆ దేశ క్రికెట్ బోర్డు మరోసారి షాక్ ఇచ్చింది. వచ్చే నెలలో జరుగబోయే ఆసియా కప్ టీ20 టోర్నీ కోసం ప్రకటించిన జట్టులో వీరికి చోటివ్వలేదు. గతేడాది టీ20 వరల్డ్‌కప్‌లో పాక్ గ్రూప్ దశలోనే తిరుగుముఖం పట్టడంతో ఈ ఫార్మాట్‌లో వీరి ప్రాతినిధ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. దక్షిణాఫ్రికాతో గత డిసెంబరులో ఇద్దరూ చివరి టీ20 ఆడారు. అప్పటి నుంచి బాబర్, రిజ్వాన్ లేకుండానే పాక్ పొట్టి ఫార్మాట్‌లో తలపడుతోంది. ప్రస్తుతం అదే పద్ధతి కొనసాగిస్తూ సల్మాన్ ఆఘా నేతృత్వంలో 17 మంది ఆటగాళ్లతో జట్టును పాక్ వెల్లడించింది. ఆసియాకప్‌కన్నా ముందే ఇదే జట్టు ఆతిథ్య యూఏఈ, అఫ్ఘానిస్థాన్‌లతో ముక్కోణపు సిరీస్‌లో ఆడనుంది.

జట్టు: సల్మాన్ ఆఘా (కెప్టెన్), అబ్రార్ అహ్మద్, ఫహీమ్ అష్రాఫ్, ఫఖర్ జమాన్, హారిస్ రౌఫ్, హసన్ అలీ, హసన్ నవాజ్, హుస్సేన్ తలాత్, కుశ్‌దిల్ షా, మహ్మద్ హారిస్ (వికెట్ కీపర్), మహ్మద్ నవాజ్, మహ్మద్ వసీమ్ జూనియర్, సాహిబ్‌జాదా ఫర్హాన్, అయూబ్, సల్మాన్ మీర్జా, షహీన్ షా అఫ్రీదీ, సుఫ్యాన్ మోకిమ్.

అనహత్‌కు రన్నరప్ టైటిల్



న్యూఢిల్లీ: భారత యువ స్క్వాష్ క్రీడాకారిణి అనహత్ సింగ్.. ఆస్ట్రేలియాలో జరిగిన ఎన్‌ఎస్‌డబ్ల్యూ బేగా ఓపెన్‌లో రన్నరప్ టైటిల్‌తో సరిపెట్టుకుంది. హబీబా హని (ఈజిప్టు)తో ఫైనల్ పోరులో 11-9, 5-11, 8-11, 4-10తో ఉన్న దశలో అనహత్ గాయంతో మ్యాచ్ నుంచి వైదొలగింది. దీంతో హబీబాను విజేతగా ప్రకటించారు. 17 ఏళ్ల అనహత్ రన్నరప్‌గా నిలిచింది.

ఒక్క పరుగుతో గట్టెక్కిన కింగ్స్

ఏపీఎల్‌లో రాయల్స్ ఓటమి

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)లో ఆదివారం ఉత్కంఠగా జరిగిన మ్యాచ్‌లో కాకినాడ కింగ్స్ ఒక పరుగు తేడాతో రాయల్స్ ఆఫ్ రాయలసీమపై గెలిచింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను ఐదు ఓవర్లకు కుదించారు. తొలుత కింగ్స్ నిర్ణీత ఐదు ఓవర్లలో 4 వికెట్లకు 69 పరుగులు చేసింది. లేఖజ్ రెడ్డి (33 నాటౌట్), తపస్వి (19) రాణించారు. గిరినాథరెడ్డి, సాకేత్ రామ్ చెరో 2 వికెట్లు తీశారు. ఛేదనలో రాయల్స్ 5 ఓవర్లలో 68/5 స్కోరుకే పరిమితమైంది. ధ్రువకుమార్ (32 నాటౌట్), హర్షవర్ధన్ (18) ఫర్వా లేదనిపించారు. సుదర్శన్‌కు 2 వికెట్లు దక్కాయి. కాగా భీమవరం బుల్స్, సింహాద్రి వైజాగ్ లయన్స్ మధ్య జరగాల్సిన తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది.

హీలీ అజేయ సెంచరీ

చివరి వన్డేలో భారత్ 'ఎ'పై ఆసీస్ 'ఎ' గెలుపు



బ్రిస్బేన్: ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో మూడు వన్డేల సిరీస్‌ను ఇప్పటికే 2-0తో గెలుచుకున్న భారత్ 'ఎ' జట్టు.. ఆదివారం జరిగిన నామమాత్రపు ఆఖరి మ్యాచ్‌లో 9 వికెట్లతో ఓటమిపాలైంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ 47.4 ఓవర్లలో 216 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ షఫాలీ (52) అర్ధ సెంచరీ చేయగా, యాస్తిక భాటియా (42) రాణించింది. తహిలా మెక్‌గ్రాత్ 3, గింజర్, హేవర్డ్, లియోరాయిడ్ తలా 2 వికెట్లు తీశారు. ఛేదనలో అలీసా హీలీ (85 బంతుల్లో 23 ఫోర్లు, 3 సిక్సర్లతో 137 నాటౌట్) అజేయ సెంచరీతో కదం తొక్కడంతో ఆసీస్ 27.5 ఓవర్లలోనే 222/1 స్కోరు చేసి గెలిచింది. తహిలా విల్సన్ (59) అర్ధ సెంచరీతో అదరగొట్టింది. ఆసీస్ ఏకైక వికెట్‌ను రాధా యాదవ్ పడగొట్టింది.

పారా వాలీబాల్ వరల్డ్‌కప్ జట్టులో మనోళ్లకు చోటు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): పారా వాలీబాల్ వరల్డ్‌కప్‌లో తలపడే భారత జట్టులో ఆరుగురు తెలుగు క్రీడాకారులకు చోటు దక్కింది. అమెరికాలో వచ్చేనెల 12 నుంచి 18 వరకు ఈ వరల్డ్‌కప్ జరగనుంది. తెలంగాణ నుంచి ప్రశాంత్ (వరంగల్), నరేష్ యాదవ్ (సూర్యాపేట), కల్యాణ్ (మంచిర్యాల), రాజు (ములుగు), ఆంధ్రప్రదేశ్ నుంచి గణేష్ (అనకాపల్లి), విజయకుమార్ (దర్శి)లకు భారత జట్టులోని 15 మంది బృందంలో స్థానం లభించింది.

ముగిసిన వేస్ పేస్ అంత్యక్రియలు



కోల్‌కతా: టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ తండ్రి, హాకీ మాజీ ఆటగాడైన డాక్టర్ వేస్ పేస్ (80) అంత్యక్రియలు ఆదివారం ముగిశాయి. వయోభారం, అనారోగ్య సమస్యలతో వేస్ గురువారం కన్నుమూశాడు. అంత్యక్రియలకు భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ, అరుణ్‌లాల్, హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కే తదితరులు హాజరయ్యారు. వేస్ పార్థివ దేహాన్ని తీసుకెళ్తున్న వాహనం ముందు యువ ఆటగాళ్లు హాకీ స్టిక్‌లతో ఇరువైపులా నిల్చొని ఘనంగా నివాళులర్పించారు. 1972 ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించిన భారత హాకీ జట్టులో వేస్ పేస్ సభ్యుడు. రిటైర్మెంట్ తర్వాత స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణుడిగా సేవలందించాడు.

ఛెత్రిని ఎందుకు తీసుకోలేదంటే..

ఫుట్‌బాల్ కోచ్ జమీల్

బెంగళూరు: కాఫా నేషన్స్ కప్‌నకు భారత జట్టు ప్రాబబుల్స్‌లో స్టార్ ఫుట్‌బాలర్ సునీల్ ఛెత్రి పేరు లేకపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. అటు సోషల్ మీడియాలోనూ భారత కోచ్ ఖలీద్ జమీల్ తీరుపై క్రీడాభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఛెత్రి పేరు లేకపోవడంపై కోచ్ జమీల్ స్పందించాడు. కొత్త వారిని పరీక్షించే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు స్పష్టం చేశాడు. ఛెత్రికి కూడా ఈ విషయం ముందుగానే తెలిపామన్నాడు. ఈనెల 29 నుంచి కాఫా నేషన్స్ కప్ జరగనుంది. 'భారత ఫుట్‌బాల్‌కు ఛెత్రి రోల్ మోడల్. అతడి కోసం జట్టు ద్వారాలు ఎప్పుడూ తెరుచుకునే ఉంటాయి. అయితే ప్రస్తుత శిబిరంలో ఎందుకు లేడంటే.. మేం ఆసియాకప్ క్వాలిఫయర్స్‌కు సన్నాహకంగా ఉపయోగపడే టోర్నీ ఆడుతున్నాం. ఇందులో ఇతర ఆటగాళ్లను పరీక్షించాలనుకున్నా' అని జమీల్ వెల్లడించాడు. మరోవైపు అక్టోబరు 9 నుంచి జరిగే ఆసియాకప్ క్వాలిఫయర్స్‌లో ఛెత్రి ఆడే అవకాశాలున్నాయి.

25,000 ఎగువన బుల్లిష్

(ఆగస్టు 18-22 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

అప్‌ట్రెండ్

నిఫ్టీ గత వారం 24,703-24,530 పాయింట్ల మధ్యన కదలాడి 202 పాయింట్ల (1.09 శాతం) లాభంతో 24,631 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,000 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

బ్రేకౌట్ స్థాయి: 25,000
బ్రేక్‌డౌన్ స్థాయి: 24,300
నిరోధ స్థాయిలు: 24,850, 24,950, 25,050 (24,750 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24,425, 24,325, 24,225 (24,525 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18 తేదీ			
హైదరాబాద్	490	విజయవాడ	520
వరంగల్	492	గోదావరి	515
చిత్తూరు	553	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	102	విజయవాడ	119
వరంగల్	102	గుంటూరు	121
కరీంనగర్	102	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	102	చిత్తూరు	98
కర్నూలు	102	నెల్లూరు	103
విశాఖపట్నం	113	అనంతపురం	103
గోదావరి	119		

ఫాక్స్‌కాన్ బెంగళూరు ప్లాంట్‌లో ఐఫోన్ 17 ఉత్పత్తి షురూ

రూ.25,000 కోట్లతో ప్లాంట్ ఏర్పాటు చేసిన కంపెనీ
చైనా వెలుపల సంస్థకిది ఇదే అతిపెద్ద ప్లాంట్



న్యూఢిల్లీ: తైవాన్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఫాక్స్‌కాన్.. యాపిల్ ఐఫోన్స్ అసెంబ్లింగ్ కోసం భారత్‌లో అతిపెద్ద యూనిట్‌ను ప్రారంభించింది. బెంగళూరు సమీపంలోని దేవనహళ్లిలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌లో త్వరలో మార్కెట్లోకి విడుదల చేయనున్న ఐఫోన్ 17 అసెంబ్లింగ్ ప్రారంభించినట్లు సమాచారం. అయితే యాపిల్ కంపెనీ, ఫాక్స్‌కాన్ గానీ దీనిపై అధికారికంగా నోరు మెదపడం లేదు. ఈ ప్లాంట్ ఏర్పాటు కోసం ఫాక్స్‌కాన్ 280 కోట్ల డాలర్లు (సుమారు రూ.25,000 కోట్లు) ఖర్చు చేసింది. ఐఫోన్స్ అసెంబ్లింగ్ కోసం చైనా వెలుపల ఫాక్స్‌కాన్ ఏర్పాటు చేసిన అతిపెద్ద ప్లాంటు ఇదేనని భావిస్తున్నారు. చెన్నై సమీపంలోని శ్రీపెరంబుదూర్ వద్ద ఏర్పాటు చేసిన యూనిట్‌లోనూ ఫాక్స్‌కాన్ ఐఫోన్ 17ను అసెంబ్లింగ్ చేస్తోంది. ఐఫోన్ 17ను యాపిల్ సెప్టెంబరులో మార్కెట్లోకి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

చైనా నిపుణులు లేకపోయినా..

కాగా చైనా.. ఈ ప్లాంట్ నుంచి కూడా తన సాంకేతిక నిపుణులను వెనక్కి తీసుకుంది. దాంతో కొన్ని సమస్యలు ఎదురైనప్పటికీ ఫాక్స్‌కాన్.. తైవాన్, ఇతర దేశాల నుంచి నిపుణులను రప్పించి భారత్‌లో ఐఫోన్స్ ఉత్పత్తిని పెంచుతోంది. ఫాక్స్‌కాన్ గత ఆర్థిక సంవత్సరం మన దేశంలో యాపిల్‌కి చెందిన దాదాపు 4 కోట్ల ఐఫోన్లు తయారు చేసింది. వీటి విలువ 2,200 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.92 లక్షల కోట్లు) వరకు ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కనీసం 6 కోట్ల ఐఫోన్లను భారత్‌లో అసెంబ్లింగ్ చేయించాలని యాపిల్ లక్ష్యంగా పెట్టుకుంది.

భారత్‌లో ల్యాప్‌టాప్‌ల తయారీ: సామ్‌సంగ్

న్యూఢిల్లీ: దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం సామ్‌సంగ్.. భారత్‌లో ల్యాప్‌టాప్‌ల తయారీని ప్రారంభించింది. గ్రేటర్ నోయిడాలోని ఉత్పత్తి కేంద్రంలో ఈ ల్యాప్‌టాప్‌ల తయారీని ప్రారంభించినట్లు సామ్‌సంగ్ వెల్లడించింది సామ్‌సంగ్ ఇప్పటికే ఫీచర్ ఫోన్లు, స్మార్ట్ ఫోన్లు, వేరబుల్స్, టాబ్లెట్లను ఈ యూనిట్‌లో తయారు చేస్తోంది. తాజాగా పోర్టుఫోలియో విస్తరణలో భాగంగా ల్యాప్‌టాప్‌ల ఉత్పత్తిని కూడా మొదలుపెట్టింది. త్వరలోనే మరిన్ని ఉత్పత్తుల తయారీని భారత్‌లో ప్రారంభించాలని కంపెనీ భావిస్తోంది. కాగా ప్రస్తుతం సామ్‌సంగ్‌కు ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ ఫోన్ తయారీ యూనిట్ భారత్‌లోనే ఉంది. యాపిల్ తర్వాత భారత్ నుంచి అత్యధికంగా స్మార్ట్ ఫోన్లను ఎగుమతి చేస్తున్న సంస్థ కూడా సామ్‌సంగ్ కావడం గమనార్హం.



విశాఖ యూజియా ప్లాంట్ నుంచి 20 కొత్త ఔషధాలు

● లాభాల దిశగా చైనా ప్లాంట్: అరబిందో ఫార్మా

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న అరబిందో ఫార్మా తన వ్యాపారాన్ని మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నంలోని తన అనుబంధ సంస్థ యూజియా ప్లాంటులో అమెరికా, యూరోపియన్ మార్కెట్ల కోసం 20 కొత్త ఔషధాలను ఉత్పత్తి చేయనుంది. వీటికి అవసరమైన అనుమతుల కోసం ఇప్పటికే ఆయా దేశాల రెగ్యులేటరీ సంస్థలకు దరఖాస్తు చేసింది. కంపెనీ జూన్ త్రైమాసిక ఫలితాల వెల్లడి తర్వాత అనలిస్టుల ప్రశ్నలకు సమాధానంగా అరబిందో ఫార్మా సీఎఫ్‌ఓ సంతానం సుబ్రమణియన్ ఈ విషయం వెల్లడించారు. మరోవైపు చైనాలో 14.5 కోట్ల డాలర్ల (సుమారు రూ.1,250 కోట్లు)తో ఏర్పాటు చేసిన అరబిందో ఫార్మా అనుబంధ యూనిట్ కూడా ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికల్లా స్థూల లాభం ఆర్జించే అవకాశం ఉందన్నారు. ఇందుకోసం ఈ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరిస్తున్నట్టు చెప్పారు. కాగా 7 కోట్ల డాలర్ల (దాదాపు రూ.600 కోట్లు) పెట్టుబడితో అమెరికాలో ఏర్పాటు చేసిన రెండు యూనిట్లు కూడా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ఉత్పత్తి ప్రారంభిస్తాయని సుబ్రమణియన్ వెల్లడించారు.

బయోలాజిక్స్ వ్యాపారంలో మరిన్ని పెట్టుబడులు

హైదరాబాద్ సమీపంలో కాంట్రాక్టు పద్ధతిలో బయోలాజిక్స్ ఔషధాల ఉత్పత్తి కోసం ఏర్పాటు చేసిన ప్లాంటును 2027 మార్చి నాటికి మరో 10 కోట్ల డాలర్ల (సుమారు రూ.860 కోట్లు) పెట్టుబడితో విస్తరించనున్నట్టు సుబ్రమణియన్ చెప్పారు. ఈ ప్లాంటు మీద అరబిందో ఫార్మా ఇప్పటికే 3 కోట్ల డాలర్లు (దాదాపు రూ.255 కోట్లు) ఖర్చు చేసింది.

విమాన ఇంధనంగా వంటనూనె

పానిపట్ రిఫైనరీలో ఉత్పత్తి.. ఐఓసీ చైర్మన్ ఏఎస్ సాహ్ని

న్యూఢిల్లీ: విమాన ఇంధనం రూపురేఖలూ మారిపోతున్నాయి. ప్రస్తుతం ముడి చమురు నుంచి ఉత్పత్తి చేసే ఇంధనమే విమానాల్ని నడిపిస్తోంది. దీనివల్ల ఆకాశంలో పెద్దమొత్తంలోనే కాలుష్యం పోగవుతోంది. ఈ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రభుత్వ రంగంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) సస్టెయినబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ (ఎస్‌ఏఎఫ్) పేరుతో ప్రత్యేక విమాన ఇంధనాన్ని అభివృద్ధి చేసింది. ఉపయోగించిన వంట నూనెలతో ఈ ఇంధనాన్ని అభివృద్ధి చేసినట్టు ఐఓసీ చైర్మన్ అర్వీందర్ సింగ్ సాహ్ని చెప్పారు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న పెట్రోలియం ఆధారిత విమాన ఇంధనం (ఏటీఎఫ్)లో ఈ ఎస్‌ఏఎఫ్‌ను సగం వరకు కలిపి ఉపయోగించవచ్చని ఆయన తెలిపారు. హరియాణాలో ఐఓసికి చెందిన పానిపట్ రిఫైనరీలో ప్రస్తుతం ఈ ఎస్‌ఏఎఫ్‌ను కంపెనీ ఉత్పత్తి చేస్తోంది. ఇందుకోసం ఈ రిఫైనరీలో 35,000 టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేసింది. ఈ సరికొత్త ఇంధనానికి అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ (ఐసీఏఓ) కూడా ఆమోదం తెలిపిందని సాహ్ని చెప్పారు.

ఆచితూచి వ్యవహరించండి..

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశం కనిపిస్తోంది. అంతర్జాతీయ రాజకీయ సమీకరణాలు ఈ వారం మార్కెట్ల గమనాన్ని నిర్దేశించనున్నాయి. దేశీయంగా చూస్తే ప్రతిపాదిత జీఎస్‌టీ సంస్కరణలు, ఎస్ అండ్ పీ భారత క్రెడిట్ రేటింగ్ పెంచటం మార్కెట్లకు సానుకూల అంశాలు. గత వారం సూచీలు మెరుగ్గా రాణించాయి. అయినప్పటికీ ఈ వారం మదుపరులు ఆచితూచి వ్యవహరించటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

క్రిసిల్: కొన్ని రోజులుగా అప్‌ట్రెండ్‌లో సాగిన ఈ షేరు తాజా మార్కెట్ కరెక్షన్‌తో డీలాపడ్డాయి. ప్రస్తుతం ఒకే స్థాయిలో నిలదొక్కుకుంటూ వస్తున్నాయి. దీర్ఘకాల మూమెంటమ్ క్రమంగా మెరుగుపడుతోంది. గత గురువారం రూ.5,339 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.5,300 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.5,750 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.5,240 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

విప్రో: ప్రస్తుతం ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో సాగుతోంది. కొన్నాళ్ల క్రితం పుల్‌బ్యాక్ ర్యాలీ కనిపించింది. రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ లేకపోయినప్పటికీ మరోసారి ఈ షేరు కీలకమైన రూ.244 మద్దతు స్థాయిలకు చేరింది. గత గురువారం రూ.246 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.240 శ్రేణిలో ప్రవేశించి రూ.285 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.236 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఇన్ఫోసిస్: ఈ షేరు మరోసారి కీలకమైన రూ.1,450 వద్ద మద్దతు తీసుకుంది. ఇప్పటికే ఐటీ రంగ షేర్లు కనిష్ఠ స్థాయికి చేరటంతో ఇన్వెస్టర్లు కొద్దిగా ఆసక్తి కనబరుస్తున్నారు. గత గురువారం రూ.1,447 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,400 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,650 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,340 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఏషియన్ పెయింట్స్: ప్రస్తుతం ఈ షేరు టర్న్ అరౌండ్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ బాగా పుంజుకున్నాయి. రూ.2,500 వద్ద కీలకమైన నిరోధ స్థాయిని అధిగమిస్తే మరింత పెరిగే అవకాశం ఉంది. గత గురువారం రూ.2,528 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.2,700 టార్గెట్ ధరతో రూ.2,450 స్థాయిలో పడే కొద్ది కొనుగోలు చేయాలి. అయితే రూ.2,400 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

సిప్లా: కొన్ని నెలలుగా ఈ షేరు అక్యుములేషన్ జోన్‌లో ఉంది. స్వల్ప,మధ్యకాలిక మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ మెరుగయ్యాయి. ఫార్మా రంగం జోరందుకుంటే షేరు పెరిగే అవకాశం ఉంది.

గత గురువారం రూ.1,564 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,500 శ్రేణిలో అక్యుములేట్ చేసుకుంటూ రూ.1,850 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,440 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

ప్రధాన నిరోధం 25,000

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం రికవరీ కనబరుస్తూ 220 పాయింట్ల లాభపడి 24,500 ఎగువన బౌన్స్ బ్యాక్ అయ్యింది. చివరకు అంతకు ముందు వారం ముగింపుతో పోలిస్తే 202 పాయింట్ల లాభంతో 24,630 వద్ద క్లోజైంది. మార్కెట్ ఆరు వారాల అనంతరం డౌన్ ట్రెండ్‌కు స్వల్పకాలిక విరామం ప్రకటించినట్లు కనిపిస్తోంది. గత వారం మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ ఇండెక్స్‌లు కూడా స్వల్ప రికవరీని కనబరిచాయి. మార్కెట్లలో మైనర్ రికవరీ కనిపించినప్పటికీ ఎలాంటి స్పష్టమైన సంకేతాలు వెలువరించలేదు. ఈ వారం స్వల్పకాలానికి సానుకూల సంకేతాలు వెలువరిస్తేనే మార్కెట్ మరింత పటిష్ఠతను సూచిస్తుంది.

బుల్లిష్ స్థాయిలు: తదుపరి పాజిటివ్ ట్రెండ్ ప్రదర్శించాలంటే నిఫ్టీ మైనర్ నిరోధ స్థాయిలైన 24,800 ఎగువన నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. తదుపరి ప్రధాన నిరోధం 25,000. ఇక్కడ కన్సాలిడేషన్‌కు అవకాశం ఉంది. తదుపరి అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయిల వద్ద నిలదొక్కుకోవాల్సి ఉంటుంది.

బేరిష్ స్థాయిలు: ప్రస్తుత మద్దతు స్థాయి 24,500 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే మరింత బలహీనపడుతుంది. సానుకూల, రక్షణ కోసం ఈ స్థాయిలకు ఎగువన నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ నిలదొక్కుకోలేకపోతే మరింత బలహీనతను సూచిస్తుంది. తదుపరి మద్దతు స్థాయిలు 24,300,24,000

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 336 పాయింట్ల లాభపడి 55,340 వద్ద క్లోజైంది. ఈ వారం పాజిటివ్ ట్రెండ్ కోసం నిరోధ స్థాయిలైన 55,700 ఎగువన నిలదొక్కుకోవాలి. ఒకవేళ నిలదొక్కుకోలేకపోతే 55,000 వద్ద స్వల్పకాలిక మద్దతు స్థాయిలు టాయి. ఇక్కడ స్వల్పకాలిక బలహీనతను సూచిస్తుంది. అప్రమత్తంగా ఉండటం మంచిది.

పాటర్న్: నిఫ్టీ గత వారం టెక్నికల్ ఓవర్‌సోల్డ్ పొజిషన్ కారణంగా రికవరీ కనబరిచింది. ప్రధానంగా 100 రోజుల చలన సగటు ఎగువన రికవరీ అయ్యింది. 25,000 వద్ద తదుపరి నిరోధం ఉంది. ఇక్కడ కన్సాలిడేషన్‌కు అవకాశం ఉంది. 24,000 వద్ద అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్ వద్ద ఉంది. సానుకూలత కోసం ఇక్కడ కచ్చితంగా నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,720, 24,800
మద్దతు	24,500, 24,440

నేను.. నా స్టీల్ ప్లేట్!

- నంద్యాల జిల్లా ఆత్మకూరుకు చెందిన ఓ న్యాయవాది వినూత్న ఆలోచన
- ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా నిశ్శబ్ద ఉద్యమం
- ఏ ఫంక్షన్‌కు వెళ్లినా వెంటే స్టీల్ ప్లేట్, గ్లాస్



ఆత్మకూరులో ఆదివారం ఓ పెళ్లిలో వెంట తెచ్చుకున్న స్టీల్ ప్లేట్లో భోజనం చేస్తున్న న్యాయవాది సుదర్శన్

ఆత్మకూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్, మైక్రో ప్లాస్టిక్ వంటివి మనిషి ఆరోగ్యానికి ప్రమాదకరమని నిపుణులు చెబుతుంటారు. ప్లాస్టిక్ ఏదో రూపంలో శరీరంలోకి ప్రవేశించి ప్రమాదకర జబ్బులను తెచ్చుకొనే పరిస్థితులను కూడా చూస్తూనే ఉన్నాం. నేడు ఏ ఫంక్షన్‌కు వెళ్లినా.. అక్కడ విందు భోజనం సమయంలో ప్లాస్టిక్ కవర్ పరిచి ఉండే పేపర్ ప్లేట్లనే ఎక్కువగా పెడుతుంటారు. అయితే ఈ విధానాన్ని నంద్యాల జిల్లా ఆత్మకూరు పట్టణానికి చెందిన గరుడాద్రి సుదర్శన్ అనే న్యాయవాది తిరస్కరించారు. ప్లాస్టిక్ చట్రంలో పడిపోయిన జీవన విధానంలో మార్పు అవసరమనే నినాదంతో ఏ కార్యక్రమానికి వెళ్లినా.. అక్కడ భోజనం చేసేందుకు తన వెంట ఒక స్టీల్ ప్లేట్, గ్లాస్ తీసుకెళ్తున్నారు. ఆ ప్లేట్‌లోనే ఆహార పదార్థాలను పెట్టించుకుంటారు. ఎక్కడైనా టీ షాపునకు వెళ్లినా అక్కడ ప్లాస్టిక్ గ్లాస్ ఉంటే దానికి బదులు తన వెంట తెచ్చుకున్న స్టీల్ టీ గ్లాస్‌ను వాడుతుంటారు. ఇది చూడ్డానికి కొంత మందికి కాస్త విడ్డూరంగా అనిపించినా.. ప్లాస్టిక్ కారకాల వల్ల కలిగే ప్రమాదాన్ని ఆయన తన జీవన విధానంతో కళ్లకు కట్టినట్లుగా చూపిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యతిరేక నిశ్శబ్ద ఉద్యమాన్ని కొనసాగిస్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు.



విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో రద్దీ

బస్టాండ్లు కిటకిట

- 'ఉచిత బస్సు'కు పోటెత్తిన మహిళలు

విజయవాడ/రాజమహేంద్రవరం, ఏలూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి విశేష స్పందన లభిస్తోంది. వారాంతపు సెలవులు ముగియడంతో ఆదివారం బస్టాండ్లన్నీ కిటకిటలాడాయి. విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో బస్సులు ఎక్కడానికి మహిళలు పోటెత్తారు. ఆదివారం ఒక్కరోజే విజయవాడ సిటీ బస్సుల్లో 80శాతం ఆక్యుపెన్సీ నమోదైంది. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి ఆర్టీసీ కాంప్లెక్స్ ఉదయం నుంచి రాత్రి వరకూ రద్దీగానే ఉంది. ఇక్కడి నుంచి సాధారణంగా రోజుకు 32వేల మంది మహిళలు ప్రయాణిస్తారని అంచనా. అయితే ఆదివారం దాదాపు 50వేల మంది వరకూ మహిళలు ప్రయాణం చేసినట్టు జిల్లా ఆర్టీసీ అధికారి ఏలూరి సత్యనారాయణమూర్తి తెలిపారు.

విలీన మండలాలకూ 'స్త్రీ శక్తి' వర్తింపు

విలీన మండలాలు, గ్రామాల ప్రయాణిలకు స్త్రీ శక్తి పథకం వర్తింపజేస్తున్నట్టు ఏలూరు డీపీటీవో షేక్ షబ్నం తెలిపారు. 'వీరికి ఉచితం లేదట' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారులు స్పందించారు. రాజమండ్రి, రేపాకగొమ్ము నుంచి తెలంగాణలోని భద్రాచలం వెళ్లే సర్వీసులను ఎటపాక వరకు పొడిగించామని షేక్ షబ్నం పేర్కొన్నారు. ఈ సర్వీసులను పొడిగిస్తూ ఎన్‌క్లేవ్(ఏపీలో ప్రారంభమై మధ్యలో తెలంగాణ వచ్చి మళ్లీ ఆంధ్రా రూట్ రావడం) రూట్‌గా మార్చడం ద్వారా ఈ మార్గంలో ఉన్న కుక్కునూరు, వేలేరుపాడు గ్రామాల ప్రజలను స్త్రీ శక్తి పరిధిలోకి తీసుకొచ్చామన్నారు. అంతరాష్ట్ర సర్వీసైన అశ్వారావుపేట షటిల్ సర్వీసును జీరో టికెట్‌గా మార్పు చేశామన్నారు. ఈ మార్గంలోని ఏపీ గ్రామాల ప్రయాణిలు స్త్రీ శక్తి పరిధిలోకి వస్తారని పేర్కొన్నారు.


బాధ్యత ఉండొద్దా?

- మీరు చేసే పనులకు పార్టీ నష్టపోవాలా?
- కొందరు ఎమ్మెల్యేల తీరుపై చంద్రబాబు సీరియస్
- ఆముదాలవలస, గుంటూరు తూర్పు, అనంత ఎమ్మెల్యేలపై నివేదిక ఇవ్వండి
- రాష్ట్ర నాయకత్వానికి ముఖ్యమంత్రి ఆదేశం
- ఉచిత బస్సుపై వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- టీడీపీ నేతలతో ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్

అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కొందరు ఎమ్మెల్యేలు, నేతలు బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. వారు చేసే తప్పులకు పార్టీ ఎందుకు నష్టపోవాలని నిలదీశారు. ఇలాంటి విషయాల్లో ఇక కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టంచేశారు. బాధ్యతగల పదవుల్లో ఉన్నప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. ప్రభుత్వ పథకాల అమలుపై చంద్రబాబు టీడీపీ శ్రేణులతో ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు ఎమ్మెల్యేలపై ఇటీవల కాలంలో వచ్చిన విమర్శలు, ఆరోపణలపై ఆయన సీరియస్ అయ్యారు. ముఖ్యంగా ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్‌పై కేజీవీబీ ప్రిన్సిపాల్ సౌమ్య చేసిన ఆరోపణలు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలను సీఎం ప్రస్తావిస్తూ ఆగ్రహం వ్యక్తంచేశారు. జూనియర్ ఎన్టీఆర్‌పై అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చేసిన వ్యాఖ్యలనూ తప్పుబట్టారు. ఈ ముగ్గురి కారణంగా వచ్చిన విమర్శలు, తలెత్తిన వివాదాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వీటిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని పార్టీ రాష్ట్ర నాయకత్వాన్ని ఆదేశించారు. గ్రూపు తగాదాలు, అంతర్గత విభేదాలతో పార్టీకి నష్టం కలిగించేలా ఎవరు వ్యవహరించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేల వ్యవహారశైలి చిన్న విమర్శకు కూడా ఆస్కారం ఇచ్చేలా ఉండకూడదని పదే పదే చెబుతున్నా తీరు మార్చుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు, నేతలు వ్యక్తిగతంగా చేసే పనులు పార్టీకి చెడ్డ పేరు తెస్తాయన్నారు. ఆయా వ్యవహారాల్లో తమ తప్పులేకుంటే.. తప్పుడు ప్రచారంపై ఎమ్మెల్యేలు గానీ, పార్టీ నేతలు గానీ వెంటనే బయటకు వచ్చి ప్రజలకు వాస్తవాలు చెప్పాలని స్పష్టంచేశారు.

పథకాల అమల్లో భాగస్వాములు కావాలి

సూపర్ సిక్స్ పథకాల అమలు, ప్రజాస్పందనపై పార్టీ వర్గాలతో చంద్రబాబు సమీక్షించారు. అన్నదాత సుఖీభవ పథకంపై అధిష్ఠానం పిలుపు మేరకు చేపట్టిన ర్యాలీలు, కార్యక్రమాల ఎంత వరకు విజయవంతం అయ్యాయో అడిగి తెలుసుకున్నారు. స్త్రీశక్తి పేరుతో ప్రారంభించిన ఉచిత బస్సు ప్రయాణంపై అన్ని ప్రాంతాల్లో అద్భుత స్పందన వస్తోందని పార్టీ నేతలు ఆయనకు చెప్పారు.



సూపర్ సిక్స్ సూపర్ హిట్‌తో వైసీపీ అంతర్మథనంలో పడిందని, దీంతో తప్పుడు ప్రచారాలకు దిగుతోందని తెలిపారు. ఉచిత బస్సు పథకంపై గందరగోళం సృష్టించేందుకు వైసీపీ, దాని అనుబంధ మీడియా చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని వారిని సీఎం ఆదేశించారు. పథకాల అమల్లో ఎమ్మెల్యేలు, మంత్రులు విధిగా భాగస్వాములయ్యేలా చూడాలని నిర్దేశించారు. ప్రజలతో మమేకమైతేనే పథకాల ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని వ్యాఖ్యానించారు.

ఢిల్లీలో లోకేశ్

- నేడు పలువురు కేంద్ర మంత్రులతో భేటీ
- 21న వెళ్లనున్న సీఎం చంద్రబాబు



అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి లోకేశ్ ఆదివారం రాత్రి ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. సోమవారం ఆయన పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమవుతారు. సెమీకండక్టర్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ మంజూరు చేసినందుకు కేంద్ర ఐటీ-ఎలక్ట్రానిక్స్, రైల్వే శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతారు. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురీ, షిప్పింగ్- జలరవాణా మంత్రి సర్బానంద్ సోనోవాల్, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, విదేశాంగ మంత్రి జైశంకర్‌తో కూడా ఆయన భేటీ అవుతారు. పెండింగ్ ప్రాజెక్టులపై చర్చిస్తారు. రాష్ట్రప్రభుత్వం తరఫున వివిధ ప్రతిపాదనలను వారికి సమర్పిస్తారు. మరోవైపు.. ముఖ్యమంత్రి చంద్రబాబు 21న ఢిల్లీ వెళ్లనున్నారు. 22న పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమవుతారు.

స్వాతంత్ర్య పోరాటాన్ని జగన్ అవమానించారు: లోకేశ్

స్వాతంత్ర్య దినోత్సవం నాడు జాతీయ జెండాను ఎగురవేయకపోవడం జగన్ అహంకారానికి నిదర్శనమే కాకుండా స్వాతంత్ర్య పోరాటాన్ని అవమానించడం కూడా అని మంత్రి లోకేశ్ అన్నారు. దేశాన్ని అవమానించినందుకు ఆయన దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని 'ఎక్స్'లో డిమాండ్ చేశారు. 'వైఎస్ జగన్ ఇన్సల్ట్స్ నేషన్' అని ట్యాగ్ లైన్ పెట్టారు.

జెండా ఎగురవేయని జగన్ జాతికి క్షమాపణ చెప్పాలి

- ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం రోజున జాతీయ జెండా ఎగురవేయని వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి జాతికి క్షమాపణ చెప్పాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు మీడియాతో మాట్లాడారు. 'అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కావాలని కోర్టును ఆశ్రయించిన జగన్, కనీసం జాతీయ జెండా ఎగురవేయకపోవడాన్ని తీవ్రంగా పరిగణించాలి. ఆయనతోపాటు వైసీపీ నాయకులు కూడా జాతికి క్షమాపణ చెప్పాలి' అన్నారు. 30న విజయవాడలో స్ఫూర్తి పేరుతో సంచార, అర్ధ సంచార జాతుల విముక్తి దినోత్సవం నిర్వహిస్తామని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు.

వారసత్వ సంపదను కాపాడుకుందాం

- ప్రత్యేక ఆదేశాలు జారీ చేసిన దేవదాయ శాఖ

అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రాచీన కట్టడాలు, పురాతన దేవాలయాలను పరిరక్షించడం ద్వారా వారసత్వ సంపదను కాపాడటంపై దేవదాయ శాఖ దృష్టి సారించింది. దీనిలో భాగంగా ప్రాచీన కట్టడాలు, ఆలయాల్లో సంప్రదాయ, ఆగమ సూత్రాలకు అనుగుణంగా ఉన్న నిర్మాణాల జోలికి వెళ్లవద్దని శాఖ ఉన్నతాధికారులు తాజాగా ప్రత్యేక సర్క్యులర్ జారీ చేశారు. అన్ని గుడుల్లోని గర్భాలయాలు, అంతరాలయాలతో పాటు దాదాపు 200 మీటర్ల వరకూ నిర్మాణాలను యథాతథంగా ఉంచాలని అందులో స్పష్టం చేశారు. ఆలయాల్లో ఏ చిన్న మార్పు చేయాలన్నా, కొత్తగా నిర్మాణాలు చేపట్టాలన్నా తప్పనిసరిగా కమిషనర్ అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. దేవదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్రమోహన్ మాట్లాడుతూ 'ప్రాచీన ఆలయాల ప్రాకారాలు, గోపురాలతో పాటు అంతరాలయాల్లో ఫోర్లింగ్ రాతితో నిర్మించేవారు. ఇప్పుడు పాలిష్ చేసిన గ్రానైట్, బేతంచర్ల రాళ్లు, సిరామిక్స్ టైల్స్ వేయడంతో పాటు రాతి కట్టడాలకు ఇష్టారీతిగా పెయింటింగ్‌లు వేసి దెబ్బతీస్తున్నారు. దీనివల్ల మన వారసత్వ సంపద దెబ్బతింటోంది. అందుకే గర్భాలయాలు, అంతరాలయాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశించాం' అన్నారు.

20 వరకు 'అన్నదాత సుఖీభవ' గ్రీవెన్స్ స్వీకరణ

అమరావతి, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): 'అన్నదాత సుఖీభవ' పథకానికి అర్హత ఉండీ, లబ్ధి పొందని రైతులు ఈనెల 20వ తేదీలోపు రైతు సేవా కేంద్రాల్లో గ్రీవెన్స్ మాడ్యూల్‌లో దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. అర్హతను నిర్ధారించడంలో ఉన్నత స్థాయి పరిశీలన, ధ్రువీకరణలో తిరస్కరణకు గురైన రైతులు, పథకానికి అర్హులైనా ఈ-కేవైసీ చేసుకోక తిరస్కరణకు లోనైన రైతులు రైతు సేవా కేంద్రాలను సంప్రదించి, 'అన్నదాత సుఖీభవ' పోర్టల్‌లో తగిన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులు నమోదు చేసుకోవాలని సూచించారు. జూలై 27వరకు స్వీకరించిన ఫిర్యాదులను పరిశీలించి, వారిలో అర్హులను గుర్తించి, నిధులు జమ చేసినట్లు తెలిపారు. రెండో అవకాశంగా ఈనెల 20 వరకు వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తామని తెలిపారు. దీనిపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.



అడ్రస్ లేని ఎంటెక్ అడ్మిషన్లు!

- షెడ్యూలు ప్రకారం 6న సీట్లు కేటాయించాలి

అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంటెక్ అడ్మిషన్లు అడ్రస్ లేకుండా పోయాయి. షెడ్యూలు ప్రకారం ఈనెల 6న సీట్లు కేటాయించాల్సి ఉంది. అయితే కాలేజీల నుంచి విద్యార్థులకు సర్టిఫికెట్ల జారీలో ఉత్పన్నమైన సమస్యల కారణంగా ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు ఉన్నత విద్యామండలి ఈనెల 4న ప్రకటించింది. సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేస్తామని తెలిపింది. ఆ ప్రకటన జారీ చేసి రెండు వారాలు అవుతున్నా.. ఇప్పటి వరకు అది జరగలేదు. దీనిపై విద్యార్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అసలు సీట్లు ఎప్పుడు కేటాయిస్తారో అర్థంకాక అయోమయంలో పడ్డారు. మరోవైపు సర్టిఫికెట్ల జారీ సమస్య కూడా పరిష్కారం కాలేదు. ప్రైవేటు కాలేజీలు, యూనివర్సిటీ కాలేజీలు ఫీజులు కట్టలేదంటూ బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్ల మంజూరును నిలిపివేశాయి. ఆరు క్వార్టర్ల ఫీజుల బకాయిలు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఆ మొత్తం చెల్లిస్తేనే.. సర్టిఫికెట్లు ఇస్తామంటూ కాలేజీలు తేల్చి చెబుతున్నాయి. యూనివర్సిటీ కాలేజీలు కూడా 'ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు' అంటూ తెగేసి చెబుతున్నాయి. దీంతో సొంతంగా డబ్బులు కట్టే స్తోమత లేని విద్యార్థులు ఎంటెక్‌లో చేరే అవకాశం కోల్పోతున్నారు. ఈ సమస్యపై ఈ నెల మొదటి వారంలో 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించింది. స్పందించిన ఉన్నత విద్యామండలి కౌన్సెలింగ్‌ను వాయిదా వేసి, సవరణ షెడ్యూలు జారీ చేస్తామని ప్రకటించింది.

అప్పులు చేసి.. ఫీజులు కట్టి

మరోవైపు ప్రభుత్వమే ఫీజులను పెండింగ్‌లో పెట్టినందున బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలని అధికారులు యూనివర్సిటీలను ఆదేశించారు. అయితే ఆ ఆదేశాలను వర్సిటీల అధికారులు లెక్కచేయడం లేదు. ఎవరు ఎన్ని చెప్పినా ఫీజులు కట్టి సర్టిఫికెట్లు తీసుకోవాలని స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలో అనేక మంది విద్యార్థులు అప్పులు చేసి మరీ ఫీజులు కట్టి సర్టిఫికెట్లు తెచ్చుకుంటున్నారు. 2023-24 విద్యా సంవత్సరం వరకు ఫీజులను తల్లిదండ్రుల ఖాతాల్లో వేసే విధానం ఉంది. 2024-25 నుంచి కూటమి ప్రభుత్వం దాన్ని మార్చి... నేరుగా కాలేజీల ఖాతాల్లోకే ఫీజులు జమ చేసే విధానాన్ని ప్రవేశపెట్టింది. అయితే నాలుగులో కేవలం ఒక్కటే క్వార్టర్ ఫీజులు విడుదల చేసింది. ప్రభుత్వం తర్వాత ఫీజులను యూనివర్సిటీ కాలేజీల ఖాతాలకే విడుదల చేస్తుంది. అయినా సరే ఆ డబ్బు కూడా విద్యార్థులే కట్టాలని వర్సిటీలు పట్టుబడుతున్నాయి. దీంతో ప్రభుత్వం చేసిన తప్పునకు విద్యార్థులు శిక్ష అనుభవించాల్సిన పరిస్థితి వచ్చింది.

భూములిక లీజుకే!

- కేటాయింపులపై సంపూర్ణ నియంత్రణ!
- మార్కెట్ రేటుకో, సగం ధరకో విక్రయించొద్దు
- తెరపైకి మరిన్ని ప్రతిపాదనలు
- ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘానికి నివేదించిన రెవెన్యూ శాఖ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పరిశ్రమలు, కంపెనీలు, సంస్థలకు కేటాయించే భూములపై స్పష్టమైన నియంత్రణ అవసరమని రాష్ట్రప్రభుత్వం భావిస్తోంది. ఆంధ్రప్రదేశ్ భూ కేటాయింపు విధానం (ల్యాండ్ అలాట్‌మెంట్ పాలసీ-2012)లోని కీలక అంశాలను మరింత పకడ్బందీగా అమలు చేయాలనుకుంటోంది. భూముల విలువ అమాంతం పెరిగిపోవడం.. మరోవైపు ఇతర అవసరాలకు భారీగా భూములను మళ్లిస్తున్న నేపథ్యంలో వాటి లభ్యత రానురానూ తగ్గిపోతోంది. ప్రభుత్వం భూ కేటాయింపులతో పాటు ఇతరత్రా కూడా విరివిగా భూములు ఇస్తుండడంతో.. దాని వద్ద ఉన్న ల్యాండ్‌బ్యాంక్ భారీగా తగ్గిపోతోంది. రీ సర్వేలోనూ ఇదే తేలింది. గత 15 ఏళ్లతో పోలిస్తే ప్రభుత్వ భూముల సంఖ్య 2.75 లక్షల ఎకరాల వరకు తగ్గిపోయినట్లు నిర్ధారణ అయింది. ఈ క్రమంలో మిగిలి ఉన్న కొద్దిపాటి భూమిని చాలా పొదుపుగా వాడుకోవాలని.. కేటాయింపులను సంపూర్తిగా నియంత్రించాలని రెవెన్యూ శాఖ సూచిస్తోంది. ఆయా అంశాలపై అధ్యయనం చేసి పలు కీలక ప్రతిపాదనలు రూపొందించింది. పరిశ్రమలు, కంపెనీలు, సంస్థలు, విద్యాసంస్థల ఏర్పాటుకు మార్కెట్ ధరకు భూముల విక్రయం.. లేదంటే సగం ధరకే ఇవ్వడం.. ఉచితంగా కట్టబెట్టడానికి వీల్లేకుండా కీలక సూచన చేసింది. నిర్దిష్ట కాల పరిమితితో లీజు ప్రాతిపదికన మాత్రమే భూములు కేటాయించాలని ప్రతిపాదించింది. దీని ప్రకారం ఎంత పెద్ద పరిశ్రమ అయినా సరే.. ఎన్ని రూ.వేల కోట్ల పెట్టుబడులు పెట్టేదైనా కూడా.. లీజు ప్రాతిపదికనే భూములివ్వాలి. ఆ లీజు ధరలు కూడా ఆంధ్రప్రదేశ్ భూ కేటాయింపు విధానం 2012 ప్రకారం.. పెరిగిన ధరలను బట్టే ఖరారు చేయాలని అందులో పేర్కొంది. భూముల లీజును సైతం కనిష్ఠంగా 25 ఏళ్లు, గరిష్ఠంగా 33 ఏళ్లు మాత్రమే ఇవ్వాలని.. ప్రతి 2-3 ఏళ్లకోసారి లీజు ఫీజు పెంచేలా విధివిధానాలు ఉండాలని ప్రతిపాదించింది. దీనివల్ల విధిగా ఆయా కంపెనీలు, పరిశ్రమలు ఉత్పాదకత రంగంలోకి వస్తాయని.. భూములు ఇచ్చిన ప్రయోజనాలు వెంటనే ఆచరణలోకి వస్తాయని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి.

కొన్ని కంపెనీల తీరుతో..

కొన్ని కంపెనీలు ప్రభుత్వం నుంచి అత్యంత విలువైన భూములను కారుచౌకగా తీసుకుని.. తొలుత కొంత పెట్టుబడి పెట్టి, పరిశ్రమలను ప్రారంభించి.. ఆ తర్వాత ఉత్పత్తి ఆపేస్తున్నాయి. ఆ భూములను ఇతర అవసరాలకు మళ్లిస్తున్నాయని రెవెన్యూ శాఖ గుర్తించింది. ముఖ్యంగా ఆ భూములను తనఖా పెట్టి ప్రభుత్వానికి తెలియకుండానే భారీగా రుణాలు తీసుకుంటున్నాయి. అనంతరం రుణాలు చెల్లించడం మానేస్తున్నాయి. దీంతో బ్యాంకులు ఆ భూములను వేలం వేసి అప్పులు తీర్చాలని గొడవ చేస్తున్నాయి. దీంతో మొదటికే మోసం వస్తోంది. ఈ అనుభవాల నేపథ్యంలో ఇకపై కంపెనీలు, పరిశ్రమల స్థాపనకు లీజు ప్రాతిపదికనే భూములిచ్చేలా రెవెన్యూ శాఖ ప్రతిపాదనలు తయారు చేసింది. ప్రస్తుతం పరిశ్రమల స్థాపన కోసం ఏపీఐఐసీ ముందుగానే ప్రభుత్వం నుంచి భూములు తీసుకుంటోంది. దాదాపు 1.25 లక్షల ఎకరాల ల్యాండ్‌బ్యాంక్ ఉంది. కొన్ని కంపెనీలకు మార్కెట్ ధర పూర్తిగా తీసుకుని భూములు కేటాయిస్తుండగా.. మరికొన్నింటికి సగం ధరకే ఇస్తున్నారు. కొన్ని బడా కంపెనీలకు కారుచౌకగా, ఇంకా ఉచితంగా కూడా కట్టబెడుతున్నారు. ఇలాంటి విధానం వద్దని.. దేనికైనా హేతుబద్ధత ఉండాలని, అందుకే లీజు విధానం తీసుకురావాలని రెవెన్యూ శాఖ కోరుతోంది.

పార్టీలకు ప్రభుత్వ భూములొద్దు!

రాజకీయ పార్టీలకు ఆఫీసుల కోసం భూములు కేటాయించే విషయంలోనూ రెవెన్యూ శాఖ కీలక ప్రతిపాదన చేసింది. రాజకీయ పార్టీకి ఎక్కడైతే సొంతంగా పార్టీ ఆఫీసు ఉంటుందో అక్కడ మళ్లీ ఆఫీసు నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలు కేటాయించకూడదని సూచించింది. పార్టీలకు సొంతంగా భూములుంటే కూడా.. ఆఫీసుల కోసం స్థలాలు కేటాయించొద్దని పేర్కొంది. గతంలో అనేక పార్టీలు.. సొంత ఆఫీసులు, భూములు ఉన్నా మళ్లీ ఆఫీసుల నిర్మాణం పేరిట కీలక ప్రాంతాల్లో విలువైన స్థలాలు దక్కించుకున్నాయి. ఇక అధికారంలో ఉండే పార్టీలు... భూములు తీసుకోవడానికి తమకు ఏ నిబంధన, నియమం అడ్డు రాకుండా చూసుకుంటున్నాయి. తమకు నచ్చిన చోట, ఖాళీగా కనిపించిన స్థలం కోసం ఒత్తిడి తెచ్చి సాధిస్తున్నాయి. దీంతో చంద్రబాబు ప్రభుత్వం ఇప్పుడు పార్టీ ఆఫీసులకు భూమలిచ్చే విషయంలోనూ స్పష్టమైన విధానం తీసుకురావాలనుకుంటోంది. రాష్ట్ర, జిల్లా పార్టీ ఆఫీసులకు ఆయా ప్రాంతాల్లో సొంత భవనాలు ఉన్నా.. లేదా ఆ పార్టీలకు ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే భూములు ఉంటే.. వాటికి భవిష్యత్‌లో భూములు కేటాయించకూడదని రెవెన్యూ శాఖ ప్రతిపాదించింది.



ఎమ్మెల్యే ఫ్లెక్సీలను చించుతున్న ఎన్టీఆర్ అభిమానులు

'జూనియర్'పై టీడీపీ ఎమ్మెల్యే వ్యాఖ్యల దుమారం

- కార్యకర్తతో సంభాషిస్తూ విమర్శలు.. ఆడియో వైరల్
- అది నాది కాదు: అనంత ఎమ్మెల్యే దగ్గుపాటి



ఎమ్మెల్యే వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం క్రైం, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్‌పై అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ వ్యాఖ్యల ఆడియో దుమారం రేపింది. జూనియర్ ఎన్టీఆర్‌ను దూషించినట్లుగా ఉన్న ఆడియోపై ఫ్యాన్స్ ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే ఫ్లెక్సీలు చించి, క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం ధర్నా చేపట్టారు. వీరిని అడ్డుకునే ప్రయత్నం చేసిన టీడీపీ నేతలతో వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు.

రాజకీయ కుట్ర: దగ్గుపాటి

ఆడియో వైరలైన కాసేపటికే ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ సెల్ఫీ వీడియో విడుదల చేశారు. వివాదాస్పద ఆడియోతో తనకు సంబంధం లేదన్నారు. ఇదంతా రాజకీయ కుట్రలో భాగమన్నారు. దీనిపై ఎస్పీకి ఫిర్యాదు చేశాననీ, గట్టి చర్యలు తీసుకోవాలని కోరానన్నారు. తన పేరు ప్రస్తావించారు కాబట్టి ఎన్టీఆర్‌కు క్షమాపణలు చెబుతున్నానన్నారు.

ఆడియో సంభాషణ ఇదీ..

ఎమ్మెల్యే: ఏ థియేటరప్పా..?
టీఎన్ఎస్ఎఫ్ నేత: అన్నా.. త్రివేణి. అన్ని థియేటర్లు షో పెట్టారు.
ఎమ్మెల్యే: మనోళ్లు మాట్లాడారా... రాముా, వీళ్లంతా ఓకే చేశారా..?
టీఎన్ఎస్ఎఫ్ నేత: ఏం లేదు అన్నా.. వాళ్లే మాట్లాడుకున్నారన్నా. శాంతి థియేటర్ ఇవ్వలేదు. గలాటా జరిగింది. వాళ్లు వేయం అన్నారు.
ఎమ్మెల్యే: ఏవేవి ఇచ్చారు..?
టీఎన్ఎస్ఎఫ్ నేత: త్రివేణి, గౌరి కాంప్లెక్స్ అన్నా.
ఎమ్మెల్యే: పర్మిషన్లు ఉన్నాయా..?
టీఎన్ఎస్ఎఫ్ నేత: అన్నా... గవర్నమెంటే ఇచ్చింది.
ఎమ్మెల్యే: పర్మిషన్లు లేవు, ఆపేయిస్తున్నా.
టీఎన్ఎస్ఎఫ్ నేత: ఎందుకులే.. అన్నా మనకు..
ఎమ్మెల్యే: వానెమ్మ..(బూతు) జూనియర్ గాడు..(బూతు) ఆపేయిస్తున్నా..
టీఎన్ఎస్ఎఫ్ నేత: ఎందుకన్నా మనకు..
ఎమ్మెల్యే: ఆహా.. నాకు అవసరమే కదా. లోకేశ్‌తో ఎలా పెట్టుకుంటాడు... ల... కొడుకు?
టీఎన్ఎస్ఎఫ్ నేత: మనమైతే ఆ విషయంలో ఆపోజిట్..
ఎమ్మెల్యే: ఎట్లా ఏపిస్తావు గాడిదా... నువ్వు..?
టీఎన్ఎస్ఎఫ్ నేత: నేనెవరు అన్నా వేయించడానికి. స్టేట్ వైడ్ సినిమా వేయిస్తున్నారు.
ఎమ్మెల్యే: సరే వేయించుకో. పర్మిషన్ లేదుగా..? ఎట్లా వేయిస్తావు?
టీఎన్ఎస్ఎఫ్ నేత: నేనెవరన్నా...
ఎమ్మెల్యే: సినిమా ఆడదు.. ఓకేనా?
టీఎన్ఎస్ఎఫ్ నేత: మనదేం పోతుందన్నా...?
ఎమ్మెల్యే: లోకేశ్ సార్ గురించి మాట్లాడతారా..? నాకు తెలియకుండా ఎలా ఆడుతుంది. నేను ఎమ్మెల్యే. సినిమా ఆడదు అని చెప్పు.. గాడ్ ప్రామిస్. నిలిపేపిస్తున్నా. అందర్నీ పంపించేయండి.

ఒకే రోజు 34 విభాగాల ప్రైవేటీకరణ!

- విశాఖ స్టీల్ తాజా నోటిఫికేషన్ జారీ

ఉక్కుటౌన్‌షిప్(విశాఖపట్నం), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పూర్తిస్థాయిలో ప్రైవేటీకరించే దిశగా అడుగులు పడుతున్నాయి. కర్మాగారాన్ని రక్షిస్తామని యాజమాన్యం ఒకవైపు ప్రకటనలు చేస్తూనే, మరో వైపు దశలవారీగా విభాగాలను ప్రైవేటీకరించేందుకు వడివడిగా అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా కర్మాగారంలో కీలకమైన 34 విభాగాలను ప్రైవేటీకరించేందుకు ఉక్కు యాజమాన్యం ఆదివారం నోటిఫికేషన్ జారీచేయడం కలకలం రేపుతోంది. ఈ వ్యవహారంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కర్మాగారం విషయంలో యాజమాన్యం గోప్యత పాటిస్తూ రోజుకో నిర్ణయం తీసుకుంటోందని అంటున్నారు. మరోవైపు.. ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు కేంద్రం ప్రకటన జారీ చేసిన నాటి నుంచి ఇప్పటి వరకు కర్మాగారంలో విభిన్న పరిస్థితులు నెలకొంటున్నాయి. ఒక పక్క ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం జరుగుతున్నా.. మరోవైపు ప్లాంట్‌లో ఒక్కో విభాగం ప్రైవేటీకరించేందుకు యాజమాన్యం ప్రణాళికాయుతంగా అడుగులు వేస్తోంది. ఇప్పటి వరకు కొన్ని విభాగాలను ప్రైవేటీకరించేందుకు వరుసగా నోటిఫికేషన్లు జారీ చేయగా, తాజాగా ఒకేసారి 34 విభాగాలను ప్రైవేటీకరించేందుకు ప్రకటన విడుదల చేసింది. ఓ పక్క ప్లాంట్‌కు పూర్వ వైభవం తెస్తామని చెబుతున్న యాజమాన్యం.. ఇలా అన్ని విభాగాలను ప్రైవేటీకరించేందుకు నోటిఫికేషన్లు జారీచేస్తూ ద్వంద్వ విధానాలు పాటిస్తోందనే వాదన వినిపిస్తోంది. అసలు ప్లాంట్‌లో ఏం జరుగుతోందో తెలియడం లేదని కార్మిక సంఘాలు అంటున్నాయి.

వీటికే నోటిఫికేషన్!

క్యాప్టివ్ పవర్‌ప్లాంట్, వేస్ట్ హీట్ రికవరీ థర్మల్ పవర్‌ప్లాంట్, క్యాప్టివ్ పవర్‌ప్లాంట్-2, వైర్‌రాడ్ మిల్, బ్లాస్ట్‌ఫర్నేస్ -1, 2, 3 విభాగాలు, స్టీల్ మెల్ట్‌షాప్, రోల్‌షాప్ అండ్ రిపేర్‌షాప్, ఈఎస్‌అండ్‌ఎఫ్(ఫౌండ్రీ), మిల్స్, స్ట్రక్చరల్ బార్ మిల్(ఎస్‌బీఎం), ఈ అండ్ ఈఎన్ఎండీ, మాదారం డోలమైట్ మైన్, స్పెషల్ బార్‌మిల్స్, రోల్‌షాప్ ఏరియా, గ్యాస్ క్లీనింగ్ ప్లాంట్, స్పెషల్ బార్ మిల్స్ షిప్పింగ్ ఏరియా, ఎంఎంఎస్ఎం, కంటిన్యూ కాస్టింగ్ డివిజన్(సీసీడీ).

మాకు న్యాయం చేయండి

- వేర్వేరు మాధ్యమాల పేపర్లకు కలిపి ఒకే విధంగా నార్మలైజేషన్
- దీనివల్ల తీవ్రంగా నష్టపోతున్నాం.. డీఎస్సీ రాసిన అభ్యర్థుల ఆవేదన
- నిబంధనలు పాటించాం: కన్వీనర్

అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పేపర్ల నార్మలైజేషన్ ప్రక్రియపై డీఎస్సీ అభ్యర్థులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్ గణితం పరీక్షలో వేర్వేరు మాధ్యమాల పేపర్లకు ఒకేరకంగా నార్మలైజేషన్ చేయడంవల్ల తమకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీఎస్సీ పరీక్షల్లో భాగంగా జూన్ 12న స్కూల్ అసిస్టెంట్ గణితం పరీక్ష జరిగింది. ఉదయం సెషన్‌లో తెలుగు మీడియం అభ్యర్థులకు పరీక్ష నిర్వహించగా 20,254 మంది రాశారు. మధ్యాహ్నం తెలుగుతో పాటు కన్నడ, ఒడియా, తమిళం, ఉర్దూ మీడియంలకు కలిపి పరీక్ష జరిగింది. 15,608 మంది ఈ పరీక్షకు హాజరయ్యారు. కాగా, రెండు సెషన్లలో తెలుగు మీడియం అభ్యర్థులు పరీక్ష రాయడంతో అందరికీ కలిపి మార్కులు నార్మలైజేషన్ చేశారు. దీంతో మధ్యాహ్నం సెషన్‌లో పరీక్ష రాసిన తెలుగు మీడియం అభ్యర్థులకు ఏకంగా ఐదారు మార్కులు పెరిగాయని చెబుతున్నారు. ఒకే మీడియం అభ్యర్థులకు నార్మలైజేషన్ చేయాలని, ఇలా వేర్వేరు మీడియంలకు చెందిన పేపర్లను కలిపి చేయడం వల్ల తమకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, దీనిపై డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డిని వివరణ కోరగా.. నిబంధనల ప్రకారమే నార్మలైజేషన్ చేశామని తెలిపారు. వేర్వేరు మీడియంలు అయినా కలిపి నార్మలైజేషన్ చేయవచ్చన్నారు. దీనిపై అభ్యర్థుల నుంచి వినతులు అందాయని, కానీ వారి వాదన సమంజసం కాదని తెలిపారు.

ఉమ్మడి సర్వీసు రూల్స్‌పై చర్చించాలి

- మంత్రి లోకేశ్‌కు ఏపీటీఎఫ్ డిమాండ్

అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖలో అకడమిక్, టీచర్ల ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యలపై ఉపాధ్యాయ సంఘాలతో మంత్రి లోకేశ్ వెంటనే సమావేశం నిర్వహించాలని ఏపీటీఎఫ్ అధ్యక్షుడు జి.హృదయరాజు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం విజయవాడలో జరిగింది. బోధనకు ఆటంకం కలిగించే యాప్‌లు తొలగించాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ కోసం అధికారులు, ఉపాధ్యాయ సంఘాలతో కమిటీ నియమించాలని తీర్మానాలు చేశారు. పంచాయతీరాజ్ టీచర్లకు పదోన్నతుల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని, యాజమాన్యాల వారీగా డీఎస్సీల్లో వేర్వేరు కౌన్సెలింగ్ నిర్వహించాలనుకోవడం ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు విరుద్ధమని నాయకులు పేర్కొన్నారు.

వారికి పాత పెన్షన్ అమలు చేయాలి

- ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం లేఖ

అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలపై ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మద్ది బాబూ రాజేంద్రప్రసాద్, చందోలు వెంకటేశ్వర్లు ఆదివారం సీఎస్ సెక్రటరీకి లేఖ రాశారు. 2004, సెప్టెంబరు 1కి ముందు విడుదలైన నోటిఫికేషన్లతో ఉద్యోగాలు సాధించిన వారికి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. 12వ వేతన సవరణ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న 3డీఏలు విడుదల చేయాలని కోరారు.

దివ్యాంగ విద్యార్థులకు సరాసరి మార్కులు

- పాఠశాల విద్యాశాఖ వెల్లడి

అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నీట్‌లో అర్హత సాధించిన లేదా మెడిసిన్ సీటు పొందిన దివ్యాంగ విద్యార్థులకు మినహాయింపు సబ్జెక్టుకు సరాసరి మార్కులు ఇవ్వనున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. దివ్యాంగ విద్యార్థులకు ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఒక భాషా సబ్జెక్టు మినహాయింపు ఉంది. దీనివల్ల మెడిసిన్ సీటు కోల్పోయే పరిస్థితి వస్తోంది. దీంతో ఆ విద్యార్థులకు మిగిలిన సబ్జెక్టుల్లో వచ్చిన మార్కుల సరాసరిని తీసి మినహాయింపు సబ్జెక్టుకు మార్కులు ఇస్తారు. దీనికి అనుగుణంగా మార్కుల మెమోలు మారుస్తారు. దీంతో ఆ విద్యార్థులకు సీటు లభించే అవకాశం ఉంది.

సినీ ఫక్కీలో గంజాయి స్మగ్లర్ అరెస్ట్

పోలీసులను కారుతో ఢీకొట్టి పరార్.. వెంబడించి కాల్పులు జరిపి పట్టుకున్న సీఐ

నిందితుడు పాత నేరస్థుడు.. 2015 నుంచీ గంజాయి సరఫరా

నెల్లూరు(క్రైం) ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కారుతో పోలీసులను ఢీకొట్టి పరారవుతున్న గంజాయి స్మగ్లర్‌ను నెల్లూరు జిల్లా పోలీసులు సినీ ఫక్కీలో వెంబడించి, కాల్పులు జరిపి పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 22 కేజీల గంజాయి, కారును స్వాధీనం చేసుకున్నారు. వివరాలివీ.. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ నుంచి కారులో 22 కేజీల గంజాయిని నెల్లూరులోని గంజాయి విక్రేత కోసం తరలిస్తున్నట్లు ఎస్పీ జి.కృష్ణకాంత్‌కు, ఈగల్ టీమ్‌కు సమాచారం అందింది. ఎస్పీ ఆదేశాలతో బాలాజీనగర్ సీఐ కె.సాంబశివరావు తన సిబ్బంది, ఈగల్ టీమ్ కానిస్టేబుల్ ఫిరోజ్‌తో కలిసి ఆదివారం తెల్లవారుజామున జాతీయరహదారిపై కాపు కాశారు. పెన్నా బ్రిడ్జికి ముందు నుంచి కారును పోలీసులు వెంబడించారు. కారు ఎస్వీజీఎస్ కళాశాల వద్ద యూటర్న్ తీసుకొంది. అక్కడున్న ఇద్దరు వ్యక్తులకు గంజాయి ఇచ్చేందుకు నిందితుడు కారు వేగాన్ని తగ్గించాడు. పోలీసులు చుట్టుముట్టడంతో గంజాయి తీసుకునేందుకు వచ్చిన ఇద్దరు పరారయ్యారు. నిందితుడు తప్పించుకునే క్రమంలో పోలీసులను ఢీకొట్టి కారును వేగంగా రివర్స్ తీసి ముందుకు దూసుకెళ్లాడు. వెనుక ఉన్న ఈగల్‌టీమ్ కానిస్టేబుల్ ఫిరోజ్‌ను ఢీకొనడంతో ఆయన ఎగిరి జాతీయరహదారిపై పడ్డాడు. సీఐ సాంబశివరావు స్మగ్లర్ కారును వెంబడిస్తూ రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. అయినా నిందితుడు కారు వేగం పెంచి ఎన్టీఆర్ నగర్‌లోకి దూసుకెళ్లి, కారును వదిలి పరుగులు తీశాడు. దీంతో పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. అతడితో పాటు కారును స్వాధీనం చేసుకుని, స్టేషన్‌కు తరలించారు. గాయాలపాలైన కానిస్టేబుల్ ఫిరోజ్‌ను జీజీహెచ్‌కు తరలించారు. నిందితుడు పాత నేరస్థుడని విచారణలో తేలింది. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన బీరక ప్రకాష్ అలియాస్ సూర్యప్రకాష్ కారుడ్రైవర్. ఈజీ మనీ కోసం కొన్నేళ్లుగా ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయిని విక్రేతలకు సరఫరా చేస్తున్నాడు. నిందితుడిపై 2015లో నెల్లూరు సంతపేట పోలీసు స్టేషన్, తూర్పుగోదావరి జిల్లా రంగంపేట పోలీసు స్టేషన్, 2022లో ఏలూరు జిల్లా జీలుగుమల్లి, 2023లో ఏలూరు ఎస్ఈబీ పోలీసుస్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో జైలుకు వెళ్లి బయటకు వస్తున్నా అతడి ప్రవర్తనలో మార్పురాలేదు. ఆదివారం తరలిస్తున్న గంజాయి నెల్లూరులోని గంజాయి విక్రేత జాకీరాబీకని పోలీసుల విచారణలో తేలింది.



గాయాలపాలైన ఈగల్ టీమ్ కానిస్టేబుల్ ఫిరోజ్‌ను పరామర్శిస్తున్న ఐజీ ఆకే రవికృష్ణ

కానిస్టేబుల్‌కు ఈగల్ ఐజీ పరామర్శ

ఈగల్ విభాగం ఐజీ ఆకే రవికృష్ణ నెల్లూరు చేరుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ ఫిరోజ్‌ను పరామర్శించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు ఆరా తీశారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ఈగల్ సెల్ 1972కు, స్థానిక పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఎవరా వైసీపీ మంత్రి కొడుకు?

(మొదటి పేజీ తరువాయి)

వరకూ ఈ గ్యాంగ్ సభ్యులు వెనుకాడబోరని నెల్లూరు, తిరుపతి జిల్లాల ఎస్పీల నివేదికలు చెబుతున్నాయి. శనివారం నాడు 'ఆంధ్రజ్యోతి' పత్రికలో ప్రచురితమైన 'ఖాకీనే వణికించే కిలేడి' కథనంతో రంగంలోకి దిగిన పోలీసులు, ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్న కొద్దీ అరుణ బాగోతాలు బయటకు వస్తున్నాయి. బాధితులు బయటకు వచ్చి గతంలో జరిగిన అరాచకాలను చెబుతున్నారు. ఆమెను చట్టపరంగా శిక్షించాలని వేడుకొంటున్నారు. యువకులతో బెదిరించి ఆమె చేసిన దందాలతో పాటు ప్రేమ పెళ్లిళ్ల సైతం ఉన్నాయని, లక్షలాది రూపాయలు వసూలు చేసిందని పోలీసులు ఆధారాలు సేకరించారు. అరుణకు ఎవరెవరితో ఎటువంటి పరిచయాలు ఉన్నాయి? అనే దిశగా కూపీ లాగుతున్న కొద్దీ కొత్త కొత్త లింకులు బయట పడుతున్నాయి.

తిరుపతి ఆస్పత్రిలో ఏమి జరిగింది?

నెల్లూరు సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న శ్రీకాంత్ చేతి గాయం వెనుక కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. ప్రమాదం జరగడం కల్పితమని, ఆస్పత్రిలో సెటిల్మెంట్ వివాదం సందర్భంగా జరిగిన దాడిలో పడిన కత్తి వేటుగా తెలుస్తోంది. తాజాగా పోలీసులకు లభించిన వీడియోల్లో.. తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో శ్రీకాంత్ ఎడమ చేతికి కట్టు కట్టుకుని బెడ్‌పై ఉండగా, ఎదురుగా నిడిగుంట అరుణ కూర్చొని తన మెడ చుట్టూ ఏదో క్రీమ్ రాయించుకుంటూ ఉంది. ఆ వీడియోలో శ్రీకాంత్ చేతికి కట్టు చూసిన పోలీసులు.. అంతకు ముందే లభించిన సమాచారం ఆధారంగా దాని గురించి ఆరా తీశారు. గత ఏడాది డిసెంబరు 17న నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి వైద్యం కోసం శ్రీకాంత్‌ను తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తీసుకెళ్తుండగా రోడ్డుకు అడ్డంగా బైకు రావడంతో ప్రమాదం జరిగిందని, శ్రీకాంత్ చేతికి గాయమైందని రక్షణగా వెళ్లిన సాయుధ పోలీసులు చెప్పారు. అయితే నెల్లూరు జైలులో డాక్టర్ పరిశీలించి అది ప్రమాదంలో ఏర్పడిన గాయం కాదని, కత్తి లేదా పదునైన ఆయుధంతో నరికినట్లు ఉందని అనుమానం వ్యక్తం చేశారు. దీంతో జైలు సూపరింటెండెంట్ ప్రమాదానికి సంబంధించిన ఎఫ్ఐఆర్ అడిగితే.. కేసు పెట్టలేదని ఏఆర్ పోలీసులు చెప్పారు. అదే సమయంలో ప్రభుత్వంలోని పెద్ద బ్యూరోక్రాట్ నుంచి ఒత్తిడి రావడంతో చేతి కట్టు గాయం వ్యవహారంలో ముందుకు వెళ్లకుండా ఆగిపోయారని తెలిసింది. వాస్తవానికి ఆస్పత్రిలో సెటిల్మెంట్ సందర్భంగా జరిగిన గొడవలో శ్రీకాంత్ ఒక వ్యక్తిపై దాడి చేయగా, ప్రత్యర్థి కత్తితో వేసిన దెబ్బ తప్పించుకోవడానికి అతను చేయి అడ్డు పెట్టినప్పుడు గాయమైందని దాదాపు రుజువైనట్లు తెలిసింది. రోడ్డు ప్రమాదానికి గురైన కారు కూడా ప్రైవేటు వాహనంగా తేలింది. ఆ రోజు ఎవరెవరికి గొడవ జరిగింది? అంతకు ముందు శ్రీకాంత్ వెళ్లిన ప్రతిసారీ ఎవరెవరు ఆస్పత్రికి వచ్చారు? జైలు బయటికి వచ్చినప్పుడు అరుణ నంబర్‌తో ఎవరెవరికి ఫోన్లు వెళ్లాయి? వారిలో బాధితులు ఎవరు? అనే కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ క్రమంలో సుమారు 30 మంది వరకూ ప్రశ్నించినట్లు తెలిసింది. అనారోగ్యం పేరుతో ఆస్పత్రికి వచ్చి బెదిరింపులకు దిగుతున్న శ్రీకాంత్‌ను మరో జైలుకు తరలించి, అరుణ దందాలపై పక్కా ఆధారాలు సేకరించి చట్టపరంగా చర్యలకు ఉపక్రమించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అరుణ సామాన్యురాలట..!

పోలీసుల విచారణలో బాధితుల కన్నీళ్లు, అరుణ అరాచకాలు వెలుగులోకి వస్తుండగా.. అరుణ మాత్రం తానే బాధితురాలినని, ఎంతగానో ఇబ్బంది పడ్డానని చెబుతోంది. రాజకీయ నాయకులు డబ్బులు మోసం చేస్తే, పోలీసులు తనను తీవ్రంగా హింసించారంటూ ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఒక ఎస్ఐ తనకు తడలో పోస్టింగ్ ఇప్పించాలని బెదిరించారని, లేకపోతే శ్రీకాంత్‌పై మరిన్ని కేసులు పెడతానంటూ తనను చిత్రహింసలకు గురి చేసినట్లు ఆరోపిస్తోంది. ఇక్కడే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఒక సాధారణ మహిళగా చెప్పుకొంటున్న అరుణ దగ్గరికి ఎస్ఐ వచ్చి పోస్టింగ్ ఇప్పించమని అడిగారంటే ఆమె స్థాయి ఏ పాటితో అర్థం అవుతుంది. అరుణ చెబుతున్నట్లు 'దిశ' యాప్ ప్రచారకురాలికి ఎస్ఐ పోస్టింగ్ ఇప్పించే స్థాయి ఆమెకు ఉంటుందా? సామాన్యురాలికి మంత్రి కుమారుడితో మాట్లాడుకుని లంచంగా పదకొండు లక్షల రూపాయలు ఇచ్చే శక్తి ఉంటుందా? నిశితంగా పరిశీలిస్తే ఆమెకు చాలా పైస్థాయిలో పెద్దవారితో సంబంధాలు ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

రౌడీషీటర్‌కు రాచమర్యాదలు

నెల్లూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నెల్లూరు సెంట్రల్ జైలులో జీవితఖైదుగా ఉన్న రౌడీషీటర్ శ్రీకాంత్ లీలలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. శ్రీకాంత్ ఆస్పత్రిలో ఉన్నప్పుడు నిడిగుంట అరుణ అతడితో సన్నిహితంగా మెలిగిన వీడియోలు వైరల్‌గా మారాయి. నిబంధనల ప్రకారం జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీకి ఇతరులతో మాట్లాడే అవకాశం ఉండదు. ములాఖత్ సమయంలో మాత్రమే మాట్లాడే అవకాశం కల్పిస్తారు. ఏదైనా అనారోగ్యంతో ఆస్పత్రికి తీసుకువచ్చినప్పుడు ఖైదీ వెంట ఎస్కార్ట్ సిబ్బంది ఉంటారు. కానీ వైరల్ అవుతున్న వీడియోల్లో శ్రీకాంత్, అరుణ చేతిలో చేయి వేసుకుని పక్కపక్కనే కూర్చుని మాట్లాడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఈ తతంగం మొత్తాన్ని వారే వీడియో తీయించుకుంటున్నట్లు అర్థమవుతోంది. ఇంత ధైర్యంగా నిబంధనలు అతిక్రమిస్తుంటే జైలు అధికారులు, పోలీసు అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్న తలెత్తుతోంది. ఈ వీడియోలపై అరుణ సోషల్ మీడియాలో స్పందించారు. జైలు సూపరింటెండెంట్ అనుమతితోనే తాను శ్రీకాంత్‌కు కేర్ టేకర్‌గా ఆస్పత్రికి వెళ్లినట్లు వివరించారు.

సెటిల్మెంట్ల కోసం ఆస్పత్రికి...

పోలీసు వాహనంలో శ్రీకాంత్‌ను ఆస్పత్రికి తీసుకెళ్తున్నప్పుడు అతని చేతికి గాయమయ్యేంత ప్రమాదం జరిగిందని రక్షణగా ఉన్న సాయుధ పోలీసులు చెప్పారు. అయితే పోలీసు వాహనం దెబ్బతిన్నట్లు ఎక్కడా కూడా లేదు. ఈ అనుమానాలపై లోతుగా విచారిస్తే సంచలన విషయాలు బయటికి వస్తాయంటూ ఒక అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారంతో పోలీసులు కూపీ లాగారు. ప్రతి రెండు, మూడు వారాలకు ఒకసారి ఏదో ఒక అనారోగ్య సమస్య చెప్పి శ్రీకాంత్ నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి తిరుపతి ఆస్పత్రికి వెళ్లేవాడు. పోలీసు వాహనం గూడూరు దాటగానే సెక్యూరిటీ సిబ్బందిని మేనేజ్ చేసేవాడు. తన గ్యాంగ్ తీసుకొచ్చిన ప్రైవేటు కారులో అరుణతో కలిసి ప్రయాణించేవాడు. ఏ సెటిల్మెంట్ చేయాలో ఆమె చెబితే, సంబంధిత వ్యక్తులను ఫోన్‌లో బెదిరించడం లేదా ఆస్పత్రికి రప్పించేవాడని, అలా సెటిల్మెంట్ల ద్వారా వచ్చిన డబ్బుతోనే అరుణ విలాసవంతమైన జీవితాన్ని అనుభవిస్తోందని, శ్రీకాంత్‌ను తరచూ బయటికి రప్పించేందుకు ఖర్చు చేస్తోందని పోలీసులకు పూర్తి సమాచారం అందింది. జైలులో జీవిత ఖైదు అనుభవిస్తున్న శ్రీకాంత్‌తో గతేడాది ఫిబ్రవరిలో అరుణకు ఎంగేజ్‌మెంట్ జరిగింది. కానీ శ్రీకాంత్ తన భర్త అని చెబుతోంది.

వరద దుష్ప్రచారంపై కేసులు

- వైసీపీ అనుకూల మీడియాపై ప్రభుత్వం కొరడా
- కొండవీటి వాగు వరదను గుంటూరు చానల్‌కు మళ్లించారని జగన్ చానల్లో కథనం
- పొన్నూరును ముంచేశారని తప్పుడు ప్రచారం
- ప్రకాశం బ్యారేజీ గేటు విరిగింది.. బెజవాడకు వరద ముప్పుందంటూ సుమన్ టీవీ ప్రసారం
- ఇంజనీర్ల ఫిర్యాదులు.. కేసుల నమోదు

అమరావతి/గుంటూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలను భయభ్రాంతులను చేసేలా.. కొండవీటి వాగు, ప్రకాశం బ్యారేజీ గేట్లు పనిచేయడం లేదని, పొన్నూరు, విజయవాడ నగరాన్ని వరద నీరు ముంచెత్తనుందని తప్పుడు ప్రచారానికి తెరదీసిన వైసీపీ అనుకూల మీడియాపై పోలీసులు కేసులు నమోదుచేశారు. ఆ ప్రాజెక్టుల గేట్లు పనిచేయడం లేదంటూ రెండ్రోజులుగా వైసీపీ, ఆ పార్టీ అనుకూల మీడియా దుష్ప్రచారం చేస్తున్నాయి. ముంపు బారిన పడకుండా అమరావతిని రక్షించుకునేందుకు కొండవీటి వాగు వరద నీటిని గుంటూరు, అప్పాపురం చానళ్లకు మళ్లించారని.. దీంతో పొన్నూరులో వేల ఎకరాలు మునిగాయని వైసీపీ నేత అంబటి మురళీకృష్ణ ఆరోపించారు. జగన్ మీడియాలో ఈ మేరకు కథనాలు వండివార్చారు కూడా. ఈ ప్రచారాన్ని జలవనరుల శాఖ అధికారులు ఖండించారు. అసలు గుంటూరు చానల్‌కు నీరే వదల్లేదని స్పష్టం చేశారు. వర్షాలతో స్థానిక డ్రెయిన్లు, కాల్వల ద్వారా ప్రవాహాలు వచ్చి చేరినట్లు తెలిపారు. పొన్నూరు మునుగుతోందంటూ ప్రజలను భయాందోళనలకు గురిచేయడంపై కొండవీటి వాగు ప్రాజెక్టు ఏఈఈ సీహెచ్ అవినాశ్ ఆదివారం తాడేపల్లి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సాక్షి టీవీ న్యూస్, ఇతరులపై విపత్తు నిర్వహణ చట్టం-2005 కింద బీఎన్ఎస్ 353(1) సెక్షన్, 54వ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. ప్రకాశం బ్యారేజీ గేటు పనిచేయడం లేదంటూ మరో అసత్య కథనం ప్రసారం చేసిన సుమన్ టీవీపైనా అధికారులు ఫిర్యాదు చేశారు. 67వ నంబరు ఖానా వద్ద గేటు పనిచేస్తోందని స్పష్టం చేశారు. 'విరిగిపోయిన 67వ గేటు.. భారీ వరదకు విజయవాడ మునిగేలా ఉంది' అంటూ ప్రసారం చేసిన సుమన్ టీవీ న్యూస్ తెలుగు చానల్‌పై ఏఈఈ సత్యరాజేశ్ శనివారం ఫిర్యాదు చేశారు. దీంతో బీఎన్ఎస్ 353(1), 54 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి పోలీసులు విచారణ ప్రారంభించారు. తప్పుడు కథనాలపై వన్‌టౌన్ పోలీసు స్టేషన్లో కూడా కేసు నమోదైంది.

పోలవరంపైనా..

పోలవరంఎగువ కాఫర్ డ్యాంలో స్వల్పంగా కుంగిన ప్రాంతాన్ని జలవనరుల శాఖ అధికారులు ఇప్పటికే సరిచేశారని, అయినా తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదని జలవనరుల శాఖ అధికారులు స్పష్టం చేశారు. కాఫర్ డ్యాం మరమ్మతు చేశామని ఇప్పటికే వివరాలను విడుదల చేశామని గుర్తుచేశారు.

అమరావతిపై అసత్య ప్రచారాలు చేస్తే బడితె పూజ ఖాయం

- క్రిమినల్ కేసులు పెడతాం..రైతు జేఏసీ హెచ్చరిక

తుళ్లూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): 'వర్షాలు పడితే హైదరాబాద్, చెన్నై నగరాల్లో రోడ్లన్నీ మునిగి జనజీవనం అస్తవ్యస్తంగా తయారవుతుంది. కానీ ఈ రాజధానులపై ఆ రాష్ట్రాల ప్రజలు ఎప్పుడూ విమర్శలు చేయలేదు.. మరి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిపై అభాండాలు వేస్తూ, అసత్య ప్రచారాలు చేస్తున్న ఇక్కడ వారిని 'ఏం చేయాలి' అని రాజధాని అమరావతి రైతులు ధ్వజమెత్తారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో అమరావతి ముంపునకు గురవుతుందని కొన్ని మీడియా సంస్థలు ప్రచారం చేయడంపై వారు మండిపడ్డారు. మీడియా గానీ, వ్యక్తులు గానీ ఇలా అసత్య ప్రచారాలు చేస్తే బడితె పూజ ఖాయమని.. క్రిమినల్ కేసులు పెడతామని రాజధాని రైతుల జేఏసీ హెచ్చరించింది. ముంపునకు గురైతే సచివాలయం, హైకోర్టు ఎలా నడుస్తున్నాయని జేఏసీ నేతలు ఆలూరి శ్రీనివాసరావు, కంచర్ల గాంధీ, ఇ.సీతారామయ్య తదితరులు ఆదివారం ఓ ప్రకటనలో నిలదీశారు. సీడ్ యాక్సెస్ రోడ్డుపై రాకపోకలు నిరంతరాయంగా నడుస్తున్నాయని స్పష్టం చేశారు అమరావతిపై విషం చిమ్మాలని చూస్తే సహించేది లేన్నారు.

లోన్ యాప్ బాధితులకు 48 లక్షలు రికవరీ

- వంద మంది బ్యాంకు ఖాతాల్లో జమ
- క్రిప్టో కరెన్సీ రూపాయల్లోకి మార్పు
- రాష్ట్రంలో తొలిసారి విశాఖ పోలీసుల కృషి

విశాఖపట్నం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల నుంచి సొమ్ము రికవరీ చేయడంలో ఏపీ పోలీసులు సత్తా చాటుతుండగా... విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు రాష్ట్రంలోనే మొదటిసారిగా సీజ్ చేసిన క్రిప్టో కరెన్సీని మన రూపాయల్లోకి మార్చి బాధితుల బ్యాంకు ఖాతాల్లో వేశారు. వంద మంది బ్యాంకు ఖాతాల్లో రూ.48 లక్షలు జమ చేశారు. సైబర్ క్రైమ్ గణాంకాల ప్రకారం విశాఖ నగరంలో 295 మంది లోన్‌యాప్ బాధితులు ఉండగా.. సుమారు వంద మంది అధిక మొత్తంలో నష్టపోయారని గుర్తించామని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఇన్‌స్టంట్ లోన్‌యాప్‌లో సీజ్ అయిన క్రిప్టో కరెన్సీని ఇండియన్ కరెన్సీలోకి మార్చి, న్యాయపరమైన చర్యలు తీసుకుని బాధితుల ఖాతాల్లో రూ.48 లక్షలు జమ చేశామన్నారు. సైబర్ నేరగాళ్లు ఇచ్చే కమిషన్‌కు ఆశ పడి బ్యాంకు ఖాతా ప్రారంభించినా, అకౌంట్లు బదిలీ చేసినా, బ్యాంకు అధికారులు సరిగ్గా పరిశీలించకుండా కరెంట్ బ్యాంకు ఖాతాలు తెరిచినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ క్రైమ్ ఫిర్యాదుల కోసం రిపోర్టింగ్ పోర్టల్ సైబర్‌క్రైమ్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ లేదా టోల్ ఫ్రీ నంబరు 1930 లేదా కమిషనర్ 7995095799 నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయి డబ్బు పోగొట్టుకుంటే గోల్డెన్ అవర్ (గంటలోపు)లో ఫిర్యాదు చేస్తే రికవరీ చేసుకోవచ్చన్నారు. జాప్యం చేస్తే ఆ డబ్బు మూల్ బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారని, తర్వాత వివిధ దేశాలకు క్రిప్టో కరెన్సీగా వెళ్లిపోతుందని, దానిని వెనక్కి తీసుకురావడం కష్టంగా మారుతుందని అన్నారు.



అల్లూరి జిల్లా చింతపల్లి మండలం రాజుపాకల అప్రోచ్‌రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వర్షం నీరు

దంచికొట్టిన వాన

విశాఖ, శ్రీకాకుళం సహా పలు ప్రాంతాల్లో భారీ వర్షం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

అల్పపీడనం ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో వానలు దంచికొడుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపిలేకుండా జడివాన కురుస్తూనే ఉంది. విశాఖ జిల్లా కాపులుప్పాడలో 15.3, అల్లూరి జిల్లా పాడేరులో 13.4, అనకాపల్లి జిల్లా చీడికాడలో 12.3, శ్రీకాకుళం జిల్లా హరిపురంలో 12 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మత్స్యగెడ్డ ఉగ్రరూపం దాల్చడంతో రాయిగెడ్డ కాజ్‌వే పైనుంచి వర్షం నీరు ప్రవహించింది. కాజ్‌వేకి అవతల ఉన్న గ్రామాల గిరిజనులు ఇళ్లకే పరిమితమయ్యారు. జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లోని గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పంట పొలాల్లో నీరు చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. అనకాపల్లి జిల్లాలోనూ లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. పలు చోట్ల వృక్షాలు నేలకొరిగాయి. చోడవరం మండలంలోని దుడ్డుపాలెంలో పిడుగుపాటుకు 30 గొర్రెలు మృతి చెందాయి. విశాఖ జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ సోమవారం సెలవు ప్రకటించారు. శ్రీకాకుళం జిల్లాలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో వర్షం నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. పంటపొలాలు చెరువుల్లా తయారయ్యాయి. మందసలో సముద్రం అల్లకల్లోలంగా మారి తీరంలోని పడవలు కొట్టుకుపోయాయి. సముద్రం ముందుకు రావడంతో తీరప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇక ఏలూరు జిల్లాలో కొల్లేరుకు ఎగువ నుంచి పెద్దఎత్తున వరద చేరడంతో లంక గ్రామాలను నీరు చుట్టుముట్టింది. పెద్దఎడ్లగాడి నుంచి పెనుమాకలంకకు వెళ్లే రహదారిపై మూడడుగుల మేర నీరు చేరడంతో రాకపోకలను నిలిపివేశారు. ప్రజలు ట్రాక్టర్లపై రాకపోకలు సాగిస్తున్నారు. మరో రెండు రోజుల్లో కొల్లేరుకు మరింత వరద నీరు పెరగనున్నట్టు హెచ్చరికలు చేయడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో వర్షాలకు 24,500 ఎకరాల్లో పంట నీట మునిగింది. గత ఏడాది నాట్లుపూర్తిఅయిన తర్వాత 28వేల ఎకరాలల్లో వరి పొలాలు దెబ్బ తిన్నాయి. ఈ ఏడాది అదే పునరావృతం కానుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

కృష్ణా, గోదావరిలో వరద ఉధృతి

కృష్ణానదిలో వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు 2,08,330 క్యూసెక్కుల వరద పులిచింతల ప్రాజెక్టుకు చేరుతోంది. మూసీనది నుంచి వస్తున్న నీరు కూడా పులిచింతలలో కలుస్తోంది. పులిచింతల నుంచి 1,93,885 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో పాటు మునేరు వాగు నుంచి వస్తున్న వరదతో ప్రకాశం బ్యారేజీలో నీటిమట్టం పెరిగింది. బ్యారేజీ 70 గేట్లను ఎత్తి 2,85,392 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి పంపుతున్నారు. గోదావరిలోనూ నీటిమట్టం భారీగా పెరుగుతోంది. భద్రాచలం వద్ద ఆదివారం నీటిమట్టం 33.60 అడుగులకు చేరింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేలోకి అదనంగా వస్తున్న 5,14,353 క్యూసెక్కులను జలవనరుల శాఖ అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. స్పిల్‌వే ఎగువన 30.18 మీటర్లు, దిగువన 20.80 మీటర్ల నీటిమట్టం నమోదైంది.

5 జిల్లాలకు రెడ్ అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

పయనించనుంది. రుతుపవన ద్రోణి తూర్పుభాగం ఆదివారం నాటికి జగదల్‌పూర్ నుంచి బంగాళాఖాతం వరకు విస్తరించింది. ఛత్తీస్‌గఢ్‌లోని మరో అల్పపీడనం ఆదివారం విదర్భ వద్ద కేంద్రీకృతమైంది. ఇంకా బంగాళాఖాతంలోని అల్పపీడనం నుంచి ఉత్తరాంధ్ర, ఛత్తీస్‌గఢ్, విదర్భ, గుజరాత్ మీదుగా అరేబియా సముద్రం వరకు తూర్పు, పడమర ద్రోణి విస్తరించింది. వీటన్నింటి ప్రభావంతో నైరుతి రుతుపవనాలు బలపడి బంగాళాఖాతం నుంచి కోస్తాంధ్ర పైకి భారీగా తేమగాలులు వీస్తున్నాయి. ఈ నేపథ్యంలో విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాలతోపాటు యానాంకు విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం రెడ్ అలర్ట్ ప్రకటించింది. మంగళవారం ఉదయం వరకు ఆ జిల్లాలతో పాటు పలు జిల్లాల్లో కుంభవృష్టి, మరికొన్ని చోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆదివారం ఉత్తరాంధ్రలో అనేకచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. కోస్తాలో మిగిలిన ప్రాంతాలు, రాయలసీమలోనూ వర్షాలు పడుతున్నాయి. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, యానాం, అంబేద్కర్ కోనసీమ, తూర్పు, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలో అక్కడక్కడ కుంభవృష్టి, కోస్తాలోని మిగిలిన జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయి. ఇంకా రాయలసీమలోని తిరుపతిలో భారీగా, మిగిలిన జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయి. సముద్రం అల్లకల్లోలంగా మారిందని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని తుఫాన్ హెచ్చరిక కేంద్రం సూచించింది. విశాఖపట్నం, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, నిజాంపట్నం, కృష్ణపట్నంలో మూడో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు.

అధికారులూ అప్రమత్తం!

అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశం ఉన్నందున హోంమంత్రి వంగలపూడి అనిత ఆదివారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో మాట్లాడారు. అత్యవసర సేవల కోసం జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరమైతే ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాలని స్పష్టం చేశారు. ప్రజలకు అత్యవసరమైతే విపత్తుల నిర్వహణ సంస్థ టోల్‌ఫ్రీ నంబర్లు 112, 1070, 18004250101లో సంప్రదించాలని కోరారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.